187

సృజన

ఆధునిక సాహిత్యవేదిక

మాసపత్రిక

నిర్వహణ
'సాహితీమిత్రులు'

మే
1991

సృజన

ఆధునిక సాహిత్య వేదిక

187 మాసపత్రిక మే 1991

ఈ సంచికలో....

నిర్వహణ

'సాహితీమిత్రులు'

సంవత్సర చందా రు. 40 ఈ సంచిక రు. 4

Edited, Printed and Published by P Hemalatha, Flat 11, Block 2, MIG II, Baghlingampalli, Hyderabad-500 044 and Printed at Nagendra Press, Vijayawada-520 002

Working Editor : Vara Vara Rao

సంపాదకీయం :

మేడే

మేడేనాడు మా కార్మికులకు సెలవొద్దనీ, దాని బదులు హోలీ పండగనాడు ఇప్పించమనీ భారతీయ మజ్దూర్ సంఘ్ ఈ మధ్య హైదరాబాద్ సమీపంలోని ఒక ఫాక్టరీ యాజమాన్యంతో ఒప్పందం చేసుకుంది. ఒకప్పుడసలు విశ్వకర్మ జన్మదినమే భారతీయ కార్మికులకు పర్వదినం గానీ 'విదేశీ' చరిత్ర నుండి వచ్చిన మేడే కాదని దత్తోపంత్ ఠేంగ్డీ వంటి ఆర్. ఎస్. ఎస్. సిద్ధాంతవేత్తలనేవారు. ఇప్పుడు హోలీ పండుగదాకా డిగొచ్చారంటే విశ్వకర్మ పుట్టిన తిథి నక్షత్రాల నుంచి బ్రాహ్మణులలో ఏకాభిప్రాయం లేకపోవడం కారణం కాదు. ఈ దేశాన్ని మొత్తంగా బ్రాహ్మణీకరించడం సులభంగా అయ్యేపని కాదనీ, బ్రాహ్మణ్యాన్ని వున్నదున్నట్టు ప్రచారం చేయక ప్రజలలో ప్రాచుర్యం పొందిన మతాచారాల రూపంలో ప్రచారం చేస్తేనే ఆ పని ఒకనాటికయినా అవుతుందనీ హైందవ సిద్ధాంతవేత్తలు ఈ మధ్య నిర్ణయించుకున్నారు. ప్రజలు అనే భావనే స్వాభావికంగా ఈసడించుకునే నైజాన్ని పక్కకుపెట్టి ఇప్పుడు రాముడు, వినాయకుడు, హోలిపండుగ మొదలైనవాటి పేరు మీద ప్రజలను సమీకరించే కార్యక్రమం అమలు చేస్తున్నారు. తొలినాటి ఆర్.ఎస్.ఎస్. మనునీతి ప్రచారానికి ఉపనిషత్తుల స్తోత్రానికి ఈనాటి విశ్వహిందూ పరిషత్, భజరంగ దళ్, శివసేన, భారతీయ జనతా పార్టీల మతప్రచారానికి తేడా స్పష్టంగానే వుంది.

అయినా ఎర్రజెండా కార్మికసంఘాలు మేడే కి, హోలిపండుగకి మధ్య తేడాను చెరిపేసి చాలాకాలమైంది. ఈ మధ్య హైదరాబాద్‌లో జరిగిన మార్క్సిస్టుపార్టీవారి సి.ఐ.టి.యు. మహాసభల కార్యక్రమాన్ని చూసినవారికి ఎరుపుకి, కాషాయానికి మధ్యనున్న తేడాను పక్కకుపెడితే, ఈ సంబరాలకు, అదే నగరవీధులలో ప్రతి సంవత్సరం జరిగే వినాయక నిమజ్జనానికి భేదం ఏమీలేదనిపించింది. వీధి పొడవునా అవే కొబ్బరిచెట్ల స్తంభాలు, కొబ్బరాకుల తోరణాలు, అదే బాజాసంచా, బాజా భజంత్రీలు, అవే చేతకొలమీద సుజుకీలమీద అదే మధ్యతరగతి కార్యకర్తలు ఎర్రబొట్లు బదులు ఎర్రచొక్కాలు చీరలు— ఈ సంరంభమే కార్మికవర్గ సమరోత్సాహ ప్రదర్శనమైతే దానిని చికాగో అమరవీరుల స్మృతిలోనే ఎందుకు జరుపుకోవాలి? హోలీ పండగకి మాత్రం ఎర్రరంగు పడదా, వినాయకుని నిమజ్జనోత్సవంలో ఎర్రబొట్లకి

కాదవా? గులాల్ అయితేనేం, శ్రీ చూర్ణం అయితేనేం, సిందూరమైతేనేం, అమ్మవారికి బలి ఇచ్చిన దున్నపోతు రక్తమైతేనేం అన్నీ ఎరుపే కదా!

సంఘటిత పారిశ్రామిక కార్మిక వర్గానికి, మధ్యతరగతి ఉద్యోగ వర్గానికి పరిమితం అయ్యాయని సి. పి. ఐ., సి. పి. యం. ల కార్మిక సంఘాలను చాలా కాలంగా విప్లవకారులే కాదు, అట్టడుగు శ్రామికవర్గం అభ్యున్నతిని కాంక్షించే మానవతావాదులూ విమర్శిస్తూనే వున్నారు. ఆ కార్మిక ఉద్యోగవర్గాలు తమ పోరాటాలలో తమ కోసం ఎంతో కొంత సాధించుకున్నాయి కాని పేదలపట్ల కనీస సానుభూతి సౌహార్దభావం లేని స్వార్థపరశక్తులుగా మారాయనికూడ విమర్శిస్తున్నారు. ఈ రాజకీయ వినాశనానికి తోడు వ్యవస్థ ఇప్పుడు కార్మికవర్గాన్ని ఆర్థికంగానూ ఛిన్నాభిన్నం చేస్తూవుంది. ఆధునికీకరణ పేరిట వారిలో కొందరి జీవన విధానం ఆకర్షణీయమైన వినియోగవస్తు ప్రపంచంలోకి అడుగుపెడుతూ వుండగా, అత్యధికులు ద్రవ్యోల్బణం వాతపడి జీవన ప్రమాణాలను నిలుపుకోలేకుండ ఉన్నారు. లక్షల సంఖ్యలో కార్మికులు ఉద్యోగాలు పోగొట్టుకుని వీధిపాలవుతున్నారు. కొత్త ఉద్యోగావకాశాలు మృగ్యమయినాయి. భారతదేశ పారిశ్రామికీకరణకు ఒకనాడు నాంది పలికిన జౌళి పరిశ్రమ దీనికి చక్కటి ఉదాహరణ. చేనేత రంగం సంగతి దేవుడెరుగు. ఒక శతాబ్దం కింద చేనేతకు పోటీగా పుట్టిన బట్టల మిల్లులు ఇప్పుడు దేశవ్యాప్తంగా మూతబడిపోతూ వున్నాయి. పని కల్పించడంలో వ్యవసాయం తర్వాత రెండవ స్థానంలో వున్న జౌళి పరిశ్రమ ఇప్పుడు నిరుద్యోగానికి నిలయమైంది. లక్షలాది కార్మికులు ఉద్యోగాలు కోల్పోయి వూరి ముఖం పడుతున్నారు. కాని పాలియస్టర్ బట్టలపరిశ్రమ మటుకు సులువైన ముడి పదార్థపు దిగుమతులతో, ధారాళమైన పెట్టుబడి వనరులతో, విదేశీ సాంకేతిక ప్రక్రియలతో శరవేగంగా అభివృద్ధి చెందుతూ వుంది. ఈ అభివృద్ధి వలన కోటీశ్వరులైన పెట్టుబడిదారులు దేశ రాజకీయాలను శాసించే స్థితికి ఎదిగారు. జౌళి పరిశ్రమలో పుట్టిన బిర్లాలవంటి తొలితరం పెట్టుబడిదారులు ఇతర పారిశ్రామిక రంగాలకు విస్తరించి పైకిపోగా ఆ పరిశ్రమ ఇవ్వాళ పతనావస్థలో వుంది. దానిని తలదన్ని ముందుకు వచ్చిన పాలియస్టర్ పరిశ్రమలో నస్లీవాడియా వంటి కొత్తతరం కోటీశ్వరులు పైకి వస్తున్నారు. అదే జౌళి పరిశ్రమలో పుట్టిన మిలిటెంట్ లాల్ బావుటా కార్మిక ఉద్యమం జెండా రంగు మాత్రమే మిగుల్చుకుని పోరాటపటిమను పూర్తిగా కోల్పోయింది. ఇప్పుడు ఉద్యోగాలు పోగొట్టుకుని బట్టలమిల్లుల కార్మికులు కూలి చేసుకుని బతుకుతున్నారు.

పెరుగుతున్న ధరలు, స్తంభించిపోయిన పారిశ్రామిక వ్యాప్తి, ఆధునీకరణతో పెరుగుతున్న రిట్రెంచ్‌మెంట్‌లు, నోరెత్తితే సస్పెన్షన్లు, లాకౌట్లు, ఉద్యమిస్తే క్రిమినల్ కేసులు, ఎస్మా వారెంట్లు కిరాయి గూండాల దాడులు - ఇది ఈనాడు 'సంఘటితం' అని పిలవబడుతూ వున్న కార్మికవర్గం ఎదుర్కొంటున్న పరిస్థితి. మరి యూనియన్లు ఏం చేస్తున్నాయంటే ఏదో ఒక్క డిమాండ్ ఒప్పేసుకుంటే మిగిలిన వాటికోసం ఆందోళన చేయమని ఒప్పందాలు చేసుకుంటున్నాయి. జీతాలు కొంచెం పెంచితే ఇద్దరి పని ఒకరిచేత చేయించడానికి తామే కార్మికులను ఒప్పిస్తామని బేరమాడుతున్నాయి. ఈ డిమాండ్లు ఒప్పుకుంటే ఇంక ఐదేళ్ళు సమ్మె చేయమని అగ్రిమెంట్లు చేసుకుంటున్నాయి. ఆధునీకరణ ఫలితంగా రిట్రెంచ్ అయినవాళ్ళు పోగా మిగిలినవాళ్ళ జీతాలు పెంచితే తొలగించినవాళ్ళ గురించి అడగమని హామీలు ఇస్తున్నాయి. 'సంఘటిత' కార్మికవర్గం తన స్వప్రయోజనం కోసమైనా ఒక బలమైన పోరాటం దేశంలో ఎక్కడయినా నడిపి ఒక దశాబ్దం కావస్తోంది. ఆనాడైనా పోరాటం నడిపింది ఎర్రజెండా యూనియన్లు కావు, అవకాశవాద కాంగ్రెస్ కార్మిక నాయకుడు దత్తాసామంత్.

ఈ పరిస్థితిలో పారిశ్రామిక కార్మికులు తమ చుట్టూ వున్న అందమైన వస్తు ప్రపంచం వైపు అర్రులు చాస్తూనే మరొక వంక తమ వూళ్ళల్లో, ఇళ్ళల్లో వుండిపోయిన రైతుల వైపు, కూలి వాళ్ళవైపు చూడక తప్పడం లేదు. ఈ బతుకు వదిలి ఆ బతుకులోకి తిరిగిపోతున్న తమ కామ్రేడ్స్‌ను చూసి తామూ భయపడక తప్పడం లేదు. అట్టడుగు శ్రామిక వర్గాన్నీ, పేద రైతాంగాన్నీ వదిలిపెట్టి తాము మటుకు పైకి పోదామని ఇన్నాళ్ళ కార్మిక పోరాటాలలో వాళ్ళు అలవరచుకున్న ఆశ దురాశేనని చరిత్ర గమనమే రుజువు చేసింది. మొత్తం శ్రామిక ప్రజానీకానికి నాయకత్వం వహించి వాళ్ళ పోరాటాల అగ్రభాగాన నిలబడవలసిన చారిత్రక కర్తవ్యాన్ని ఇక పారిశ్రామిక కార్మికవర్గం విస్మరించడానికి వీల్లేదు.

ఇది దానంతటదే జరిగే పరిణామం కాదు. నిజమైన కమ్యూనిస్టు కార్మికోద్యమం తిరిగి దేశంలో బలపడవలసి వుంది. అది ప్రభుత్వంతో, యాజమాన్యంతో తలపడాలి. 'గుర్తింపు పొందిన' యూనియన్ల స్వార్థంతో, అవకాశవాదంతో తలపడాలి. కార్మికవర్గ పోరాటాలలో కార్మిక రాజకీయాలకు తావులేకుండా చేసిన ఆర్థికవాదంతో

(మిగతా 16వ పేజీలో)

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి

చెరబండరాజు

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల డేగలు
రక్తం తాగే రాబందుల మూకలు

కలల పర్యాయ పదాల పచ్చనిచెట్లూ
కళ్ళ లోగిళ్ళలోని ఆశాప్రసూనాలు
పాపలూ కనుపాపలూ జాగ్రత్త

రెండు దశాబ్దాల గాయాల నొప్పులతో
విసిగి వేసారిన సూర్యుడు
రాజీ లేని ఎర్రని మంటలతో
ఇపుడిపుడే ఇంటింటి తలుపు తడుతున్నాడు

మొత్తంగా రెక్కలిప్పి
ఇనుప ముక్కులకూ ఉక్కుగోళ్ళకూ
లేచి గుళ్ళ కవచాలు కప్పి
దేశం ఆకాశం నిండా
దోపిడీ దేశభక్తి గీతాలు పాడుకుంటూ
పుక్కిటి నిండా పుచ్చు వాగ్దానాల గింజల్ని నములుకుంటూ
వలల వలయాల్ని అల్లుకుంటూ
వస్తున్నాయి డేగలు
రక్తంతాగే రాబందుల మూకలు
ఉషస్సులా మనస్సులా జాగ్రత్త

పరమ కిరాతకంగా
ప్రజల ప్రాణాల్ని కొల్లగొట్టిన పెట్టుకుంటూ
సైదోడు వంత పాటల్లో
గుండెల్ని అమ్ముకుంటూ
కాలాన్ని వెనక్కి నెట్టే
కలవాళ్ళకూ రాళ్ళకూ బాకా పట్టే

తరతరాల జనద్రోహపు సంఘాల
చిలుక పలుకుల డేగలు
మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి
రక్తం తాగే రాబందుల మూకలు

ఊళ్ళో వాటికి గూళ్ళున్నాయి గుళ్ళున్నాయి
అంతశ్శత్రువుల పళ్ళ మధ్య
మన యిండ్లూ నలిగేవున్నాయి
అయినా మిత్రులారా పుత్రులారా
శత్రుశిబిరాల శిఖరాగ్రాల మీదికి
దోపిడీ గుండెల పాదాల మీదికి
పోరాటం జెండల్ని దొర్లించి
ఊరూరికి ప్రాకుతున్న
ఎరుపుండగ వెరపేటికి

అవని మనది ఆకాశం మనది
ఊరు మనది పేరు మనది
మన పేదల ఎదల మొదళ్ళలోని ఎరుపును
ఏ శక్తీ చెరపలేదు
కష్టజీవి కడుపుకొట్టే
ప్రతి వ్యక్తిని కాల్చుతుంది
ఈ మూకల కుతంత్రాల్ని
బట్ట బయలు చేస్తోంది

మళ్ళీ వస్తున్నాయి మన ఊరికి
చిలుక పలుకుల డేగలు
రక్తం తాగే రాబందుల మూకలు
ఉషస్సులారా మనస్సులారా జాగ్రత్త
పాపలారా కనుపాపలారా జాగ్రత్త

* (తొలిప్రచురణ 1971
ఎన్నికల సందర్భంగా పునర్ముద్రణ)

కొత్త సన్నివేశం

నందిని సిధారెడ్డి

ఇప్పుడు పువ్వు గురించి చెప్పటం అసందర్భమే -
దారిదొరకక బుగులు బుగులైన పూట
పూల వాసన
మట్టిశరీరమంతా అల్లుకుని
తల్లిలా తల నిమిరిన జ్ఞాపకం

చిలుకా గోరింకలు కవి సమయమే ఐనప్పటికీ
కొత్త గ్రీష్మ సన్నివేశంలో పక్షిజంటను ప్రస్తావించటం అసందర్భమే—
చిలుకతో చెలిమి కలవక ముందు
పజ్జొన్న చేలమీద పిసికిల్లు మేసేది గోరింక
గుడిసెమీదా గుడిసెముందరి యాపచెట్టు కొమ్మలమీదా
వాలిన గోరింక
తన ముక్కు గుండెదాకా చాచి
ప్రేమప్రేమగా కడుపులో దేవినట్టు బాగా జ్ఞాపకం
నిజమే - ప్రాణభయం మొగ్గ తొడిగే
ఈ సన్నివేశంలో నిజం చెప్పటమే పెద్ద అసందర్భమైంది

★

కాలి నడకన వెళుతున్న నాకు
మధ్యాహ్నమయ్యి ఎండ బాగా ముదిరేసరికి
తొవ్వలో ముల్లుగా మారిన పువ్వు కనిపించింది
ఇంకొంచెం ముందుకు నడిచేసరికి
రెమ్మకు మిగిలిన రెండాకులు
చెట్టు కొమ్మను మేస్తూ కనిపించాయి
ఊరు దాటిన కాసేపటికి
పొట్టకొచ్చి కళకళలాడుతూ ఊగే
వరి కర్రల్ని మేస్తున్న

పంట కాలవ కనిపించింది
పొలిమేర దాటుతూ అడుగు వేసేసరికి
పుట్టను పెకిలిస్తున్న
చీమలు తారసపడ్డాయి

అదే పనిగా నడుస్తున్న నాకు దిగులు కొరడా ఝళిపించినట్లయింది. ఉలిక్కిపడ్డాను. ఇట్లా కూడా జరుగుతుందా - అని ఆశ్చర్యమేసింది. ఈ సాదృశ్యాలేవీ కవి సమయాలుగా సాహిత్యలోకం ఒప్పుకోదని కలత పట్టుకొంది.

★

పువ్వయి జీవించకపోయినా
ముల్లుపై దారి నలరించకు
కాడివి కాలేకపోయినా
కర్రును ఊడదీసే ప్రయత్నం చెయ్యకు
దారి సుగమంగానే ఉంది
వాగు నీళ్ళు తాగే గోరింకా
వాగెండి పోయిందని వాదులెందుకు?
దారి సుగమంగానే ఉంది
తీగమీదే పూసిన పువ్వా
తీగలాగే పని వద్దు
ప్రియురాలి తలలోంచి జారిన
దాసన్న పువ్వా
నా ప్రియురాలి ముఖాన్ని పరిహసించి
నా హృదయానికి గాయం చెయ్యకు
ఇప్పటికీ
నా ప్రియురాలు నాకెంతో అందమైందీ
అంతకంటే ఇష్టమైందీ కూడా

* * *

మరో దశకి

తుషారా

నేలమీద ఉక్కు రుతువు
కవాతు చేస్తున్నపుడు
కొండలమీద, మైదానాల మీద
ఇళ్ళ చూర్లమీద బులెట్ల వర్షం
భూమి పాదాలమీద
సంకెళ్ళ ఇనపగజ్జెల సంగీతం
భూమి గొంతు చుట్టూ
శతకోటి చేతుల్తో
బిగుసుకుపోతున్న ఆక్టోపస్ టెంటికిల్స్
భూమి కాళ్ళనీ చేతుల్నీ చుట్టుకొని
తలమీద భీకరంగా నోరు తెరిచిన కొండ చిలువ
ఉక్కు రుతువు కవాతు చేస్తున్నంత మేరా
ధ్వంసమై పోతున్న తిండిగింజలు
ఖాళీ అయిపోతున్న ఊళ్లు
తగలబడి పోతున్న గుడిశెలు గూడాలు
బాయ్‌నెట్ల శిలువల మీద స్టెతస్కోప్‌లు
ట్రాన్స్‌ఫార్మర్లకు వేలాడే శవాలు
రైలు పట్టాల మీద వీరమరణాలు
జైల్లోని గళాలు విరిగిన గళాలు
అజ్ఞాతంలో జనం గుండె చప్పుళ్ళు
ఉక్కు రుతువు భీకర సకిలింపుల్లో పెనవేసుకొని
సోదర పక్షాల జనప్రేమాలాపనలు
వార్తా పత్రికల జనార్త నాదాలు
శత్రువు గీసిన గిరిలోనే
మాలిష్ చేసిన కండరాల కసరత్తులు

మనుషుల్ని 'అదృశ్యం' చేసి
ఊళ్ళని శ్మశానాలు చేసి
రాజ్యాంగంగా, పాలనగా, కళగా, సంస్కృతిగా
ఉక్కురుతువు స్వైర విహారం
దాని దయాదాక్షిణ్యాలతో
పోరాటం చేసేవాళ్ళ
రాజముద్రికల్తో, రాచమర్యాదల్తో
జనం గురించి, పబ్లిక్ ప్రాపర్టీ గురించి
ఆందోళన పడిపోవడాలు

ఏది ఏమైనా
పులి మీసాలు పట్టుకు లాగింది నేనే
పులి చెవుల్లో, ముక్కు పుటాల్లో దూరి
కనుగోళాల మీద ముసిరి
ఇష్టం వచ్చినట్లు కుట్టి
పంజా గోళ్ళ మధ్య
బీడీ ఆకుల్ని రగిలించింది నేనే
పులికోరల మధ్య
సారాబొట్టును పేల్చివేసింది నేనే
ఉక్కురుతువుని వెనక్కి నడిపించి
నాలుగొందల ఏళ్ల బస్తీమే సవాల్ చేసింది నేనే
రాజధానిలో జనం గుండె చప్పుళ్ళ దరువుల్ని నేనే
నేను జనాన్ని కాదన్న
ఇకిలింపు నోళ్ళు మూయించింది నేనే
పోరు 'హోరు గల్లు'లో
కూలిజన నేత్రాల పురివిప్పి
వసంత మేఘగర్జన ఆవహించి

ఆడిన పుడమిని నేనే
జనం పాదాల్నే
వాడి గుండెల్లో రైళ్ళుగా
పరుగెత్తించింది నేనే
గూండాలతో, కత్తులతో, కర్ఫ్యూలతో, సైన్యాలతో
జనం మీద యుద్ధం ప్రకటించి
అధికార పీఠం ఎక్కిన సుస్థిరత గాడికి
ప్రజా యుద్ధం చవి చూపేందుకు
తెగించింది నేనే
వాడి నరాలమీద దాడికి
సిద్ధమౌతున్న ఆకుతేళ్ళ గుంపుని నేనే
నర్మెట్ట, అచ్చంపేటలో
జనం మీద పేల్చిన తూటాల్లో
రాష్ట్రమంతటా ఝళిపించిన
భీతావహ కరవాలాల్లో
దొంగల ముఠాల నలభై నాలుగేళ్ళ
నీచ రాజకీయ చరిత్ర బట్టబయలు చేసింది నేనే
బీభత్స వీరంగం వేస్తూనే
చరిత్రహీనుడు పెడుతున్న
చావు కేక విన్నది నేనే
చరిత్ర కాళ్ళకీ చేతులకీ
వేస్తున్న సంకెళ్ళ బీభత్సం
కన్నానమ్మా కన్నాను
జనాన్ని భీతావహం చేసి
జనం మీదెక్కి బతికే
రాజకీయ దౌర్జన్యం అనుభవించాను
జనం కదిల్తే కాల్చేయడానికి
మళ్ళీ ముందుకొచ్చిన

ఉక్కుదుతువుని గమనించాను
పట్టాలమీద బాంబుల్లో
పేలిపోతున్న స్టేషన్లలో
జనం రాజకీయ చరిత్ర
మరో అడుగు ముందుకు వేయడం చూపిస్తున్నాను
తలా మొండెంగా
తెగిపోయిన పీడితులంతా
ఉక్కుపట్టాలకి బిగగట్టి
వ్యవస్థ చేసిన ఎన్‌కౌంటర్లేనని
చాటి చెప్పలేని రైలు పట్టాల్నే-
వాళ్ళ ఆగ్రహాన్ని వ్యక్తం చేసే
శతకోటి గొంతులుగా మార్చాను
ఏళ్ల తరబడి నలిగిపోయిన గొంతులు
విధ్వంస విస్ఫోటగానం చేస్తున్నాను
జనం మీద పేల్చిన బాంబులికి
జనం గుండె గొంతుకలు
బాంబుల్లో పలికించడానికీ
తేడా చూపిస్తున్నాను
జన కంటకుల గుండెలదిరేలా
మందు గుండె పాతరల్లోంచి
నోరు విప్పి జనాక్రోశాన్ని, ఆగ్రహాన్ని
సరికొత్త పద్ధతిలో వ్యక్తీకరిస్తున్నాను
విస్ఫోటంలో పలికే
పొలాల కిల కిలారావాన్ని నేనే
విధ్వంసంలో పలికే
వెదురు వనాల మురళీ రవాన్ని నేనే
తునాతునకలుగా ఎగిరిపోతున్న బ్రిడ్జిలై
కురుస్తున్న తురాయిపూల వర్షాన్ని నేనే

మందుపాతర్లలో
పలికిన ఇప్పపూల దరహాసాన్ని నేనే
భస్మ గర్భంలో
ఫీనిక్సుల పురిటి నొప్పులు నేనే
మత కలహ భోజనులూ హంతకులూ—
జనాన్ని చావు పట్టాల మీదికి నెట్టిన వాళ్ళు
విషపత్రికల కడుపుల్లో దాక్కుని
జనం చావనందుకు బాధపడ్తూ
పైకి మాత్రం
"జనం చచ్చిపోతే ఏంగానూ?" అంటూ
గుండెలు బాదుకోవడంలోనూ—
జనానికి జనాన్ని చూపి
భయపెట్టే 44 ఏళ్ళ రాజకీయాల్లోనూ—
కుట్రనీ, క్రౌర్యాన్నీ
ముసుగులు చింపి
జనం ముందు నిలబెడ్తున్నాను
అకు తేళ్ల కుట్టిన
అసెంబ్లీ దొంగల గాంభీర్యాన్ని చూసి
నోరారా గుండెనిండా నవ్వుకుంటున్నాను
ఈ మహా విధ్వంస విస్ఫోటంలో
రెప్పలు విప్పిన పుడమి కనుల వెలుగు నవ్వును నేనే
ఉక్కురుతువుల్లో సైతం
వసంతగీతాలు పాడే
తురాయి వనాన్నై వికసిస్తూ
నేను స్వేచ్ఛగా నవ్వుకుంటున్నాను
ఒళ్ళంతా ఇప్పపూలతో
పులకరించి పోతున్నాను

స్వప్నం

ఎస్. కె.

కలకూ స్వప్నానికీ మధ్య గీతగీస్తున్నాను
కల శూన్యం
స్వప్నం భూమి
శూన్యానికీ భూమికీ మధ్య గీతగీస్తున్నాను

కల కరిగి నీరైన వేళ
రెప్పల వాల్చివేత రేపటిమీది విశ్వాసం కోల్పోతుంది
నాల్గు దిక్కులా శూన్యం
నువ్వసహాయుడవని భయపెడుతుంది

కలల నిద్రో కలత నిద్రో
నిద్ర నీకు విశ్రాంతి నీయదు
నిద్ర ఒక ఉలికిపాటు
నిద్ర నిరంతర అశాంతి

కలల్ని దాచకు
కలన్ని కార్చకు
కలల్ని కోసి
రెప్పల తెరచాపల్ని ఎత్తి
కళ్ళ గోళాల్ని అగ్నిస్వప్నాలుగా తెరువు
కన్నీళ్ళ కలటోతల్ని
కత్తులుగా మలువడం స్వప్నం

కాళ్ళు శూన్యంలో వేలాడేసి
తలతో నడువాలనుకోవడం కల
స్నేహమే ఒక విలువనుకోవడం కల
ప్రేమే ఒక విలువనుకోవడం కల
త్యాగమే ఒక విలువనుకోవడం కల

విలువలతో స్నేహాలు కావడం
విలువలతో ప్రేమలు నిలువడం
విలువలకై త్యాగాలు చేయడం స్వప్నం
తలకిందుల విలువల్ని
సరిజేసి నిలబెడితే అది స్వప్నం

ఇప్పుడు నేను
కలకూ స్వప్నానికి మధ్యగీతను చెరిపేస్తున్నాను
శూన్యాన్ని
ఉదయించే ఆకాశం చేస్తున్నాను

బెంగాలీ కవిత :

చిక్కుముడి

అనిర్బన్ దత్తా

మహా ప్రభూ, మీరు
రాతలన్నీ,
గోడల మీది చికాకయిన రాతలన్నీ
పట్నంలోని రాతలన్నీ
చెరిపెయ్యమని ఆజ్ఞాపించారు
ప్రభూ, నన్ను మీరు క్షమిస్తే
ఒక్కమాట చెప్పనివ్వండి—
పారిశుధ్య కార్యక్రమంలో ఏ లోపమూ లేదు
కాని
మేమెంత చెరిపేసినా తుడిచేసినా
గోడలకు సున్నం గొట్టినా
మళ్ళీ మళ్ళీ ఆ రాతలు కనబడుతూనే ఉన్నాయి
ఎంత ఘోరమైనవి!
అది ఒక చిక్కుముడి ప్రభూ

మొట్ట మొదటి రోజున
నాకు అయిదే అక్షరాలు కనబడ్డాయి :

ఎంత సులభమైన పని అనుకున్నాను
నిజం చెప్పాలంటే అది పనే కాదు
ఒక ఎల్, ఒక ఇ, ఒక ఎన్, ఒక ఐ, మరొక ఎన్
మూడు వందల మందిని పనికి పెట్టాను
కుంచెలూ, చీపుర్లూ, సున్నం బకెట్లూ పట్టుకుని
వాళ్ళు గోడలు చెరిపెయ్యడానికి పూనుకున్నారు
ప్రభూ, వాళ్ళు రోజంతా
అతి జాగ్రత్తగా పని చేశారు
మర్నాటి కల్లా రాతలన్నీ మళ్ళీ కనబడ్డాయి
ఇప్పుడవన్నీ తెల్ల రంగులో ఉన్నాయి

మరోసారి ఇక
పెద్ద పెద్ద కుంచెలు తెప్పించాను
మరో రెండు వందలమందిని పనికి పెట్టాను
ఆ తెల్ల రాతల మీద నల్లటి తారు కొట్టమన్నాను
వాళ్ళు ఓ వారమో, వారంన్నరో పని చేశారు
కాని ప్రభూ, అంత పని చేసినా
మళ్ళీ గోడల మీద రాతలు కనబడ్డాయి
ఈసారి అవన్నీ నల్లరంగులో ఉన్నాయి

ఇక చివరికి, ప్రభూ
రంగులు వాడకం మానేద్దామని నిర్ణయించాను
గోడల మీది నుంచి అక్షరాలు
చెరిపేద్దామని చూశాను
పనివాళ్ళ సంఖ్య పెరిగిన కొద్దీ
ఖర్చు పెరిగిపోయింది
ప్రభూ నన్ను క్షమించాలి
అంత శ్రమా మట్టి గొట్టుకు పోయింది
అంత చిన్న పేరుకు
అంత శక్తి ఎక్కడిదో తెలియదు
ప్రభూ మనం ఈ చిక్కుముడిని
పట్టించుకోకపోవడం మంచిదేమో ....

చైనీస్ కవిత :

రాత్రిపూట సెలయేటి పాట

గువాన్ యోంఘె

రాత్రిపూట, సెలయేరు ఇంకా ఎందుకు పాడుతోంది? దాని హృదయ తంత్రుల్ని చంద్రకాంతి మీటుతున్నందు వల్లనా ? చంద్రుడే లేకపోయినట్లయితే, దాని నీళ్ళలో నక్షత్రాలు మిలమిల లాడుతున్నందు వల్లనా ? చుక్కలే లేకపోతే, దాని మీద సయ్యాటలాడుతున్న మిణుగురులు వెలుగుతున్నందు వల్లనా ? మిణుగురులే లేకపోతే, దానిలోకి చొచ్చుకొస్తున్న మెరుపు వల్లనా ? మెరుపుకూడ లేదు గదా, విద్యుద్దీపాలు దానిలో ప్రతిఫలిస్తున్నందువల్లనా ? ....

ఒక్క మాటలో, సెలయేరు చిమ్మచీకటిలో పాడుతోంది, చీకటిని ప్రశంసిస్తూ మాత్రం కాదు ....

(మూడవ పేజీ తరువాయి)

తలపడాలి. కడుపులో చల్ల కదలకుండ ఆందోళనలు నడిపే లీగలిజంతో తలపడాలి.

ఈ ప్రయత్నం అసలే జరగడం లేదని కాదు. నిజానికి గత 20 సంవత్సరాలుగా ఇది ఏ రోజూ పూర్తిగా స్తబ్దంగా లేదు. సింగరేణి బొగ్గుబావులలో యాజమాన్యాన్నీ, ప్రభుత్వాన్నీ హడలెత్తించే శక్తిగానూ ఎదిగింది. అయితే పారిశ్రామిక వ్యవస్థ అంతటా ఈ ప్రయత్నం వ్యాపించిననాడే కార్మికవర్గం తన చారిత్రక పాత్రకు సిద్ధం అవుతుంది. అప్పుడే మేడే ఉత్సవాలు నిజంగా అర్థవంతమవుతాయి. చికాగో కార్మికులు రక్తాన్ని చిందించినా, కార్మికవర్గం ఆ రక్తంతో తడిసిన జెండాను తన జెండాగా ఎగరేసినా, అది కేవలం 8 గంటల పనిదినం కోసం కాదు, డి ఏ, బోనస్, గ్రాట్యూటీల కోసం కాదు: ఈ ప్రపంచాన్ని తలక్రిందులు చేసి శ్రమజీవులకు సమాజాన్ని అర్పించడం కోసం. శ్రమచేసే వారొకరు, శాసించే వారొకరు అనే వర్గసమాజ నియమాన్ని అభావం చేయడం కోసం, శ్రమను కించపరచే తాత్విక సిద్ధాంతాలనూ, శ్రమను నీచంగా చూసే సామాజిక ఆచారాలనూ, శ్రామికుల జీవితాలనూ, ఆలోచనలనూ నియంత్రించే పరాయి పెత్తనాన్ని అంతం చేయడం కోసం. ఈ కర్తవ్యాన్ని గురించి ఆలోచించని కార్మికవర్గం ఎన్ని తాత్కాలిక ఆర్థిక విజయాలను సాధించినా తనకూ తన చారిత్రక కర్తవ్యానికీ ద్రోహం చేసినట్టే.

6 మే 1191

నవల సీరియల్ ప్రారంభం :

రాగో

సాధన

రాగో దిగాలుగా కూచొని ఉంది. మనసంతా కకావికలమై ఉంది. కొలిక్కి రాని ఆలోచనలు ఊరిబయటి గొడ్ల సదర్లలా చెల్లా చెదురుగా ఉన్నాయి తన ఆలోచనలు. ఎంత కూడదనుకున్నా గతమంతా దేవర జాతర్లా బుర్రలో అదే పనిగా తిరుగుతుంది. తోవ తప్పినోళ్ళు అగమాగమై అడవిలో తిరుగుతున్నట్లుంది రాగో జీవితం.

తారీఖులు, పంచాంగాలు లెక్కలు తెలియకపోయినా, ఊరోళ్ళందరూ 'పడుచుపోరి' అని వెక్కిరిచ్చినపుడల్లా తనకూ వయసొస్తుందని అర్థమయేది. ఊళ్ళో చలికాలం రాత్రుళ్ల దోళ్ళు, డప్పులతో నెగళ్ళ చుట్టూ వయసు వయసు పిల్లలందరు ఎగిరేపుడు వెకిలి పోరగాండ్లూ, వరుసైనవాళ్ళూ చాతి మీద చేతులేసి నవ్వేటపుడు ఈడు తెలిసి సిగ్గుతో మొగం ఎర్రబారేది.

ఊళ్ళో దుకాణం పెట్టి పూజారి, గైత (పటేల్)డు, సర్పంచుల ప్రాపకం సంపాదించి వయసువాళ్ళతో వరుసలు కలుపుతూ, గోటుల్ ముందు ఎగరడానికివచ్చే బెంగాలీవాడు అందమైన పడుచుల నడుముల చుట్టు చేయివేసి ఎగురుతూ, ఆ సందున భుజాలు తాకుతూ, పక్కల్లో చేతులు పోనిచ్చి కసిగా నొక్కడం గమనించినపుడల్లా రాగోకు అసహ్యంతో ఒళ్ళు మండిపోయేది.

దసరా పండుగనాడు పారిపోయి ఫోటో దిగుదాం రమ్మని ఆ బెంగాలీవాడు పిలుస్తే తను ఎంతగా కుమిలిపోయిందో....

పెద్దలు నవ్వుతూ ఊరుకోబట్టే కదా పడుచులకిన్ని బాధలు అనుకునేది రాగో. అలాగే 'మైని' పెళ్ళిలో ఎగురుతుండే 'సైను' వచ్చి అంతమందిలో తన చీరూడి పోయేట్లు ఇగ్గితే, తను లంగాపై మిగిలిపోయినపుడు, అక్కడున్నవాళ్ళందరూ విరగబడి నవ్వితే ఒళ్ళు తెలియని కోపంలో తను వాడిపైకి కట్టె విసిరితే మాడియా

రివాజు నెదిరించిన ఆడదని పెద్దోళ్ళ తనపైనే కన్నెర్ర చేశారు. అవన్నీ తలచుకుంటే రాగోలో ఒకేసారి అసహ్యం, కోపం ఉక్కిరిబిక్కిరవుతాయి.

రాగోకు తను ఒప్పుకున్న పెళ్ళి చేయాలని తండ్రి పట్టుదల. బంగారంలాంటి తమ్ముని కొడుకుండగా మరొకడి కెందుకివ్వాలంటుంది తల్లి. నా వాళ్ళను, నా రక్త సంబంధాన్ని దూరం చేసుకోనంటూ తల్లి కూడ తండ్రి మాటకే తాళం వేస్తుంది. రాగోను ఆ ఇంటికిస్తే దాని తల్లిని తెచ్చుకున్న నాటి జీవపారె (కన్యాశుల్కం) తీరుతుందనేది తన తండ్రి మతం.

అక్క మంచిది కనుక కొడుక్కి మరో పిల్లను వెతకాల్సిన బాధ తప్పిందనీ మేనమామ తృప్తిపడుతుంటాడు. సంఘా (మరదలు) రాగో తనకే దక్కుతుందని మేన సంఘి (బావ) ఉవ్విళ్ళూరుతున్నాడు.

పుటుకలే కదా. ఆ పెళ్ళి ఎలాగూ జరగాలి, జరుగుతుంది కూడ అంటుంది రివాజులను నమ్మిన సమాజం.

కానీ రాగో యిష్టం ఏమిటో పట్టించుకున్న వాళ్ళు మాత్రం ఎవరూ లేరు. ఆ వయసుకు తగ్గ ఆకారంతో అప్పుడే ఉదయాన చెట్టుపైనుండి రాలిన ఇప్పపూవులా, నిండుగా కంటికింపుగా కనపడుతుంది. ఆయినవాళ్ళకీ, పైవాళ్ళకీ కూడా రాగో అందమూ, చందమే కావాలి తప్ప రాగోకు కూడ ఓ మనసుందనే పట్టదు. ఆ మనసు తనకు నచ్చినోణ్ని కోరుతుంది.

తోటివాళ్ళలో 'నాన్సు' చాలా అందగాడు. అందుకు తగ్గట్టు వాడిలో అన్ని సుగుణాలున్నాయి. అందరి నోళ్ళల్లో మంచివాడనిపించుకున్నాడు. పైగా వరుసైన వాడూనూ. రాగో చిన్ననాటి నుండి చూస్తున్నదే.

కాలం పరుగెడుతుంది. ఎండాకాలం వచ్చి పెళ్ళిళ్ళ జోరు పెరిగింది. డోళ్లు, డప్పులు ఎగురుళ్ళతో కల్లుతో పెళ్ళిళ్ళు ఖుషీగా సాగే కాలం అది. ఎవరి తాహతుకు తగ్గట్టు వారు పెళ్ళి ఆర్భాటంగా చేస్తుంటారు. చుట్టూ పది ఊర్లనుండి జనాన్ని పిలిచీ అట్టహాసంగా మేకలు, కోళ్లు, పంది, కల్లు కండీల (క్వింటాలున్నర) కొద్దీ బియ్యం వండి రెండు, మూడు రాత్రుళ్ళు ఎగిరించి జరిపే పెళ్ళిళ్ళు పెద్దవాక పెళ్ళిళ్లు. మాడియా సాంప్రదాయం ప్రకారం ఆరు మేకలు, మేక తిననివారికి కోడి వండిపెట్టి

బంధువుల్ని పేరంటానికి పిల్చుకొని ఉన్నదాంట్లోనే సరిపుచ్చుకునేవి మధ్యతరగతి పెళ్ళిళ్లు. ఈ మధ్య ఖర్చు తగ్గించాలనీ, అప్పుల పాలు కావద్దనీ చెబుతూ, ఉన్న దాంట్లోనే పదిమందికి చేయికడిగి పెళ్ళి అయిందని అనిపించడం కూడ పెరుగు తోంది. ఇవి సంఘం ప్రోత్సహించే పెళ్ళిళ్లు.

రాగో పెళ్ళి ఆ ఎండకాలం జరిపించాలనీ నిశ్చయించుకొని ముహూర్తం పెట్టించి వియ్యంకులకు కబురు పెట్టాడు. సన్నాహాలు చకచకా సాగిపోతున్నాయి. వడ్లు దంపడం, నెర్రెలు పాసిన గోడలు పూతలు పూయడం, ఇంటిముందు మండ (పందిరి) వేయడం పనులన్నిట్లో ఊరి షేదో (పెళ్ళి అయిన స్త్రీ)లు, దాదలు సాయం చేస్తున్నారు. వాకిట్లో మర్మిముండ (పెళ్ళి గుంజ) పాతడం పూర్తయ్యాకనే ఈ పనులు మొదలయ్యాయి. రాగో మాత్రం ఏ పనీ ముట్టుకోవడం లేదు. రాగో వాలకం తల్లికి అనుమానంగానే ఉంది. ఇంట్లో ఉన్న ఇప్పపూలతో పెళ్లికి సరిపడా కల్లుడించే పనిని తమ్మునికి అప్పగించాడు రాగో తండ్రి. ఇంట్లో ఉన్న మూడు మేకల దంటకు ఎట్లయినా మరో మూడు మేకలు తేవాలని పట్టుదలతో అందరిని అరాలు తీస్తూ అతడు రెండ్రోజులుగా ఆ పనిమీద తిరుగుతున్నాడు. తెల్లారితే పెళ్ళి.

రాగో కనబడడం లేదు.

"రాగో హిల్లేకదా" (లేదు). మేలుకొని యింకా మంచంలోనే మెసలుతున్న భర్తతో అంది, రాగో తల్లి, వాకబు చేయాలన్నట్టు.

"అబ్బెర హత్తబారి" (బయటకు పోయిందచ్చు) తండ్రి జవాబు.

"కాదు. వాలా పేపయ్యింది. దొడ్డికిపోతే ఇంత ఆలస్యమా? ఈడుమీదున్న పిల్ల తెల్లారితె పెళ్ళి" అంటున్న ఆ తల్లి మాటల్లో ఆందోళన స్పష్టంగా ఉంది.

"ఈడు మీదున్న ఆడదాన్ని కనిపెట్టకుంటే ఎప్పుడు కొంపముంచేది తెలి యదు" అంటూ రాగో తండ్రి దల్సు లేచి తన గోచి సవరించుకుంటూ నెత్తిమీద నల్లటోపి సదురుకొని ఇంటిముందుకొచ్చాడు.

ఈడొచ్చినాంక పెళ్ళి ఎట్లయినా జరిగేదే. అయితే ఆ పెళ్ళి మనసైన వాడి తోనా, మరొకడితోనా అనేదే ఆడపిల్లల బెంగ. నచ్చని మగాడిని కట్టుకొని జీవిత మంతా బాధలనుభవించే బదులు నచ్చినాడితో లేచిపోవడం గొట్టోల్లలో (గోండు

లల్లో) అనవాయితీగా వస్తున్నదే. అర్థంకోవాలనే పెద్దమనుషుల కంటపడకుండా గుట్టు చప్పుడు కాకుండా సాగిపోతుంటాయి ఈ లేచిపోవడాలు.

రాగోకు మిగిలింది కూడ అదే దారి.

"రామ! రామ! ఏయ్‌రా! కన్నల్ తప్పె" (కన్నని తండ్రి) అంటూ తమ్ముణ్ని కేకేశాడు దల్సు.

"వాయినన్!" (వస్తున్నా) అన్న పిలుపుతో ఇంట్లో నుండి బయటికొచ్చాడు రామ,

"రాగో కనబడడం లేదట. ఖేతుల్ (పొలంలోని గుడిసె) దగ్గర చూసిరా. నేను ఊళ్ళో చూస్తాను" అంటూ తమ్ముడిని పురమాయించి "గోటుల్" వైపు దారి తీశాడు.

కాక రామకు రాగో మనసు తెలుసు. రామ అంటే రాగోకెంతో ప్రేమ. రాగో నాన్సుతో చనువుగా వుంటుందని రామ ఎప్పటినుండో గమనిస్తున్నాడు. అయితే అన్నతో చెప్పడానికి ఎందుకోగానీ మనసు ఇష్టపడలేదు. రాగో ఖేతుల్లో ఉండదనీ కూడ తెలుసు. అన్నతో చూసొస్తానన్నాడే గానీ రాగో నాన్సు ఇంట్లోనే ఉంటుందనేది తనకు తెలుసు. ఇద్దరు కలసి యిప్పటికే ఊరి పొలిమేర దాటి ఉంటా రనుకుంటూ లోలోన నవ్వుకున్నాడు.

తన పెళ్ళికూడ ఇలానే జరిగిందని తానెట్లా మరచిపోగలడు అనాడు తను కూడ ఇలాగే యిల్లు చొచ్చిన పెళ్ళాన్ని వెంటేసుకొని పరిస్థితి చల్లబడేవరకు అక్కడక్కడా రోజులు గడిపిన బాపతే కదా. తరతరాలుగా ఆడదానికి అలవాటైన పద్దతే కదా అది.

గోటుల్ చేరుకున్న దల్సు ఒంటరిగానే అటిటు దిక్కులు చూస్తున్నాడు. అంత ఉదయాన్నే గోటుల్ వద్దకు ఎవరూ రారు. రాగో గురించి తను పడుతున్న ఆందోళ నను పంచుకునేవారు ఎవరూ అక్కడ లేనందుకు దల్సు మరీ చికాకు పడిపోతు న్నాడు. ఒక్కక్షణం ఆలోచించి గోటుల్లో వేళ్ళాడుతున్న డోలువద్దకు పోయి, ఆ డోలును కోపంగా బాదసాగాడు. ఆ డోలు చప్పుడు ఊరి పొలిమేరలను సులభంగా దాటుతుంది. ఆ ఊరివాళ్ళు ఎవరెక్కడున్నా సరే చప్పుడు విని రావడం ఆచారం.

"రాగో ఎవరింట్ల ఉందో చెప్పండి! ఎవడు దాసిపెట్టిండో చెప్పాలె. లేకుంటే మంచిగుంతదు" ఉగ్రంగా దల్సు ప్రశ్నించాడు.

మౌనం అవరించింది. గోటుల్ ముందు సమావేశమైన ఇరవైమందిలో ఏ చలనమూ లేదు. నాన్సు తండ్రి కూడ అక్కడ చేరినవాళ్ళల్లో ఉన్నాడు. అతడేమీ గాభరా పడిపోవడం లేదు. ప్రస్తుతానికి ఎలా తమాయించడం అన్నదే అతని మౌనానికి అర్థం.

"ఖేతుల్లో రాగో లేదు" అప్పుడే అక్కడికి చేరుకున్న రాగో కాక రామ జవాబు.

"ఎవరూ చెప్పకుంటే, మాట్లాడకుంటే ఇళ్ళన్నీ చూడాల్సి వస్తుంది" దల్సు గట్టిగా అన్నాడు.

ఊళ్ళో ఇళ్ళన్నీ ఇరవైకి మించి ఉండవు. అన్నీ గడ్డి గుడిసెలే. ఇంటింటికి వెదురు దడి ఉంది. అందరూ మాడియా గోండులే. వీరినే గొట్టోళ్ళని కూడ అంటారు. ఊళ్ళో పిల్లలు, పెద్దలు ఎవరూ చదువుకోలేదు. ఊరికి ఉత్తరాన రెండు ఫర్లాంగుల దూరంలో ద్వార స్తంభాలుంటాయి. ఊరి నడుమ గోటుల్ ఉంది. ఊరికి కొద్ది దూరం నుండే పడమరన సెలయేరు పారుతుంది. ఆ ఏరు నీళ్ళే ఊరి వాళ్ళందరు తాగడం. ఇటీవల సర్కార్ బోరింగ్ కూడ వేసింది. అయితే చిలుంకంపు. ఆ నీళ్ళు తాగరు. కాకపోతే వాడకానికి తెచ్చుకుంటారు. నాన్సు ఇంటిముందే బోరింగ్ ఉంది. ప్రతి ఇంటి చూరుకి డోలు వేలాడుతుంది. అందులో కొన్ని కొట్టి కొట్టి పగిలిపోయాయి. తోళ్ళు చినిగి వేళ్ళాడుతున్నాయి. మరిన్ని బింకంగా మోగడానికి సిద్ధంగా ఉన్నట్లు కనపడుతున్నాయి.

మరో చివర వరుసగా ఇంటికో కొట్టం ఉన్నట్టు గొడ్ల కొట్టాలున్నాయి. అందరి పశువులు వర్షాకాలం అక్కడే మకాం. మేకలున్నవారి ఇండ్లల్లో మేకల కొట్టాలు, పందులున్నవారి దడుల కొంటి పందుల గూళ్ళున్నయి. ఓ పెద్ద మొద్దుకు బోలు చేసి కోళ్ళు కమ్మేవారు కొందరైతే, మరికొందరి కోళ్ల చెట్లమీదనే కునుకు తీస్తున్నాయి.

నాన్సు ఇంట్లో రాగో (రామచిలుక) ఉంది. బేల్ రేకులతో చేసిన పంజరంలో దాన్ని పెట్టారు. ఆ పంజరం నుండి బయటపడడం ఆ చిన్న పక్షి తరంగాదు.

గొప్పై దాదలు రామచిలుకను ఇష్టంతో పెంచుకుంటారు. ఇంటిల్లిపాది దీన్ని ముద్దుగా 'విట్టా' అని పిలుస్తుంటారు. అందరు దానికి మాటలు నేర్పుతారు. వారి మాటలు వాళ్ళలాగే పలకడానికీ అది రోజంతా తంటాలు పడుతూనే ఉంటుంది. అడవిలో స్వేచ్ఛగా ఎగిరే పక్షులు మనుషుల మధ్య మెసలాలంటే వాటికి పెద్ద యాతనే. వాటి సహజ లక్షణాలను అవి క్రమంగా కోల్పోయి నెమ్మదిగా మనిషికి బానిసైపోతాయి. ఇది విట్టు పరిస్థితి.

రాగోను ఉంచిన గది చూరుకే విట్టో పంజరం కూడ వేళ్ళాడుతుంది. తొలి కోడి కూస్తుండగా ఇల్లు చొచ్చిన రాగో ఆ గదిలో ఒంటరిగా ఆలోచనలతో సతమత మవుతుంది.

నాన్సు కోసం తాను అన్నింటికి తెగించింది. తనకోసం ఏమైనా చేసే తండ్రి మాటను కూడ కాదని ఇల్లు చొచ్చింది. అయితే తాను కోరుకున్నట్లు వెంటనే ఊరు విడిచి తనతో ఎక్కడికో పారిపోవడం గాకుండా నాలుగు రోజులాగి విదానంగా చూద్దామంటాడు నాన్సు. కానీ తండ్రి కంటపడితే తనని మిగలనిస్తాడా? ఇల్లు చొచ్చిన వారు పడే తన్నులూ, గుద్దులన్నీ తను పడగలదా? రామ కాక (బాబాయి) తనకు అండగా నిలుస్తాడా? తాను కోరుకున్న పిల్లను తెచ్చుకోవడానికి అన్న అండ పొందగలిగిన రామ కాక కీనాడు తన బాధ నిజంగా పడుతుందా? వలచి చేరదీసినవాడు నాన్సే ఊరు వదలి రావడానికి సిద్దంకాకపోతే తక్కినవాళ్ళు తనను ఆదుకుంటారా? అసలింతకు సుశీలాబాయి నాన్సును తనతో ఉండనిస్తుందా? నాన్సును తనకు దక్క నిస్తుందా? ఇలా రకరకాల ఆలోచనలతో తల వోచె త్తిపోతున్న రాగోకు గది బయట పంజరంలో ఉన్న విట్టు చిలుకపలుకులు వెక్కిరిస్తున్నట్టు, దెప్పిపొడుస్తున్నట్లు మరింత చిరాకు కలిగిస్తున్నాయి.

ఏ మగాడు ఇలాంటి పరిస్థితిలో ఏ స్త్రీని ఆదుకున్నడు కనుక? తాను ప్రేమించ బట్టి కూచి (పిన్ని)ని కాపాడుకోవడానికి ఆనాడు కాక అన్ని అవస్థలు పడ్డాడు! కాకకు కాస్తా తెలివితేటలుండి ధైర్యం చేసినందున కూచిని కాపాడుకోగలిగాడు. వారిద్దరూ అనుకొన్న మరుక్షణమే ఊళ్ళోనుండి ఉడాయించి బ్రతికిపోయారు. తన కాక కాపురం నిలబడటానికి తన తండ్రి ఆనాడు ఎంత తెగించే ధైర్యం చేశాడో! ఉన్నదాంట్లోనే తమ్ముణ్ని ఆదుకోవడానికి తండ్రి ఆనాడు వెనుకాడలేదు. వారిరువురి ఉనికి తన ఇంటివారికికూడ తెలియకుండా రహస్యంగా ఆ జంటను కాపా

డాడు. ఊళ్ళో సద్దు మణిగాక తమ్ముడిని, తమ్ముడి భార్యని ఊళ్ళోకి తెచ్చి పిల్ల తల్లి దండ్రులు 3000 రూపాయలు జీవపారె అడిగితే పెద్ద మనుషులను కట్టుకొని ఐదువందలు మాత్రమే ఇచ్చి చేతులు దులుపుకున్నాడు. ఇంత చేసిన తండ్రి ఈనాడు తన దగ్గరికి వచ్చేసరికి అల్లరి చేయడం రాగోకు వింతగానే ఉన్నది. తెల్లారకముందే ఊరిపొలిమేరలు దాటుదాం అంటూ ఎంత ప్రాధేయపడినా ససేమిరా కదలని నాన్సు పై కోపంతో రాగో రకరకాలుగా ఆలోచిస్తుంది. క్షణం క్షణం నిరీక్షణతో బాధపడుతుంది.

* * *

గోటుల్ ముందు కూచున్న వాళ్ళల్లోకూడ రకరకాల ఆలోచనలున్నాయి, లచ్చుకు ఎటూ తేలకుండా ఉంది. నాన్సుకు మొదటి పెళ్ళి పెళ్ళాముంది. పెళ్ళయి మూడేళ్ళైనా కోడలు కడుపు పండకపోవడంతో నాన్సు మరోపిల్లను తెస్తే బాగుండుననే ఆలోచన లచ్చుకు లేకపోలేదు. అందుకే వరసైన రాగో వస్తానంటుందంటే నాన్సును తాను వారించలేదు. రాగోకైనా సంతానమైతే తన ఇల్లు నిలబడుతుందనేది లచ్చు ఆపతి. అయితే రాగో తండ్రి దల్సు మొండిగా వ్యవహరించి పిల్లను ససేమిరా ఇయ్యనని మేనవారికే ఇచ్చుకుంటాడా? లేక సౌమ్యంగా వ్యవహరించి జీవపారే (కన్యాశుల్కం) తీసుకొని వదులుతాడా అన్నదే లచ్చును సతాయిస్తున్న సమస్య. గోటుల్ ముందు కూచున్న దాదలందరికి ఇది మామూలే.

రామ మనసులో మాత్రం క్షోభ క్రమంగా పెరుగుతోంది. రాగో మనసు తనకు తప్ప మరొకరికి తెల్వదనుకుంటాడు రామకాక. పిల్లలో అమాయకత్వం, చలాకితనం కలగలిసి ఉన్నాయి. తను కోరింది చేసి చూపే పట్టుదలా ఉంది. ఐదువందల రూపాయలు చెల్లించి తనకాపురం నిలిపిననాటినుండి అన్నమాట లక్ష్మణరేఖలా పాటిస్తున్న రామకు అన్న మాటకు ఎదురు తిరగాలంటే నోరురావడం లేదు. ఎన్నటికైనా రాగోకే న్యాయం జరుగాలని కోరుకునేవాళ్ళలో తానే మొదటి వాడిననుకుంటాడు రామ.

"ఇళ్ళల్లో చూద్దాం లేవండి" అంటూ లేచాడు దల్సు. ఒకరివెంట ఒకరు లేచారు. రామ వారందరికి ముందు దారి తీస్తున్నాడు. నాన్సు ఇల్లు తప్పించాలనీ ఉంది.

బోరింగ్ వద్ద నీళ్ళు నింపుతున్న సుశీల కనపడింది. సుశీల కనపడ్డాక సుశీల ఇల్లు చూడకుండా వీరందరిని ముందుకు పట్టుకువెళ్ళడం ఎలా జరగాలని రామ అనుకుంటుండగానే గుంపులోనుండి ఎవరో సుశీలను పలకరించసాగారు.

"నాన్న ఇంట్లోనే ఉన్నాడా బాయి" గుంపులోనుంచి వచ్చిన ప్రశ్న.

"బారాయెనో (ఏమో) లేదు" సుశీల జవాబు.

టకటక బోరింగ్ కొడుతున్నట్టే ఉంది సుశీల కానీ ఆ కుండ నిండిందా లేదా కూడ చూడడం లేదు. కుండ నిండి నీళ్ళు పొంగిపోతున్నట్టే సుశీల మనసులోని బాధ క్షణక్షణం అధికమవుతుంది. భూమి లోలోపలినుండి బోరింగ్ నీళ్ల తోడుతున్నట్టే జరుగుతున్న ఘటనలన్నీ ఒక్కొక్కటి సుశీలమనసులో కల్లోలాన్ని సృష్టిస్తున్నాయి. తన సంసారం ఏం గానున్నదో అన్నదే సుశీలను పీడిస్తున్న సమస్య. సుశీల తన కులంలో ఇప్పటికి ఎందరినో చూసింది కట్టుకున్న భర్త భార్య ఉండగానే మరో ఆడదానితో సంబంధం పెట్టుకున్నాడంటేనే ఇక ఆ సంసారంలో చిచ్చు పుట్టినట్టే నన్నది తెల్వనిది గాదు. తను చూడనిది గాదు. హీనమైన పనులకు, భారమైన పనులకు ఇప్పటినుండి సుశీల బలిగావలసి వస్తుంది. ఇంతకాలం ఇంట్లో తను వహించిన పెద్దకోడలు పాత్ర క్రమంగా కొత్తకోడలు స్వీకరిస్తుంది. ఇంతకాలం అత్తారింట్లో వంటింటినుండి ధాన్యపుకొట్టువరకు తన కనుసన్నలలో చూసుకున్న ప్రతిది తననుండి దూరం అవుతాయి. అలాగే ఇంతకాలం తన కొంగు పట్టుకొని తిరుగుతున్నవాడు తనతో సంతోషంగా, హాయిగా గడిపిన ఘడియలన్నీ చెల్లు అయిపోయి తన కళ్ళముందే కొత్తగా తెచ్చుకున్న మరో ఆడదానితో గడుపుతుంటే తనలో తాను విలవిల తన్నుకోవడం తప్ప చేయగలిగిందేమిటన్నదే ఆమెలో ఘడియ ఘడియకి రాజుకుంటున్న ప్రశ్నలకుంపటి, ఒక్క భర్తతోనే కాకుండా ఇంటిల్లిపాదితో 'కొత్తొక వింత, పాతొక రోత' లానే తను చూడబడుతుంది. ఇన్ని రకాల చిత్రహింసలమధ్య తాను చేయగలిగిందేమిటి? లేదు. ఆ రాగోను చేసుకోకని తన భర్తను పోరుదామంటే తనకు పిల్లలు పుట్టడం లేదు. ఇక పుట్టరేమోకూడా. అయితే తనకే పిల్లలై ఉంటే, పోనీ ముందుకైనా అవుతారని భరోసా వుంటే నాన్నకు మనసు లేకపోతే, తనే మరెవరికైనా పోయేది. కానీ, ఇపుడు అందుకైనా భరోసా లేకుండా ఉంది. 'పంజాన్చద్' (గొడ్రాల్) అని ముద్రపడ్డాక తనకు ఆ దారి కూడ ఇక లేదు.

రేపు రాగోకుకూడ పిల్లలు కాకపోతేనో? అసలు నాన్సుకే పిల్లలు పుడుతారో లేదో ఎవరు తేల్చాలి? నిలదీసి అడగడం సరే మనసులో అనుకోవడానికి కూడా సుశీలకు భయమే.

* * *

"నాన్సుతో మనకేం పని. ఇల్లు చూద్దాం" అన్నారెవరో. గుంపు అంతా ఇంట్లో దూరింది. తాళం పగలగొట్టి రాగోను బయటకు లాగారు. నాన్సు ఇంటినుండి బరబరా లాక్కెళ్ళలతున్నారు. తన్నులు, గుద్దులు ప్రారంభమైనాయి. రాగో మొత్తు కోళ్ళు కూడా పెరగసాగాయి. రాగో లేత రెక్కలు వెనుకకు విరిచి పావురి తాడుతో కట్టారు. తండ్రి పిడికిలి బిగించి పిచ్చిగా బాధపడుతున్నాడు. రాగో సిగ ముడితప్పి జుట్టు విడిపోయింది. మొగమంతా కందిపోయింది. కళ్ళనీళ్ళు జాలు పారు తున్నాయి. అడుగులు పడడంలేదు. ఈడ్చిస్తున్నారు.

అమ్మలక్కలందరూ గుమ్మాల్లో నిలబడి చూస్తున్నారు. దెబ్బదెబ్బకు రాగో పడుతున్న అవస్థను నరాలు బిగపట్టి మౌనంగా చూస్తున్నారే తప్ప పల్లెత్తుమాట అన డానికి ధైర్యం లేదు. రాగో కాక రామ పరిస్థితి కూడ అమ్మలక్కలకు భిన్నంగా లేదు.

ఇంత జరుగుతుంటే, రాగో ఊహించినట్టే, నాన్సు జాడ మాత్రం లేదు.

ఇంటికి లాక్కొచ్చిన రాగోను గడిలోకి తోసి బేడెం వేశారు. మళ్ళీ పంజ రంలో చిలక తాను తండ్రి చెప్పినట్టు వినే వరకు తనకు అదే గతి. ఇక మొదలవు తాయి తన పాట్లు.

గడిలోపడి జరిగినవన్నీ నెమరు వేసుకుంటున్న రాగో కళ్ళముందు ఇప్పటి వరకు జరిగిందంతా కలలా కదిలిపోయింది- ఇపుడేం చేయాలన్నది క్షణాల్లో తేల్చు కోవలసిన సమస్య. ఏ మాత్రం ఆలస్యం చేసినా ఆ పెళ్ళి తన మెడకు చుట్టు కుంటుంది. ఇంట్లో ఆ హంగామా జోరుగా సాగుతుంది. తానేం చేయాలన్నా ఆ ఒక్క రోజే మిగిలింది. తాను అడిగినపుడే నాన్సు వెంటేసుకపోయి ఉంటే ఇదంతా ఏదీ జరిగేది గాదు. కథ అంతా మంచిగానే జరిగి ఉండేది. కానీ, అసలు కథ ఇపుడే ప్రారంభం అవుతుందని రాగో గ్రహించుకుంది. తనకు ఇష్టం లేకపోయినా తల్లీ

తండ్రుల మాటకు కట్టుబడి మేన సంఘిని పెళ్ళాడి జీవితాంతం అయిష్టంగా గడపడమో లేదా గది నుండి బయటపడి, ఆ చీకటి దారినుండి తప్పుకొని తనకు నచ్చినట్లు చేతనయినట్లు బతుకడమో ఏదో ఒకటి తేల్చుకోవాలి. ఇక తప్పదు. బయటపడి కష్టాలెదిరించయినా సరే తనకు నచ్చినట్టే తన బతుకు దిద్దుకోవాలనే కోరిక రాగోలో బలపడింది- ఎట్టి పరిస్థితిలోనూ తన పట్టుదల విడిచి రాజీ పడకూడదనే అనుకుంది. ఆ గది నుండి తప్పుకోవడానికి అవకాశాలు వెతుకుతూ, ఈ పరిస్థితుల్లో తను తేలిగ్గా బోల్తా కొట్టించగలిగేది తల్లినే కదా అనుకుంటూ ఆమె తెచ్చే వేడి జావకై ఎదురు చూస్తూ కూచోంది.

2

జువ్వి గడ్చిరోలిలో ఓ మారుమూలపల్లె. ఆ అడవి తాతలనాడు వున్నంత దట్టంగా లేకపోయినా, యీ నాటికీ అది అడవి కడుపులోని పల్లే. ఆ వూరికి ఏ రోడ్డు సౌకర్యమూ లేదు. పదేళ్ళ కిందటి వరకు ఆ ఊరికి కాలిబాటలే దిక్కు. అవయినా రెండు మూడే. కోసుపెట్టులో ఉన్న నాగుల్వాయి పోయే బాటే కొంత మెతిగి ఉంటుంది. ఏరు నుండి వూళ్ళోకి వచ్చేది మరో బాట. మూడు కోసుల దూరంలో కస్బెఝుసిలో పేరుపోయిన పూజారున్నాడు. కొనూపిరితో ఉన్న బీమారి వాళ్ళను అడపా, దడపా బండిలో మోసుకెళ్ళడానికి ఆ వూరి వరకూ పడిన బళ్ళబాట మరొకటి. ఆ బళ్ళబాటకి ఆమడ దూరంలో యిటీవలే ఒక మట్టి రోడ్డు పడింది. ఆ మట్టి రోడ్డు వెళ్ళి ఛామాఫుడ్ నుండి అల్లపెల్లికి పోయే వంకర రోడ్డుకి కలుస్తుంది. ఆ ఛామాఫుడ్ రోడ్డు చంద్రపూర్‌నుంచి సిరొంచకెళ్ళే డాంబర్ రోడ్డుకి కలుస్తుంది.

జువ్వి జనం క్రమంగా రోడ్డుకి అలవాటు పడుతున్నారు. మునుపయితే, ఏ చిన్న పనికయినా, ఎంత తక్కువ దూరమైనా, చివరికి అటుం (సంత)కైనా సరే సోపతి (తోడు) లేనిదే కాలు కదపని ఆదివాసీ జనం ఇపుడు రోడ్డు పడి, ట్రక్కుల రద్దీ పెరిగాక, భయం తీరి ఒంటరిగానే రాకపోకలను అలవాటవుతున్నారు.

మట్టి రోడ్డు పట్టుకొని ఛామాఫుడ్ కంకర రోడ్డు వైపు కాకుండా తూర్పుకి పదికోసులు నడిస్తే బీనగొండ వస్తుంది. గతంలో బీనగొండ పోవాలంటే గుట్టలన్నీ ఎక్కుతూ, దిగుతూ వెళ్ళేసరికి కాళ్ల తీపులు పట్టేవి. కాని ఇపుడు పేపరుమిల్లు వెదురు గాడీలు గడియకొకటి, గంటకొకటి బుర్రుమంటూ పోతూ ఆ రోడ్డు మీద

నడిచే వారిని కొంత దూరమైనా చేరవేస్తుంటాయి. మోటార్లో పోవడంతో అడవి జంతువుల భయం కూడ కొంత తగ్గింది- అయితే పెద్దపులి, గుడ్డెలు వంటి అడవి జంతువులు రోడ్డుకు అపుడపుడు అడ్డం బై రాయించి డ్రైవర్లను బెదిరించే సంఘటనలు ఇప్పటికి కూడ జరుగుతూనే ఉన్నాయి.

మరో మూడు కిలోమీటర్లు పోతేగానీ బీనగొండ రాదు. బతిమాలి జావ తాగించి దారికి తేవడానికి గదిలోకి అడుగు పెట్టిన కూచిని తన ఏడుపుతో, పెద బొబ్బలతో తబ్బిబ్బు చేసి దొడ్డికి పోవడం మిషతో గదిలోనుండి బయటపడ్డ రాగో అందరు తిరిగే చోట్లు వదలిపెట్టి అడవికి అడ్డం పడి ఎవరో తరుముతున్నట్లు పరుగు నడకగా మట్టి రోడ్డు చేరుకుంది. రోడ్డు ఎక్కాక కూడా రాగో నడక పరుగులాగే ఉంది. ఒగరుస్తూ, చెమటలు కారుస్తూ రోడ్డు వెంటే నడుస్తున్న రాగోకి పక్కనుండే పోయిన లారీ లేపిన దుమ్ముతో తోవ కనపడకుండాపోయి కళ్ళు బైర్లు కమ్మినంత పనయింది. తనను దాటుకుంటూ మోటారు పోయిన ప్రతిసారీ మోటార్లో పోదామని అనుకుంటుందిగానీ కైలికాల డ్రైవర్లు, కండాక్టర్లు (క్లీనర్లు) తిరొక్కతీరు వెకిలి వేషాలు వేస్తారనే భయంతో రోడ్లువారికి జరిగి నడక వేగం హెచ్చిస్తూనే ఉంది. వీళ్ల కళ్ళకు మాడియా అక్కలందరూ పూసి లెక్కనే అగుపడతారని తన మనసులో తానే తిట్టుకుంది.

ఈ రోడ్లన్నీ ఇవ్వాళ బుల్డోజరే వేస్తున్నది కానీ వెనుకట ఎందరెందరో ఆదివాసీ ప్రజల చెమటలు ధారలు కట్టడంతోనే తయారైనయి. ఈ రోడ్లు వేయించే పేపరు మిల్లు బాబులు, వారి ఠేకేదార్లు కూలీలందరినీ మెడకు బెడితే కాలుకు, కాలుకు బెడితే మెడకు అన్నట్టుగా ఎటూ ఇరుక రాకుండా, కొరుక రాకుండా పనులు చెప్పుతూ హరిఘోష పెట్టేవారు. వాళ్ళకు నచ్చిన ఆడదాన్ని వంట వార్పుకు పెట్టుకొని పని వెళ్లదీసుకునేవారు వాళ్ళకు నచ్చిన ఆడదాన్ని ఎంచుకొని, పీల్చి పిప్పి చేసిన అనేకుల్లో పూసి ఒకటి.

పూసి కూడ సింగారించుకొని గోల్సాడి కట్టుకొని కులుకుతూ, వంటకు కుదిరి బాబులను తన చుట్టు తిప్పుకోవడంలో అలవాటు పడిపోయింది. బట్వాడా నాడు బాబుల కంటే బడాయిపోయేది. తన తోటి ఆడపిల్లలెట్లుంటున్నరనే జ్ఞానం కూడ లేకుండా తనేదో తుఫుమ్ఖాన్ పని చేస్తున్నట్టు వగలు పోయే పూసి అంటే

అందరికీ చీదరే. దొంగ పూసి ఇప్పుడెక్కడ తేలిందో? తనలో తానే పెదవి విరుచుకుంది. నడుస్తున్న రాగోకు వెనుకనుండి జీపు చప్పుడు వినరాగానే ఆలోచనల నుండి తేరుకుంది. ఎదురుగా చూస్తే ఊరు పొలిమేరల్లో ఉండే బొందల గడ్డ కనిపించింది.

పెద్దా, చిన్నా బండలు ఇరవైకి పైగానే నిటారుగా నిలబెట్టి ఉన్నాయి. వాటి పక్కనే పీనుగుల బొందలున్నాయి. కానీ ఆ బండల్లో ఆడ మగ తేడా గుర్తుపట్ట గలిగే నిషాన్‌లు ఏమి లేవు. వాటికొాక పది గజాల దూరంలో 'వంజసైతు నరోటి' పేరుతో గోరి కట్టబడి ఉంది. పేరు, వసతి ఉన్నవాళ్ళే అటువంటి కట్టడాలు చేస్తుంటారు. అక్కడ నిలబెట్టిన పలక రాళ్ళపై ఏవేవో ఆనవాళ్ళు పెట్టి ఉంచారు. చనిపోయినవారు షికారు పట్ల ప్రేమగలవారైతే, అందుకు నిదర్శనంగా ఓ తుపాకీని లేదా కర్రతో చెక్కిన పక్షులను ఆ బండలకు వేలాడదీసి ఉంచారు. చనిపోయిన వారు విడిచివెళ్ళిన సామానులను వారు వాడిన పళ్ళెం, వారు ఉపయోగించుకున్న సందుగ, వారింత కాలం పడుకున్న మంచం, బట్టలతో పాటు ఓ నాలుగు చూరు పెంకలు బొందలవద్ద పెట్టి ఉన్నాయి. ఇది మాడియాల రివాజు.

బండలు దాటి నాలుగడుగులు వేస్తే రోడ్డు వెడమ వైపు పదెకరాలు చదును చేసిన భూమి ఉంది. ఇది సర్కారు వారు దురస్తు చేసిన వ్యవసాయ క్షేత్రం. పోడు వ్యవసాయం చేసుకొనే ఆదివాసీలను స్థిర వ్యవసాయం వైపు తేవడానికి వేలాది రూపాయల ఖర్చుతో బుల్‌డోజర్ వాడి ప్రభుత్వం చేసిన వ్యవసాయ క్షేత్రం అది. మొదటేడే అలికిన విత్తనాలకు సరిపడా పంట రాలేదనే నెపంతో ప్రభుత్వమే దాన్ని బందు పెట్టుకుంది.

విప్లవ కార్యక్రమాల పర్యవసానంగానే సంస్కరణ కార్యక్రమాలనేకం మారుమూల కొండల్లోకి కూడ ఎగబాకుతున్నాయి. బళ్ళు, రోడ్లు, అంగన్‌వాడీలు, బాల్వాడీలు ఒకటేమిటి అన్నీనూ ఒకదానితో ఒకటి పోటీ పడ్డట్టే అవతారం ఎత్తుతున్నాయి. కానీ నాలుగు రోజులు కాగానే ఇవి వెలవెలబోతుంటే సర్కార్ మతిలేని పనులకు గొట్టెవాదలు కసిగా నవ్వుకుంటారు. పోడు వ్యవసాయమే మా కన్న తల్లి అన్నది అక్షరాలా రుజువైందంటూ, బీడు పడ్డ సర్కారీ క్షేత్రాలనూ, ప్రభుత్వ పని విధానాన్ని ఎగతాళి చేస్తారు. ఆ క్షేత్రం నీటి పారుదలకై తెచ్చిన ఆయిల్ ఇంజన్ తల్లీ తండ్రి దిక్కులేని పిల్లలా ఇప్ప చెట్టుకింద, దిగాలుగా పడుంది. ఆకతాయి పిల్లలు ప్రతి నట్టూ, బోల్టుతో సహా తమ ఆటవస్తువుగా మార్చుకున్నారు.

ఆ చెట్టుకింద ఓ ముసలమ్మా కూచుండి కూచున్న చోటు నుండి జరుగకుండానే గంపనిండా పూలేరింది. గుట్టల వరుసలో ఎక్కడా అగుపడదు ఇప్పచెట్టు కానీ ఈ పొలంలో మాత్రం ఎట్ల పుట్టిందో ? ఆ ఊరి వాళ్ళందరి కళ్ళు ఆ చెట్టు మీదనే. జీలుగుకల్లు ఎంత పుష్కలంగా ఉన్నా, నాలుగు చినుకులు పడ్డాయంటే చాలు మనసు ఇప్పకల్లు పైకి పోకమానదు. ఆ ఊరివాళ్ళందరూ ఇప్పపూల కోసం డోంట్ భూమి (మైదాన ప్రాంతం) వారికి కోసరి, కోల ఇచ్చుకోవలసి వస్తుంటే, ఆ ఒక్క కుటుంబానికి అటువంటి అవసరం రానందుకు అందరి మనసుల్లో ఏదో మూల అసూయ లేకపోలేదు.

"పేరి (పెద్దవ్వ) ఊళ్ళో మంచేనా ? మైని ఇంట్లో ఉందా" ముసలమ్మను దాటుతూ రాగో ఆప్యాయంగా పలకరించింది.

"ఆఁ! ఆఁ! ఎవరూ! రాగో పొద్దున్నే వస్తున్నావు బిడ్డా. మీరంతా మంచేనా" ప్రేమగా బదులు పలికింది ఆమె.

"ఆఁ! ఆఁ! నేనే పేరీ! మైనిని చూసిపోదామని" అంటూనే రాగో పెద్దవ్వను దాటేసి ఊళ్ళోకి చరచరా వెళ్ళింది.

....

ఊళ్ళో గోటుల్ ముందు జీపు ఆగి ఉంది. నల్లటి జీపుకు ముందరి భాగంపై "మహారాష్ట్రి శాసన్" అనే అక్షరాలు తెల్లటి రంగుతో పుండ్రాళ్ళలా చోటు చేసుకున్నాయి. నంబరు ప్లేటుపై హిందీ లిపిలో నంబరు కొట్టొచ్చినట్లు కనపడుతుంది. బాబులు అందరూ గోటుల్ ముందు మంచాల్లో కూచున్నారు. వాళ్ళ కెదురుగా గ్రామస్తులు కూచున్నారు. పిల్లలందరూ దావాపు బరిబాతలనే డ్రైవర్ కసరుకోవడం లెక్క చేయకుండానే ఉరుకులు పరుగులు చేస్తూ దాన్నొక వింత జంతువులా చూస్తున్నారు. ఎవరింటి ముందు వారే అమ్మలక్కలు తమ మగాళ్ళను, బాబులను చూస్తూ నిలబడ్డారు.

తనను దాటేసివచ్చిన ఆ జీపును దాటుకుంటూ రాగో అమ్మలక్కలవైపు నడిచింది

గోటుల్‌కు ఎడమవైపు తూర్పు దిక్కు కొమ్మలాడిపోయి ఆకులురాలిన ఆలి (రాలచెట్టు) మర్ర ఎదుగుదల ఆగి నిటారుగా నిల్చుంది బేగర్ (సర్కారీఁడ్లు) ఇళ్ళను వెక్కిరిస్తుంది.

"ఏం పచేలా! మీరు ఊళ్ళో ఉండి లేనట్టే అయి మేము కట్టిస్తున్న ఇండ్లను పాడుబడ్డ ఇండ్లకింద చేస్తున్నారు. మీ గొడ్లు ఎడ్లు పోయి మరింత పాడు చేయకుండా ఆ కొంపలను కొద్దిగనైనా దేఖ్‌రేఖ (చూసుకోవడం) చేయకుంటే ఎట్ల చెప్పు!" నీవు సర్కార్ మనిషివై ఉండి కూడ పట్టించుకోకపోవడం తప్పు కదా అంటూ హెచ్చరిస్తున్నట్లూ, బుద్ధరిస్తున్నట్లూ అన్నాడా రేంజర్.

పచేల్ అసలే కోపగొండి. ఈ సర్కార్ సాయబులు ఎవ్వడొచ్చినా తన పని విడిచిపెట్టుకోని అడ్డమైన చాకిరీ చెయాలా అనే తృణీకారం, కోపం మనసులో మెదలగా సర్రున వచ్చింది జవాబు.

"నీ దేఖ్‌రేఖ నేను చేస్తే నా దేఖ్‌రేఖ ఎవ్వడు చెయ్యాలె?"

అంత మాట విన్న రేంజర్ కోపం ఆకాశాన్నంటింది. కానీ తవలో తానే తమాయించుకున్నాడు. ఇదంతా గా అన్నల మద్దతు బిడ్డా చీటికి మాటికి మీరన్నది పదే గతి పట్టింది ఏం చేద్దాం అనాల్సిన మాట పైకి అనకుండానే పచేల్‌ను పట్టాలపైకి తేవాలన్న ధోరణిలో మరోమాట వెతుక్కోసాగాడు.

"ఈ గుట్టల మీద ఇండ్లు మీకోసం కాకుంటే సర్కార్ ఎందుకు కడుతుంది పచేలా?" అంటూనే కొనసాగింపుగా ఈ సర్కార్ చేసే ప్రతి పని మీ మంచికే అన్నట్టు నసగడం మొదలుపెట్టాడు.

రేంజర్ సర్కార్ మంచితనాన్ని తీసేసరికి తోకతొక్కిన పాములా లేచాడు పచేల్ బిరుజు.

"జీ! జీ! నువ్వన్నది నిజం జీ. పదేండ్ల కింద, గొడ గొడ ఏడుస్తున్నా వినకుండా పోరగాండ్లు పుట్టుడులేదు, పెండ్లాం ముట్లుడిగింది అని మొత్తుకున్నా వినకుండ దొరకబట్టి ఆపరేషన్ చేయించి హరిగోస పెట్టుకున్నది మాకోసమే. గీడ, జానెడు భూమి నరుక్కోని దోసెడు విత్తులు అలుక్కుందామంటే, పి.ఓ.ఆర్. (ప్రైమరీ అఫెన్సివ్ రిపోర్టు)లు చేసి కోర్టుల దండుగ కట్టేదాక గోమారి తీరుపట్టి విడవకుండ నానా తిప్పల పెట్టింది మా మంచికే. ఉత్తపుణ్యాన ఇంట్లసొచ్చి, సీసెడు కల్లు దొరికిందనీ నాలుగువందలు నగదు ఇచ్చేదాక మొబిల్ కోర్టువాళ్ళు విడవనిది కూడ బుడ్డ గోచోల్లను పెద్దచేసుటానికేనేమో? మా వూళ్లె సంఘం లేదు లాటారం లేదు అని నియ్యత్‌గా చెప్పంగ కూడ వినకుండా ఇల్లిల్లు గాలిచ్చి అడ్డమైనోళ్ళను నాలుగుతికి

కారే దాద బిడ్డను ఖరాబు చేసింది మా మంచి కోసం కాకుంటే మరెందుకు చేసింది ఈ సర్కార్? గీ బేగార్ ఇండ్లల్ల సంసారం చేసిన పాపాన పోలేదెవడు. మాకు ఆ ఇండ్లు వద్దు అంటే తెడ్డా మీమాట వినేది అన్నట్టు మొండిగ మొదలుపెట్టి మీదికెల్లి ఇదంతా మీకోసమే అనుడు? 'నీ అక్కా' అంటూ 'కింద మంటపెట్టి మీద నీళ్ళు పోసినట్టుంది' మీ యవారం అనే ధోరణిలో తను చెప్పదలచుకొన్నది కోపంగానైనా స్పష్టంగా చెప్పి ఊరివాళ్ళను చూస్తూ "ఏమ్‌రా" అన్నాడు.

సహజంగానే, మాడియాలు మాట్లాడేపుడు తను చెప్పుతున్నదంతా నిజమే అని తోటివారితో కూడ అనిపించుకోవడానికి ఇలా ప్రశ్నించడం అలవాటు.

పటేల్ చెప్పిందాంట్ల వెంటుకమందం కూడ జోల్ (అబద్ధం) లేదని గుర్తించిన జనాలు అతి సహజధోరణిలో కనుబొమ్మలెగరేసి తల ఒక్కసారిగా పైకెగరేస్తూ వారికి పుట్టుకతో అలవాటైన "ఇంగో" (అవును) అంటూ జవాబు ఇచ్చారు.

"దట్‌రా దాకడ్" (పోదాం పండి) అంటూ లేచి తువ్వాల దులపసాగాడు పటేల్.

చేతికి దొరికిన బందో, కర్రో కింద వేసుకొని కూచున్న గ్రామస్థులందరు పటేల్‌మాట వినగానే లేచి అధికార్లకు నిరసనగా కూచోవడానికి వేసుకున్న ఆ బందో, కర్రో తీసి దూరాన విసిరిగొడుతూ పటేల్‌ను అనుసరించసాగారు. ఎవరి గుమ్మాల్లో వాళ్ళుండి చూస్తున్న స్త్రీ లందరూ ఎవరికి తోచిన విధంగా వారు అధికార్లను శాపనార్థాలు పెడుతూ, మూతులు తిప్పుతూ, చేతులాడిస్తూ గుడిసెల్లోకి తల దూర్చారు.

క్రింది ఉద్యోగస్థులందరిముందు గోచిగుడ్డ పటేల్‌తో అంతటి సన్మానం జరిగి, ముఖంలో నెత్తురుచుక్క లేకుండా తయారైన రేంజర్‌ను చూసి దూరంగా నిల్చున్న జీపు డ్రైవర్ ముసిముసిగా నవ్వుకుంటూ మనసులోనే బిరుజు పటేల్‌ను మెచ్చుకున్నాడు. వీళ్ళ సంఘాలు, ఆ అన్నల అండదండలు మరింత బలపడాలని లోలోపల అనుకుంటూనే జీపు దగ్గరికి నడిచాడు.

బుర్.... బుర్.... బుర్ అంటూ జీపు తుర్రుమంది.

* * *

చిన్ననాటి మైని పెళ్ళయ్యాక ఇపుడెలా ఉందో, అడుకున్న రోజుల్లో అభిమానించినట్టే ఇవ్వాళ ఆదుకుంటుందా! అనుకుంటూ దారీ తెన్నూలేని ఆలోచన

అతో, పుట్టెడు అనుమానాలతో తడబడుతూ గడపలో కాలుపెట్టిన రాగోను చూసిన మైనీ అమాంతం మీదపడి కౌగలించుకుంది. ఎగురుతూ, తుళ్ళుతూ ఎక్కడున్నా పెద్ద సందడి చేసే మైనీ ఇపుడు ఇల్లు, సంసారం బరువు మోస్తూన్న పెద్ద పేరిలా తయారైంది.

మైని, రాగోలు తెల్లవారగానే కొద్దిగ అంబలి తాగి చెరోబుట్ట చేత పట్టుకొని, చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుంటూ అడవి వైపు సాగారు. అడవిలో దొరికే మొర్రిపళ్ళు తునికి పళ్ళు ఏరుకుంటూ ఎన్నెన్నో చర్చలు నడిపిస్తున్నారు. ఒక్కసారి తిరిగి చిన్నపిల్లలైనారు. అనాడు వాళ్ల కలసి తిరిగిన సెలయేళ్ళు, వాగులు, తోగులు ఒకటేమిటి ఏ నీళ్ళల్లో ఎన్ని కసరత్తులు చేసి ఎన్నెన్ని చేపలు, ఎండ్రకాయలు పట్టింది మొదలు ఏ చెట్టు కింద ఏ పండు, ఏ కాయ ఏరుకొని తిన్నది ఎవరెవరితో ఏ ఏ ఆటలాడుకున్న వరకు నెమరు వేసుకున్నాక మైని మనసు ఒక్కసారిగ తనతో ఎదిగిన తన తోటి ఆడపిల్లల వైపు తిరిగింది. ఒక్కొక్కరి గూర్చే అడిగి తెలుసుకోవాలని ఉబలాటంగా ఉంది. మామూలుగానే పళ్ళేరుకుంటూ మాటలు పేర్చుకుంటుంది.

"రాగో"

"ఊఁ!"

"కాంతి ఎవరిల్లు చొచ్చిందే" అంటూ ముందుగా తల్లిగారింటి కెదురుగా ఉండే పుంగాటి కాంతి గూర్చి మైని ఆరా తీయ ప్రారంభించింది.

"పుటుల్ వాళ్ల దగ్గర కల్లు దాగామని దాని అయ్య మేనోళ్ళకిచ్చి పెండ్లి చేసిండు. ఇపుడు పిట్టకసలోనే ఉంటుంది. మొన్న వచ్చినపుడు చూస్తే పొట్టతో ఉంది" రాగో బదులు చెప్పింది.

"పాపం. అవ్వ సచ్చినా కూచీ (పిన్ని) ఉన్నదాంట్లో మంచిగానే చూసి పెళ్లి చేసి గట్టెక్కిచ్చింది. అంటూ మైని కాంతి గూర్చి జాలిపడింది.

మాడియా స్త్రీలకు సహజమైన పద్ధతిలో రాగో "హే" అంటూ "ఊఁ" కొట్టింది.

అప్పుడే మైని మనసులో బయ్యక్క తళుక్కున మెరిసింది. ఎందుకోగానీ ఊళ్లోని యువతులందరికి అదంటే సదభిప్రాయం ఉండేది గాదు. తోటివాళ్ళు కాదు,

కూడదని ఎంత వారించినా షావుకారి దేవురావు ఇంటికి పోయి పనికి కుదరడం వాళ్లందరికి ఆమెపై అసహ్యం పెరగడానికి గల ఒకే ఒక కారణం.

బయ్యక్క ఈడు మీదున్న పిల్ల కనుక వయసులో ఉండే ఆడపిల్ల లక్షణాలు, బుద్ధులు, కోరికలు క్రమంగా దానికూడ పట్టుకున్నాయి. రాళ్ళ వానకు బోడ తలకు దంటయినట్టు షావుకారి భార్య ప్రసవానికి పోవడంతో పనికి కుదిరిన బయ్యక్క పని పాకాన పడ్డట్టయ్యింది. ఇంకేం. షావుకారమ్మ ప్రసవం అయి తిరిగి కాపురాన్కి వచ్చే సరికి ఇటు బయ్యక్కకు తెలవకుండానే మూడు మాసాలు నిండిపోయాయి. ఏ నోరాగుతుంది? లోకులు కాకులంటారుగదూ! చిలికి చిలికి గాలి వాన అయినట్టు ఆ నోటా నోటా ఈ మాట ఊరు ఊరంతా పలువలు చిలువల్లా పాకిపోయింది. అంత వరకే తెల్సిన మైని తర్వాత బయ్యక్క కేమయిందోనని ఆతృతతో రాగో నడిగింది.

"బయ్యి గొడవెలా తెగిందే రాగో" అంటూనే కిసుక్కున నవ్వింది మైని.

"ఆఁ! నువు నవ్వినట్టే అయ్యింది దాని బతుకు. ఆ షావుకార్లు దొంగలు. మన బతుకులు నాశనం చేస్తరంటే ఓ పట్టాన విన్నది గాదు. ఈడు మీదున్నపుడు జోడు దొరికే దాక ఆగకుండా కొత్తలున్న షావుకారి దగ్గర కొలువు దొరికితే వాడు కత్తీ చేయకుండా ఎందుకు వదలుతాడు? ఇంకా నయం. మునుపటి రోజులైతే ఊరి పెద్దలు మస్తుగా తాగి షావుకారి కొమ్మే కాసే వాళ్ళేమో. ఇపుడు సంగం అన్నలు నిలబడ్డంతో షావుకారి పప్పులుడుకలేదు. భయానికో, అవసరానికో గానీ ఇంట్లోనే ఉంచుకున్నాడు వాడు. ఆ తర్వాత దానికీ ఓ బిడ్డ పుట్టింది. ఏమైనా కులపు పెండ్లాన్ని చూసుకున్నట్టు దీన్ని చూసుకోడు కదా! జీతం, నాతం లేకుండా పడేసింది తింటూ గాడిది చాకిరి చేసే మనిషి దొరికినట్టయ్యింది ఆ తేలి (గాండ్ల) షావుకారికి. ఇప్పుడిప్పుడు బయ్యికి కూడ అర్థం అవుతుంది. నాకు కలసి ఏడుస్తూ దాని కథంతా చెప్పుకుంది." అంటూ చేతిలో పిడికిలి నిండిన తునికి పళ్ళు గుల్లలోపోసి నడుం ఎత్తి ఒక్కసారి వొళ్లు విరుచుకుంది. నాలుగు చినుకులు రాత్తేగాని ఎండజోరు తగ్గదన్నట్టు జోరు ఎండలకు నోరెండుక పోతున్నందున తెచ్చుకున్న బుర్ర దగ్గరికి రాగో దారి తీసింది. మైని వెనకాలే నడిచింది.

ఎండ విపరీతం. కాళ్ళకు చెప్పుల్లేకుండా పట్టపగలు నడవడం నిప్పులపై నడచినట్టే ఉంటుంది. బుర్రలో తెచ్చుకున్న నీళ్ళు సైతం ఎండ దగడుకు వేడై తున్నాయి. చిక్కం అల్లని బుర్రలైతే ఆ నీళ్ళు తాగడం ఎండను తాగినట్టే. వడ గాడ్పులకు చెవులదురుతున్నాయి. ఇంకా తునికాకులు తెంపే కాలాషురువ్ అయితే ఆ కూలీలు పడే అవస్థలు వర్ణనాతీతం.

చెట్ల ఆకులు రాలిపోయినాయి. ఎక్కడనో దూరాన పచ్చని ఆకులతో పూసుగు చెట్ల నీడ చల్లనుంది. కడుపులో చల్లబడ్డాక ఆ నీడలో కూచొని కాసేపు ఆరాం చేస్తే కునుకు రావడం క్షణం పట్టదు. ఇదేం చిత్రమో గానీ అడవిల అన్ని చెట్ల ఆకులు రాలిపోయినా పూసుగు చెట్టు మాత్రం ఇగురు పెట్టిన ఆకులతో ఎండాకాల మంతా చల్లగుంటుంది. అడవిలో అక్కడక్కడ నీళ్ళ తావుల దగ్గర కొన్ని పొరకలు పచ్చగా ఉన్నప్పటికీ మంచి నీడ దొరకడం కష్టమే- ఈ ఎండలల్లో గడ్డలో బెడ్డలో తేను అడవికిపోయి దారి తప్పి నీళ్ళు దొరక్కుంటే ఎన్నెన్ని పొడి పొడి ప్రాణాలు అడవిలోనే రాలిపోతాయో అడవిలో వడదెబ్బకు మనుషులేకాదు పసులు కూడ తెర్లైపోతయి.

బుర్రలోని నీళ్ళు నోట్లో వంచుకోని బుక్కెడు పుకిలించి ఉస్కసి ఆ తర్వాత లోపల కొద్దిగా చల్లగా ఉన్న నీళ్ళు నాలుగు బుక్కలు గటగట మింగారు రాగో, మైనీలు. మిగిలిన నీళ్ళల్లో నుండి దోసిలలో పోసుకోని మొగంపై చల్లగా చల్లు కున్నారు. రాగో పైట కొంగుతో మొగం తుడుచుకుంటుంటే మైని అదేపనిగా చూస్తుండి పోయింది. తాను కూడ చీర కట్టుకున్న రోజులు కళ్ళల్లో కలలా మెదలు తుంటే, తన ప్రస్తుత ఆకారాన్ని చూసుకోని మనసు చిన్న బుచ్చుకుంది. రాగో పైట అందివ్వబోగా వారిస్తూ, తాను చుట్టుకున్న చిన్న టవల్‌ను కాస్తా పైకి లేపి తల మోకాళ్ళవరకు వంచి మొగంపై మిగిలిన నీటి బిందువులను తుడుచుకొంది

"రాగో దట్" (నడువు) అంటూ మైని నీటిబుర్ర జబ్బకు తగిలించి ఊరు దారి పట్టింది. రాగో కూడ నడవడానికి నెత్తిపై బుట్టపెట్టుకుంది.

జబ్బలకు బుర్రలు తగిలించుకోని నెత్తిపై గుల్లలు పెట్టుకుంటున్న మైనీ రాగోలను చూస్తూ ఒక యువ జంట బిరబిరా దాటేసింది. వారిరువురి హడావిడి

చూసి రాగో తనలో తానే నవ్వుకుంది. ఆ చిరునవ్వును గుర్తించిన మైని పరిహాసం లోకి దిగింది.

గుట్టల మీద భార్యభర్తలు సాధారణంగా ఇళ్ళల్లో కలుసుకునే అవకాశాలు చాలా తక్కువ. ఆ పాటి గుడిసెల్లోనే పెద్దలు, పిల్లలు వారితో జతగా పెళ్ళయిన జంటలు కాపురం చేయాలంటే ఎలా కుదురుతుంది? పెద్ద పెద్ద ఇళ్ళు, ప్రత్యేక గదులు లేనివారు తమ అవసరాలు తీర్చుకోడానికి అడవిలోకి పోవడం తప్ప మరో మార్గం లేదు కదా! అలాగే వారు ఆదివాసులు. కాయ, పండు, ఆకు అలము, కట్టె పొరక కోసం పొద్దస్తమానం అడవిలో తిరగకుంటే వెళ్ళదు. ఆడమగకలసి పనులు చేసుకోకుంటే మరీ గడవదు. అడవిలో సంచరిస్తూ, పనులు చేసుకుంటూ, కాపురం చేయడమనేది వారి అవసరం.

"రేపు పెళ్ళైతేగానీ ఈ నవ్వడం తెలవదు" అంటూ మైనీ రాగోకు ఒక చురక అంటించింది.

"ఆలేదట్" (సరేపద) అనుకుంటూ అడుగులు వేయసాగారు.

మైని గుడిసె చేరాలంటే ముందు వారి పొలం దాటాలి. ఆ బాట వెంట నడుస్తున్న వారిరువురు కాసేపు మౌనంగా ఉండిపోయారు. నడుస్తున్న వారిరువురు సర్కార్ వారు చదను చేసిన తమ పొలంలోని కుంటను చేరుకున్నారు. నీళ్ల ఇగిరి పోయిన కుంటలో బురద కూడ ఎండిపోయి పగిలి నెర్రెలు వాసి ఉంది. బీటలు వారిన ఆ నేల పైపొర వొదలొదలుగా ఉంది. ఆ నెర్రల్లో నడిచినందున విరిగిన కాడికి పెద్దలైనయి కట్టెక్కేముందు మైని రాగో చూడకుండా గబుక్కున వంగి నాలుగు బెడ్డలు అందుకోని గుల్లలో వేసుకుంది. అయినా, రాగో చూడనే చూసింది.

"ఎందుకా దొంగతనం. ఇవాళ చెప్పకపోతే రేపైనా బయటపడదా. నాతో చెప్పి ఉంటే నేనే పెంకలో వేపుడుచేసి పెట్టేదాన్నే కదా!" అంటూ సంఘోను ఆప్యాయంగా దెప్పిపొడిచింది రాగో.

నెల తప్పిన వారినోరు అనేక రుచులను కోరుతుంది. మామూలు రోజుల్లో ముట్టుకోవడానికి కూడ మనసొప్పని చిరుతిళ్ళకు నోరూరుతుంది. ఉసిరి, మామిడి, చింత లాంటివి కావాలని ప్రాణం కొట్టుకుంటారు. రకరకాల రుచులతో ఏదైనా అపు

రూపంగానే తింటారు. ఇంటివారు కూడ ఇలాంటపుడు వారి కోర్కెలను తీరుస్తారు. ఈ మట్టిబెడ్డల్లో కూడ అన్నీ పసందుగా ఉండవంటారు. చెదలు పుట్టమన్ను తిన డానికి మనసొప్పక వం|్రుమన్నపుతే మరీ మక్కువగా తింటారు. అదీ వేపుడు చేసుకొని తినడం మరింత రుచి. వర్షాకాలం నేలంతా తడిసిపోయి పొడిబెడ్డలు దొరక డం కష్టం. ఉపాయం ఉన్న ఆడవాళ్లు ఆ కాలంలో జొన్నలు, వడ్లు ఇతర ధాన్యంలో ఉండే మట్టిబెడ్డలను కూడ వదలకుండా చాలా జాగ్రత్తగా దాచుకొని తృప్తిగా తింటారు పాపం.

"రాగో నాన్న బాగున్నాడే" తటాలున అడిగింది మైని.

మాటలు అటుపోవద్దని ఇంత సేపు జాగ్రత్తపడుతున్న రాగోకి మైని ప్రశ్న మెరుపులా తగిలింది. ఇంకేమేమి అడుగుతుందో. తీగలాగితే డొంకంతా కదులు తుంది. ఏ ప్రశ్నకు ఏ జవాబు చెప్పడమో తెలియదు. కలతపడ్డ గతమూ, దిక్కు తోచని భవిష్యత్తు ఒకేసారి తుఫానైనట్టయింది.

జరిగిందంతా మైనికి చెప్పాలా? వద్దా. తన సమస్య విని మైని ఏం అంటుంది. ఓదారుస్తుందా, చీదరించుకుంటుందా? తనదే తప్పంటుందా? ఏం చెప్పాలి? ఎలా చెప్పాలి? సంఘానికు నిజం చెప్పితే మరో నాలుగురోజులు ఇక్కడే ఉండనిస్తుం దేమో. మైనికి తన సంగతంతా చెప్తే అది తన మొగుడికి చెప్పకుండా ఉంటుందా? అతడు తన తల్లితండ్రులకు కబురు చేయకుండా ఉంటాడా! అదే జరిగితే తండ్రి మళ్ళీ తనని తన్ని లాక్కుపోడా? ఇక్కడి యువకులకు తన స్థితి అర్థమైతే వెంట పడకుండా వదలుతారా? ఇన్ని అనుకుంటూనే రాగో కలలో మాట్లాడినట్టు "ఇంగో" అని మాత్రం అనగలిగింది. రాగో వాలకానికి గాభరాపడ్డ మైని అప్పటికి మరి చాలించుకుంది.

ఈ ఆలోచనలతో తల వేడెక్కిన రాగో మైనికి ఏ విషయం చెప్పకుండానే అక్కడినుండి ఆ తెల్లవారి మకాం మార్చాలనుకుంది.

(ఇంకా ఉంది)

కవిత్వం - ఆధునికత

జె. సి.

గతితార్కిక భౌతికవాద కవిత్వం ఏ విధంగా ఉండాలి అన్న ప్రశ్నకు సమాధానం వెతకడం వ్యర్థం. కారణం సహజంగానే కవిత్వం ఏ భాషలోనైనా, ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనయినా ఒక గతితార్కిక భౌతిక సత్యం. అయితే ఈ సత్యాన్ని అసత్యంగా మార్చే కుట్ర అన్నిరకాల పాలకవర్గ భావజాలాల్లో అనాదిగా సాగుతున్న కుట్రలో భాగమే, అన్న విషయాన్ని ఇదమిద్ధంగా తేల్చుకోవాల్సిన అవసరం ఉంది. ఈ అవసరం ముఖ్యంగా విప్లవ పోరాటంలో భాగంగా కవిత్వాన్ని ఆయుధంగా చేపట్టిన కవికుంది. ఈ విషయాన్ని అర్థం చేసుకోవాలంటే కవిత్వానికున్న గతితార్కిక తాత్విక ప్రాతిపదికను స్థూలంగానైనా తెల్సుకోవాలి.

సామాజిక చైతన్య రూపమయిన సాహిత్యానికి శ్రమతో చిట్టచివరి (ultimate) సంబంధం ఉందన్న విషయం మనందరికీ తెలుసు. ఉత్పత్తిక్రమంలో పదార్థం, మానవశ్రమ (మానవ మేధస్సు, నరాలు, కండరాల ఉత్పాదాత్మక వ్యయం)ల మేళవింపు ఒక సరుకును ఉత్పత్తి చేస్తుంది. దాని కనుగుణంగా ఉపరితలంలో భాగమైన సాహిత్యంలోకూడ పదార్థ చైతన్యరూపాలైన భాష, భావనాశక్తుల మేళవింపు జరుగుతుంది. భావనాశక్తి అంటే ఇక్కడ సామాజిక సంబంధాలను అర్థం చేసుకుని వాటికి ప్రతీకల రూపంలో సాహిత్య లేక కావ్యస్థాయిని కల్గించేశక్తి అని అర్థం చేసుకోవాలి.

పదార్థం, చైతన్యం అనేవి వేర్వేరు ప్రత్యయాలు కావు. చలనంలో ఉన్న పదార్థం ప్రాథమిక వాస్తవికతలన్నది గతితార్కిక భౌతికవాద సత్యం. ఆలోచన, మనస్సు, మేధస్సు మొదలగు భావాలన్నీ పదార్థ చలనరూపాలే అన్న విషయాన్ని ఆధునిక భౌతిక, రసాయన శాస్త్రాలు ధ్రువపరుస్తాయి. భౌతిక వాస్తవికత అయిన ప్రకృతిని, బాహ్యప్రపంచాన్ని దాంట్లోనే భాగమయిన మనిషి దాని చైతన్యరూపాలే అయిన పంచేంద్రియాలు, మేధస్సుల సహాయంతో అర్థం చేసుకుని ఆ వాస్తవికతను అత్యున్నత స్థాయిలో ప్రతిఫలిస్తాడు. అయితే ప్రతిసారీ అతని అనుభవంలో పదా

ర్థం, చైతన్యం అన్న గతితార్కిక వైరుధ్యం ఉద్భవించి దాన్నుండే జీవం ప్రాణం పోసుకుంటుంది. ఈ వైరుధ్యంలో చైతన్య రూపమయిన రెండో ప్రత్యయం మొదటి ప్రత్యయమైన పదార్థపు అభివృద్ధి చెందిన రూపానికి వ్యక్తీకరణ అయినా ప్రాథమిక ప్రతిపత్తి కల్గిన మొదటి ప్రత్యయం లేకుండా దాని ఉనికి లేదు. అయితే వర్గసమాజం మొదలవుతూనే చెందిన రెండో ప్రత్యయాన్ని ప్రాథమిక ప్రత్యయం నుండి విడదీసి దానికి స్వతంత్ర ప్రతిపత్తి నాపాదించి ఒక పరమైన సత్యంగా రూఢిచేసే నైరూప్యధోరణి మొదలవుతుంది. దీనివల్ల మొదటి ప్రత్యయం అభావం చెందడమే కాదు, ఆ విధంగా జరుగటంవల్ల చైతన్య రూపమైన రెండో ప్రత్యయం కూడ ఒక నిర్జీవ కర్మకాండలోకి దిగజారిపోతుంది. ఈ ధోరణి ఫలితంగా సంభవించే పరిణామాలు :

ఒకటి, మానవుని శ్రమశక్తి దాంతోపాటే అది ఉత్పత్తిచేసే వస్తువులో భాగమైన ప్రకృతి పరాయీకరణ చెందడం. రెండు, శ్రమశక్తి పరాయీకరణతో బాటే శ్రమశక్తిలో ఇమిడివున్న మానవాంశ పరాయీకరణ చెందడం. మూడు, ఈ పరాయీకరణ ఫలితంగా స్వంత ఆస్తికి పునాది ఏర్పడటం. నాలుగు. ప్రకృతి, శ్రమశక్తుల పరాయీకరణ క్రమం అర్థంగాక అది సృష్టించిన మార్మికత ప్రకృతి శక్తుల దైవీకరణకూ, మానవాంశ దైవాంశగా మారడానికి చివరగా స్వంత ఆస్తి ప్రాతిపదికగా గల వర్గ సమాజాన్ని సృష్టించడానికి పై నాలుగు పరిణామాలూ కారణం కావడం. ఈ పరాయీకరణ క్రమంలో భాగంగానే వర్గసమాజంలో మౌలికంగా పదార్థ చైతన్య రూపమే అయిన కవిత్వం గూడ తననుండి తాను పరాయీకరణ చెంది, పాలకవర్గ భావజాలంలో భాగమైపోయింది.

భౌతికంగా పదార్థ చలన రూపమైన కవిత్వం సామాజిక చైతన్య రూపంగా ఏ విధంగా సంపన్నమవుతుందో క్రిస్టఫర్ కాడ్వెల్ సోదాహరణంగా వివరిస్తాడు. స్వభావరీత్యా లయప్రధానమైంది కవిత్వం. అంటే దాని మౌలిక సాహిత్యరూపం పాట. ఆదిమజాతుల్లో సామూహిక ఉత్సవం అనేది ఆ జాతికి చెందిన అందరి శ్రమశక్తి అనే నైసర్గిక గుణాన్ని ఒక సామాజిక ఉత్పాదక క్రియగా సన్నద్ధపరిచే ఒక సామాజిక ప్రక్రియ. ఈ ప్రక్రియలో నిజమైన వస్తువు అయిన సస్యఫలం మొదట ఊహాత్మక వస్తువు, నాట్యం, సంగీతం, పాట, దరువుల పడి, వేగంలో పడి ప్రస్తుత వాస్తవికత నుండి దూరమయిన మనిషి ఊహాప్రపంచం లోనికి విసరివేయబడతాడు.

ప్రస్తుత వాస్తవికతలో సస్యం అంటే పొలం ఇంకా నాటబడలేదు. కాని ఊహా ప్రపంచంలో అది అద్భుతమయిన నిజం. ఇంకా ఉత్కృష్టమయిన వాస్తవికత. సంగీతం, పాట ఆగిపోయిన తర్వాతకూడ ఇంకా నాటబడనప్పటికీ అద్భుత ప్రపంచంలో ఉన్నత వాస్తవికతగా నిలిచిపోయిన ఆ సస్యఫలం దాన్ని సాధించేందుకు కావలసిన శ్రమశక్తిని, ఉత్సాహాన్ని శ్రమజీవులకిస్తుంది. ఈ విధంగా శ్రమశక్తి యొక్క ఉత్పాదక క్రియలో సాధనమయిన సామాజిక ప్రక్రియలో భాగంగా ఆవిర్భావం చెందే కవిత్వం రానురాను సామాజిక ఆచరణలో భాగంగా రూపుదిద్దుకుంటుంది.

సామాజిక అవసరం, ఆచరణ శ్రమఫలంగా రూపుదిద్దుకుంటున్న చారిత్రక క్రమంలోనే మానవుడు ఉత్పత్తి చేసిన వస్తువులన్నిటికీ వాడుక విలువ కల్గుతుంది. ఆదిమ సమాజం మొదలుకొని భూస్వామ్య సమాజాలన్నిట్లో ఈ విలువ ప్రకృతికీ మనిషికీ, మనిషికీ మనిషికీ మధ్య సంబంధాన్ని సూచిస్తుంది. అయితే పదార్థ చైతన్యం సామాజిక రూపాల్ని సంతరించుకుంటున్న క్రమంలో వాస్తవికతతో జ్ఞానానికి ఉన్న గతితార్కిక సంబంధం అభావం చెందే తరుణంలో— అంటే సమాజంలో పరిశుద్ధత, పవిత్రతల పేరుమీద తరతమ భేదాలు, మతం, వ్యక్తిగత ఆస్తి పెంపొందే చారిత్రక క్షణంలో శ్రమశక్తి రూపంలో మానవాంశ పరాయీకరణం చెందడం మొదలవుతుంది. మౌలికంగా వాడుక విలువకు మానవాంశ ప్రాణం. కాని వాస్తవికతతో తనకున్న గతితార్కిక సంబంధాన్ని కాదని తనకుతాను అభావం చేసుకున్న చైతన్య రూపంలో మానవాంశ దైవాంశగా మారి మౌలికంగా వాడుక విలువైన, సహజాతమైన సామాజిక సంబంధాన్ని శాసించడం మెదలుపెడ్తుంది. తత్ఫలితంగా పుట్టుకతో మనిషికి లభించే సమానత్వం అభావం చెంది అసమాన సామాజిక సంబంధాలు ఏర్పడతాయి. భూస్వామ్య సమాజంలో దేవుడు మహానియంతగా మారి దేవుడికీ భక్తుడికీ మధ్య మాదిరిగానే భూస్వామికి దాసుడికి మధ్య పరమైన సంబంధంగా మారిపోవడానికి ఈ విపర్యయమే కారణం. దీని కారణంగానే మానవాంశకు ఉద్దీపింపజేసే లయాన్వితమైన పాటను శాసించి, నియమితం చేసే ఛందస్సులకు, ఛందో నియమాలకు భూస్వామ్య యుగంలో అత్యంత ప్రాముఖ్యత లభించింది. సామాజికాచరణకు దూరమయిన బౌద్ధిక, చిత్ర, శ్లేష, ప్రబంధ కావ్యాలన్నీ, అధిభౌతిక ఆధ్యాత్మిక భావాల్ని ప్రతిఫలించే వచనాలు, పద్యాలు కూడ ఈ విపర్యయంలో భాగాలే.

శివకవులు, వేమన వంటి కవులు కూడా భూస్వామ్య భావజాలం ప్రభావంలో కవిత్వం రాసినాకూడ సమాజంలో శ్రమశక్తి ఆధారంగా జీవిస్తున్న ప్రజానీకం, వారి అనుభవానికి దగ్గరైన భాషతో, భావాల్తో ఐక్యతను సాధించే ప్రయత్నంలో భాగంగా కవిత్వం రాశారు కాబట్టే మానవాంశను ప్రతిఫలించే కవిత్వాన్ని రాయగలిగారు.

అయితే వస్తు రూపాల మధ్యగల గతితార్కిక సంబంధాన్ని అంటే వాటి మధ్యగల వైరుధ్యం, ఐక్యతలను గుర్తుంచుకుంటే వస్తువులో (భాష, భావాలు, పద చిత్రాలు వగైరాలు) వేమన సాధించాడనుకున్న ఘనత, రూపంలో (పద్యరూపం, ఛందస్సు, భాష, పదచిత్రాలు వగైరాలు) అంటే స్థలకాల నిర్దేశితమైన రూపంలో పరిమితమైపోయింది. అలాగే రూపంలో స్థలకాల పరిమితులకు లోనైనా వస్తువులో ఆయనకున్న శ్రామిక జన పక్షపాతం గతితార్కిక భౌతికవాద సత్యాన్ని గ్రహించేందుకు దోహదపడిందని చెప్పవచ్చు. ఇక వస్తు రూపైక్యత గురించి ఆలోచిస్తే ఛందోబద్ధమైన పద్యంగా దానిలోని అజంతాలయిన పదాలు, వ్యాకరణ బద్ధమైన వాక్యాలు అధిభౌతిక తర్క లక్షణం, శతక మకుటం అన్నీ కలిసి భూస్వామ్య మర్యాదకు ప్రతిరూపాలు కాగా సన్యాసులు, పాటక జనులు పాడుకొనే తత్త్వంకు దగ్గరైన చరణాలు, సామాజికాచరణలోంచి వచ్చిన సాధారణ పరిజ్ఞానం (Common sense), అనుభవసారం భూస్వామ్య భావజాలంలో పూర్తిగా పరాయీకరణ చెందకుండా నిలదొక్కుకున్న మానవ లక్షణం అయి ఆ రెంటిమధ్య అంతర్లీనంగా జరిగే, వర్గ సంఘర్షణను స్ఫురణకు తెస్తుంది. శ్రామికవర్గ పక్షపాతం గల కవిత్వంలో ఈ లక్షణం దాని ఔన్నత్యానికి, వైశిష్ట్యానికి దోహదం చేస్తుంది. భూస్వామ్య యుగంలో శిష్ట సాహిత్యంలో భాగమైన కవిత్వాన్ని వదిలేసి మౌఖిక సాంప్రదాయంలో జీవించిన జానపద గేయాల్ని తీసుకుంటే శ్రమకూ శ్రామికుడి జీవితానికి దగ్గరైనా అవి కూడా శ్రమజీవుల చైతన్యం పరాయీకరణ చెందిన మేరకు పరాకృతం అయ్యాయి అన్న విషయం మనకు తెలుసు.

ఈ సందర్భంలోనే ప్రకృతితో మనిషికున్న అవిభాజ్యతను ఇంకా నిరాకరించని ఆదిమ భౌతికవాదం భారతదేశంలో ప్రతిపాదించిన రస, ధ్వని సిద్ధాంతాల్ని పదకొండో శతాబ్దం తరువాత భూస్వామ్య భావజాలం అలౌకిక సిద్ధాంతాలుగా మార్చివేసిన సంగతి కూడా మనకు తెలుసు.

ఇక పెట్టుబడిదారీ వ్యవస్థలో వాస్తవిక రూపాలన్నిటికీ వాడుక విలువతో బాటు మారకపు విలువ కూడా సంతరిస్తుంది. పరాయీకరణ ఫలితంగా భౌతిక వాస్తవికత కంటే అధిభౌతిక అస్తిత్వమే ఉన్నతమయిన వాస్తవమని భూస్వామ్య భావజాలం భావిస్తుంది. కాని పెట్టుబడిదారీ సమాజంలో మనిషి ప్రకృతిపై సాధించిన శాస్త్ర విజ్ఞాన విజయాల ఫలితంగా యూరోపులో భౌతిక ప్రపంచం, భౌతికోత్పత్తులకు, సామాజిక వాస్తవికతకు, మానవుని శ్రమ శక్తికి మర్యాద మన్నన లభించాయి. మధ్యయుగాల తర్వాత యూరోపులో మతానికీ, మతాచార్యులకూ ఉన్న నిరంకుశాధికారం తగ్గి సమాజంలో మనిషికి గుర్తింపు లభించడం ఈ క్రమంలో భాగంగానే జరిగింది. కాని ప్రకృతికి మనిషికి, శ్రమజీవికి అతని శ్రమ శక్తికి మధ్యగల గతితార్కిక సంబంధాన్ని గుర్తించకపోవడంవల్ల, ఉత్పత్తి శక్తులు ఇంతకు ముందెన్నడూ ఊహించని రీతిలో పెరిగినప్పటికీ క్రమక్రమంగా భూస్వామ్య భావజాలం సృష్టించిన అచారిత్రక నైరూప్య అధిభౌతిక ధోరణిని, పరాయీకరణను పెట్టుబడిదారీ చైతన్యం అభావం చేయలేకపోగా దాన్ని ఇనుమడింపజేసింది. వస్తూత్పత్తి పెద్ద ఎత్తున జరిగి అదే విధంగా శ్రమజీవికీ అతడు ఉత్పత్తి జేసిన వస్తువుకూ మధ్య దూరం కూడా అదే విధంగా పెరిగి వస్తువుల మధ్య మారక సంబంధం అన్ని విలువల్నీ, మానవ సంబంధాల్ని శాసించే స్థితికి వచ్చాయి. అంటే మార్కెటు మానవ సంబంధాల్ని శాసించడం మొదలు పెట్టిందన్నమాట పెట్టుబడిదారీ వ్యవస్థ ప్రారంభంలో ప్రతిపాదించిన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం అన్న భావాలు సామాజికాచరణకు దూరమై, మానవ సంబంధాన్ని వస్తువుల మధ్యగల సంబంధంగా పరిగణించే నిర్జీవ నైరూప్య ధోరణివల్ల మానవాంశ సరుకుల మాయగా రూపాంతరం చెంది సరికొత్త అధిభౌతిక భావజాలం ప్రచారంలోకి వచ్చింది. తత్ఫలితంగా పెట్టుబడిదారీ వ్యవస్థలో, ముఖ్యంగా సామ్రాజ్యవాద యుగంలో సామాజిక సంబంధం రెండింతలుగా పరాయీకరణ చెందింది.

ఈ నేపథ్యంలో ఇంగ్లీషు సాహిత్యాన్ని పరిశీలిస్తే ఈ విషయం బాగా అర్థమవుతుంది. ఇంగ్లండులో పెట్టుబడిదారీ వ్యవస్థ తొలిదశ అయిన రినాజెన్స్ (పునర్వికాసం) కాలంలోనే చెప్పుకోతగ్గ సాహిత్య సృష్టి జరిగింది. ఈ దశలో జరిగిన సామాజిక మార్పులకు స్పందించి రాసిన నాటక రచయితల్లో చెప్పుకోదగ్గవారు మార్లో, షేక్స్పి

యర్, బెన్ జాన్సన్, విబ్సర్, డెక్కర్‌లు. వారి నాటకాల్లో పెట్టుబడి సృష్టించిన మారకపు విలువకు భూస్వామ్య యుగావ శేషమయిన వాడుక విలువలకు మధ్య జరిగిన సంఘర్షణ మానవ సంబంధాల్లో ఏ విధంగా ప్రతిఫలించిందో తెలుస్తుంది. షేక్స్పియర్ నాటకమయిన "కింగ్ లియర్" లో పితృప్రేమ అనే వాడుక విలువ ప్రధానంగా నైరూప్య విలువైపోయి నందువల్ల మొదటి ఇద్దరు కూతుళ్ళు తండ్రిపై ప్రేమ నటించి రాజ్య భాగాల్ని సంపాదించినా తరువాత తమ సుఖాలకోసం తండ్రిని తరిమి వేస్తారు. తండ్రితో తమ సంబంధం ఒక మారకపు విలువై పోతుంది. వారికి మారకపు విలువ ప్రధానమైపోయిన ప్రపంచంలో చిన్న కూతురు ప్రేమ ఒక అవశేషంగా మిగిలి త్యాగమైపోతుంది. "హామ్లెట్" నాటకంలో అనాటి విలువల్ని విద్యలో రంగరించిపోసే, విటెన్‌బర్గు విశ్వవిద్యాలయంలో విద్యాభ్యాసం చేస్తాడు ప్రిన్స్ హామ్లెట్. తన తల్లి భర్త మరణం తరువాత మరిదిని పెళ్ళి చేసుకుని రాచరికాన్ని అపవిత్రం చేస్తుంది. రాచరిక వ్యవస్థ పవిత్రత అనేది, ఒక అధిభౌతికమయిన, వాడుక విలువ దాని పవిత్రతను రక్షించాలంటే తన, భార్యను, ప్రేమికురాల్ని హామ్లెట్ త్యాగం చేయాలన్నది (శ్రీరామచంద్రులవారి కథలో మాదిరిగా) రూలౌతుంది. ప్రేమకంటె విధి నిర్వహణ గొప్పది కాబట్టి. ఈ భూస్వామ్య భావజాలాన్ని వంటబట్టించుకొని వచ్చిన హామ్లేటు ఆ వ్యవస్థ సృష్టించే మూఢనమ్మకం వల్ల తన తండ్రి దెయ్యమై కన్పించి తన తల్లి, చిన్నాన్నలు కలిసి తనకు విషమిచ్చి చంపారని చెపితే నమ్మి, తన తల్లిమీద కాకున్నా "తల్లి" అనే అధిభౌతిక భావం మీద గల గౌరవంచేత ప్రతీకారం తీర్చుకోలేక సందిగ్ధంలో పడి పిచ్చిపట్టినవాడై ప్రేమికురాలి హృదయాన్ని భగ్నం చేసి ఆమె ఆత్మహత్యకు కారణమౌతాడు. ఈ విషాదాంత నాటకాన్ని సృష్టించింది రాణీగారిని హత్యకు ప్రేరేపించిన మారకపు విలువ, హామ్లెట్ చైతన్యంలో తిష్ట వేసుక్కూచున్న అమూర్త భూస్వామ్య విలువల మధ్య సంఘర్షణ మాత్రమే. బెన్ జాన్సన్ నాటకమైన "వొల్పోనే" (నక్క) నాటకం బంగారమనే మారకపు విలువ సర్వస్వమైపోయిన ప్రపంచంలో గౌరవం (Honour), శీలం (Chastity) అనే నైరూప్యం చెందిన భూస్వామ్య వాడుక విలువలకూ నైరూప్య మారకపు విలువకూ మధ్య సంఘర్షణ ఎటువంటి విపరీతాలకు దారితీస్తుందో చిత్రిస్తుంది. వెనిస్ నగరంలో సంతానం లేని ఆస్తిపరులైన ఉన్నత పౌరులకు విలువైన బహుమతులిచ్చి మెప్పించి వారికి వారసుడుగా

వడమనే సంప్రదాయం ఉంది. దాన్ని ఎరగాపెట్టి, పెళ్ళి పెటాకులు లేక ఎంతో ధనాన్ని కూడబెట్టుకుని ఉన్న వొల్పోనే మోస్కా సహాయంతో స్వామి భక్తి పరు డైన జబ్బుపడి చనిపోయే స్థితిలో ఉన్నట్లు నటించి వెనిస్ నగరంలోని ధనవంతు లైన ఉన్నత పౌరుల నుండి విలువైన బహుమతుల్ని రాబట్టడానికి ప్రయత్నిస్తాడు. వొల్పోనే ఆస్తికి వారసులు కావాలన్న కోర్కెతో ఆ నగరంలోని ఒక మూడు కాళ్ళ ముదుసలైన భూస్వామి, ఒక లాయరు, ఒక వైద్యుడు, ఒక వ్యాపారి కళ్ళవెంట, ముక్కువెంట చీము కారుతూ చెక్కిళ్ళ చర్మం ముడతలు పడి అనేక రోగాలతో ఇప్పుడో అప్పుడో అన్నట్లు ఉండే విధంగా మేకప్ చేసుకుని నటిస్తూ ఉన్న వొల్పోనేకు బంగారు నాణాల సంచుల్ని, వెండి బంగారు పళ్ళేలను ముత్యాల హారాల్ని బహుమతులుగా ఇస్తారు. వృద్ధాప్యంతో కళ్ళు కన్పించక, చెవులు విన్పించక, మోకాళ్ళ నొప్పుల్తో నడవలేని ముసలి భూస్వామి కూడా గోతి కాడి నక్కలాగ వొల్పోనే చావుకు ఉవ్విళ్ళూరుతూ, మోస్కా సలహాపై తన కొడుకుకు కూడా తన ఆస్తిపై హక్కు లేకుండా చేసి యావదాస్తినీ వొల్పోనే పేర విల్లు రాస్తాడు. ఇక వ్యాపారి ఆస్తివేటలో మిగతావారి కన్న ఎక్కువ మెప్పించాలని, అందమైన తన భార్యను వొల్పోనే దగ్గరకు పంపుతాడు. వొల్పోనే ఆరోగ్యం బాగుపడాలంటే ఒక ఆరోగ్య వంతమైన అందమైన స్త్రీతో సంభోగం చేయాలని వైద్యులు సలహా యిచ్చినందు వల్ల ఆస్తి వేటలోని పోటీదారుల్లో ఒకరు ఒక వేశ్యను, ఇంకొకరు తమ కూతుర్ని పంపించబోతున్నారని నిజానికి వొల్పోనే ఏ స్త్రీని ముట్టుకొనే స్థితిలో కూడ లేడని, అవసరమొస్తే తానే తన యజమానిని మెత్తతో ఉక్కిరి బిక్కిరిచేసి పరలోకం పంపిస్తానని మోస్కా చెప్పిన మాయ మాటలు నమ్మి అమాయకురాలైన తన భార్య కిటికీలోంచి బయటికి చూసినా అనుమానంతో వేధించే వ్యాపారి ఆమెను వొల్పోనే వద్దకు పంపడానికి ఒప్పుకుంటాడు. చివరకు స్వామి భక్తి గల మోస్కా తన యజ మానినే ఆస్తికోసం ఇరకాటంలో పెట్టే విధంగా మారిపోతాడు. భూస్వామ్య వ్యవ స్థలో ఆచరణాత్మక సంబంధాలు కాకుండ పరాయీకరణ చెంది అమూర్తమైన అధి భౌతిక ప్రత్యయాలుగా మారిపోయిన వాడుక విలువలు పెట్టుబడి, కార్ఖానాలు, యంత్రాలు వ్యాప్తిలోకి తెచ్చిన మారకపు విలువతో ఢీ కొన్నపుడు ఏ విధంగా అర్థరహితమై కూలిపోతాయో ఈ నాటకంలో బెన్ జాన్సన్ అనన్య సాధ్యంగా కావ్య రూపేణా నిరూపిస్తాడు. భూస్వామ్య భావజాలం, పెట్టుబడిదారీ వ్యవస్థలోని

వ్యతిక్రమం రెండూ మూర్తీభవించిన వాల్పనే వంటి వ్యక్తి సమాజంలో ఎంతటి ప్రమాదకరమయిన చీడపురుగుగా తయారు కాగలడో అన్న విషయాన్ని ఈ నాటకం అద్దం పట్టినట్లు చూపెడుతుంది.

ఈ నాటకాల్లో స్పష్టంగా కన్పించే విధంగా భూస్వామ్య యుగం నుండి వారసత్వంగా లభించిన అసమాన సామాజిక విలువలు మానవాతీతమైన ఆచార ప్రత్యయాలుగా మారిపోయిన విలువల్ని, పెట్టుబడి ప్రోత్సహించిన స్వాతంత్ర్యం, సమానత్వం, సౌభ్రాతృత్వం వంటి, సరుకుల మాయలో పడి సామాజికత్వాన్ని కోల్పోయి అధి భౌతికమైన నైరూప్య వైయక్తికతను సంతరించుకున్న విలువలు అభావం చేయలేక పోయాయి.

అధి భౌతిక పదార్థ చైతన్యాన్ని అభావం చేసిన భూస్వామ్య భావజాలంతో పెట్టుబడిదారీ విలువలకు వైరుధ్యం ఏర్పడినా వాన్ని పూర్తిగా అభావం చేయలేక పోయాయి. అందువల్ల అధి భౌతిక పదార్థ చైతన్యం, సమానత్వం, సామాజికతలపై ఆధారపడ్డ గతితార్కిక భౌతికవాద చైతన్యంగా రూపొందలేకపోయింది. దానికి బదులుగా ఒక నయా అధి భౌతిక చైతన్యం పెంపొందింది. దీన్లో భావవాదపు అధి భౌతికతతోపాటు, భౌతికవాదపు అధి భౌతికతకూడా కల్సి ఉన్నాయి. పదిహేడవ శతాబ్దంలో షేక్స్పియర్, బెన్ జాన్సన్‌ల నాటకాల తరువాత డన్ వంటి అధి భౌతిక కవి రాసిన కవిత్వంలోనూ ఈ రకమైన ఐక్యతే కన్పిస్తుంది. అదే విధంగా ప్రపంచంలోనే మొట్టమొదటి బూర్జువా ప్రజాస్వామ్య ప్రభుత్వాన్ని స్థాపించిన క్రామ్‌వెల్ వెనుక ఉన్న సామాజిక శక్తి అయిన ప్యూరిటన్ మతస్థుల తిరుగుబాటు ధోరణిని ప్రదర్శించే కవియైన మిల్టన్ పారడైజ్ లాస్ట్ కావ్యంలో కూడ ఈ పరిణామమే కన్పిస్తుంది.

పదిహేడవ శతాబ్దపు ఫ్రెంచి తత్వవేత్త అయిన దేకార్ట్ ఆలోచనల్లో కూడ నయా అధి భౌతికవాదమే కన్పిస్తుంది. మానవుని శరీరం, మనస్సులు రెండూ భిన్నమైన, నిర్ణీతమైన, సుస్థిరమయిన అంగాలనీ, మానవుడు దేవుని హస్తాలతో నిర్మించబడ్డ యంత్రమనీ ఆయన వాదన. దేవుడనే భావం భూస్వామ్య భావజాలం ఉత్పత్తి చేసిన పరమైక సత్యమైతే శరీరం, మనస్సులకు మధ్య గల యాంత్రిక వైరుధ్యం భౌతిక ప్రపంచంలో భిన్నత్వాన్ని దర్శించే ధోరణి ఈ రెండూ కూడ గతితార్కిక సంబంధం లేని ఏకపక్ష సత్యాలే.

పద్దెనిమిదవ శతాబ్దంలో ఇంగ్లండులో జరిగిన పారిశ్రామిక విప్లవం వల్ల భూస్వామ్య సంబంధాలకు పెట్టుబడిదారీ విలువలకు మధ్య అంతరం ఆర్థిక, రాజకీయ విషయాల్లో వైరుధ్యంగా మారినా తాత్విక విషయాల్లో అది భౌతిక భావసారూప్యతే కన్పిస్తుంది. రాజకీయ, ఆర్థిక విషయాల్లో అధికారాన్ని సంపాదించుకోజూస్తున్న మధ్యతరగతికి తాత్విక, సాంస్కృతిక వ్యవహారాల్లో తనదని చెప్పుకోదగ్గ ఆలోచన, ఆచరణలు అవసరమయ్యాయి. ఈ విషయంలో చాలా బలహీనమైనప్పటికీ ఏదో కొంత ప్రయత్నం చేసినవాళ్ళు స్టీల్ (1672-1729), ఎడిసన్ (1672-1719) (1728-74) గోల్డుస్మిత్‌లు.

ఈ క్రమంలోనే ఫ్రాన్సులో ఫ్రెంచి విప్లవం జరిగింది. దానికి తాత్త్విక పునాది కల్పించిన వాళ్ళల్లో రూసో, వోల్టేరులు ముఖ్యులు. ఇంగ్లండులోకి వ్యాపించిన ఈ ఉపరితల విప్లవం సాహిత్యంలో భావవాద కవిత్వంగా ప్రతిఫలించింది. స్థూలంగా భూస్వామ్యయుగపు అవశేషాలయిన ఛందస్సు, కవిత్వభాష, అలంకారాలను ఛేదించి బూర్జువా ఆలోచన క్రమంలో భౌతిక ప్రపంచానికి, మనిషికి, మనిషికి మనిషికి మధ్య గల సామాజిక సంబంధమాధారంగా కవిత్వసృష్టి చేసిన భావవాద కవుల్లో ముఖ్యులు నల్గురు : విలియమ్ వర్డ్స్‌వర్తు (1770-1850), జాన్ కీట్సు (1795-1821), షెల్లీ (1792-1822), కోలరిడ్జ్ (1772-1834). వీరు సామాజిక సంబంధాన్ని అర్థం చేసుకున్న తీరు సమకాలీన ఆర్థిక శాస్త్రజ్ఞులు సరుకులమధ్య సంబంధాన్ని అర్థం చేసుకున్న తీరుపై ఆధారపడింది.

వస్తుమారకంలో విలువలు సమానంగా పరిగణింపబడతాయి. శ్రమ ఉత్పత్తి జేసిన వస్తువులు మౌలికంగా వాడుక విలువలు. మానవుని అవసరాన్ని బట్టి అతని తృప్తి కోసం సృష్టింపబడి ప్రకృతికి మనిషికి; మనిషికి, మనిషికి మధ్యగల సామాజిక సంబంధానికి అవి వస్తురూపాలు. శ్రమశక్తి పరాయీకరణ చెందే క్రమంలో వాటికి మారకపు విలువ కల్గుతుంది. ఈ విలువ ఆ వస్తువును, దాన్ని ఉత్పత్తి చేసిన శ్రమశక్తిని కూడ మారకపు విలువ లేక అమ్మకపు విలువగా మార్చివేస్తుంది. ఈ విలువలే శ్రమశక్తిని అదనపు విలువ రూపంలో సులువుగా దోపిడీ చేయడానికి అవసరమైన మార్మికతను లేక సరుకుల మాయను కూడ సృష్టిస్తుంది.

మారకపు విలువ ఒక సామాజిక సంబంధంగా వాడుక విలువపై అభివృద్ధి చెందిన చైతన్య రూపం. దాని సార్వత్రిక రూపం డబ్బు. దానిని ఉపయోగించుకుని

మరికొన్ని వాడుక విలువల్ని అంటే మానవ సమాజానికి అవసరమైన వస్తువుల్ని సంపాదించుకోవచ్చు. కాని దానికి ప్రాథమిక విలువైన వాడుక విలువను అభావంచేసి స్వంత ఆస్తిగా, పెట్టుబడిగా, మార్చే గుణం ఉంది. సరుకుల మాయను ఉత్పత్తిచేసి మానవ సంబంధాన్ని ఒక అయోమయ, అమానుష, నిర్జీవ పరిమాణంగా మార్చే లక్షణం ఉంది. ఈ అధిభౌతిక పరిణామ క్రమంలోనే పెంపొందిన సామాజిక చైతన్య రూపాలుగానే పందొమ్మిదవ శతాబ్దపు భావవాద కవిత్వాన్ని, రియలిజాన్ని (వాస్తవ వాదాన్ని) ఇరవయ్యో శతాబ్దంలో వచ్చిన ఇంప్రెషనిజమ్, (ఎక్స్‌ప్రెషనిజమ్, సింబలిజమ్, సర్రియలిజమ్ వంటి సాహిత్య కవితోద్యమాన్ని చూడాల్సి ఉంటుంది.

ఇంగ్లీషు భావవాద కవిత్వంలో మనకు అప్పటి ఆర్థికవేత్తల ఆలోచనలో మాదిరిగానే వాడుక విలువను, మారకపు విలువను కలగాపులగం చేయడం కన్పిస్తుంది. భూస్వామ్య యుగపు భావజాలాన్ని, రూపాల్ని దెబ్బ గొట్టి తమదైన ఒక తాత్త్విక, సాంస్కృతిక పునాదిని వేసుకోవాలనే ప్రయత్నంలో భాగంగా ప్రకృతి, సమాజాలతో అంటే భౌతిక ప్రపంచంతో సమానత్వం ఆధారంగా ఒక కొత్త సంబంధాన్ని పటిష్టం చేసుకోవడానికి ప్రయత్నం జరిగింది ఈ ప్రయత్నంలో భాగంగానే వర్డ్స్‌వర్త్ ప్రకృతిని మానవసంబంధాల సంచయంగా ఊహించడానికి ప్రయత్నిస్తారు, కాని ప్రకృతిపై అతడు ప్రసరించేది అధి భౌతిక దృష్టే. కీట్సు ఇంద్రియానుభవాన్ని అందానికీ, సత్యానికీ ప్రాతిపదికగా తలుస్తాడు కాని అచరణాత్మక ప్రపంచంలో కాక ఊహాత్మక ప్రపంచంలో. షెల్లీ మానవసమాజానికి లాభం చేయడం కోసమే స్వర్గంనుండి అగ్నిని దొంగిలించి తెచ్చిన ప్రొమిథియస్‌కు, తత్ఫలితంగా దేవతలరాజు చేతుల్లో పర్వతానికి బంధింపబడి అనంతంగా శిక్ష ననుభవించే పురాణ పురుషుని త్యాగాన్ని కీర్తిస్తాడు, కాని ఒక ఆదర్శవాదిగానే. ఇక కోలరిడ్జ్ తన సాహిత్య సిద్ధాంతంలో భావుకత (fancy) భావనాశక్తు (imagination) ల్ని అలౌకికతనుండి తప్పించి తార్కిక వివరణను ప్రతిపాదిస్తారు కాని గతి తార్కికంగా కాదు. ఇవన్నీ కూడ మారకపు విలువల ప్రపంచంలో ఆ విలువను యథాతథంగా గుర్తించకుండా, ఆ కారణంగానే నైసర్గికంగా అభావం చెందిన వాడుక విలువల్ని వాస్తవమని భ్రమించి ప్రేమించడం వల్ల అధి భౌతికమైపోయాయి. అందువల్లనే వాళ్ళ ప్రయత్నాలు అబద్ధాన్ని నిజంగా భ్రమింపజేయడానికో, అబద్ధంగా కుదించబడ్డ వాస్తవాన్ని ప్రతిపాదించడానికో పనికివచ్చాయి.

అయితే భావవాద కవుల సంపూర్ణ ఆత్మాశ్రయ పద్ధతివల్ల వారి కవిత్వం ఒక నిశ్చల నిర్జీవ అవాస్తవికతగా దిగజారిపోయే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. కాని కవిత్వభాషగా వాళ్ళు ఎంచుకున్న సామాన్యజనుల భాష (ముఖ్యంగా వర్డ్సువర్త్), ఇంద్రియానుభవ చిత్రీకరణ (కీట్సు) ప్రజానుకూల ధోరణి (షెల్లీ) మొదలగు భౌతిక చైతన్యరూపాలు దాన్ని ఆ ప్రమాదంనుండి కాపాడాయి. కవిత్వ వస్తుపరంగా ఇంత బలమైన ముడిపదార్థాలు ఉండికూడా సామాజికత నుండి వేరైన ఆత్మాశ్రయ ఊహాధోరణి వారి కవిత్వాన్ని ఒక వైయక్తిక స్వగతంగా రూపాంతరం చెందించింది. ఈ విషయం ఇంగ్లీషు భావవాద కవుల కవిత్వాన్ని అమెరికన్ కవి రాబర్టు ఫ్రాస్టు కవిత్వంతో పోల్చి చూస్తే సులభంగా అర్థమవుతుంది. ఫ్రాస్టు కవిత్వంలోని చైతన్యంకూడ వైయక్తికమే అయినా అది తన స్థల కాల వస్తురూపాల్ని అంటే చరిత్రను, సామాజికతను తృణీకరించలేదు.

పందొమ్మిదవ శతాబ్దపు మొదటి భాగంలో సార్వత్రికంగా విస్తృతమవుతూ పోతున్న నిర్జీవ యాంత్రిక బూర్జువా మార్కెటు సంబంధాలను వ్యక్తికి సమాజానికి ప్రకృతికి మధ్యగల ప్రగతిశీలమైన గతితార్కిక సంబంధం విడిపోయి అది సరుకుల మార్పిడి సంబంధంగా మారే వ్యతిక్రమంలోని జీవనలయను యథాతథంగా సంగ్రహించిన సాహిత్యరూపం నవల మాత్రమే. విజ్ఞాన శాస్త్రాభివృద్ధి, వ్యక్తి స్వేచ్ఛ, లౌకికతకూ మతానికి సయోధ్య వంటి నైరూప్య సామాజిక సంబంధాలు లేక మారకపు విలువలను కొత్తసమాజ న్యాయంగా అంగీకరించిన ఉదారవాదం (Liberalism) నవలా రూపానికి ప్రాణం పోసింది. ఇంగ్లీషు సాహిత్యంలో డీఫో, ఫీల్డింగ్, రిచర్డ్సన్‌ల తరువాత డికెన్స్ (1812-70) ఈ క్రమంలో వచ్చినవారే. యూరపులో ఈ సందర్భంలో చెప్పుకోవాల్సింది రష్యన్ నవలాకారుల త్రయం! దొస్తవస్కీ, టర్జెనిక్, టాల్‌స్టాయిలు. అలాగే ఫ్రెంచి నవలాకారులు స్టెండల్, బాల్జాక్ (1799-1850)లు. పందొమ్మిదవ శతాబ్దాంతానికి వీరి వాస్తవవాదం (realism) యూరోపులో, మానవ జీవితం ఉదారవాదపు ఊసు లేకుండా పూర్తి అమ్మకపు విలువగా మారిపోయే క్రమాన్ని ప్రాకృతిక వాదం (Naturalism) సూచిస్తుంది. ఈ క్రమంలో చెప్పుకోదగ్గ నవలాకారుడు ఎమిలి జోలా (1840-1902). పందొమ్మిదవ శతాబ్దపు ఇంగ్లీషు సాహిత్యంలో ఈ ప్రాకృతిక వాద ధోరణి తగ్గుస్థాయిలో ఉంది. కాని థామస్ హార్డీ (1840-1924)

నవలల్లో మనకు కన్పించే నియత నిరాశావాదం (deterministic pessimism) ప్రాకృతిక వాదంలో భాగమే.

ఇంచుమించు ఇదే కాలంలో వాస్తవిక, ప్రాకృతిక వాదాల్లో ప్రమేయం లేకుండా విభిన్న సాహిత్యోద్యమాలు పుట్టి పెద్దవవటం ప్రారంభించాయి. అమెరికాలో ఎడ్గర్ అలెన్‌పో (1809-1849)తో చాలావరకు కృత్రిమమై అంతర్గతంగా వికృతత్వం పెంపొందిన క్షీణవాదం మొదలైంది. ఆ పదం ఆనాడు ఉద్భవించిన అనేక ఉప ఉద్యమాలకు సంబంధించి ఒక సామాన్య లక్షణాన్ని సూచించే పదం. ప్రేమ, మృత్యువు సంతోషం, బాధల కలగలపైన ఇతివృత్తాలు, శవాలు, దెయ్యాలు చిత్రహింసవంటి ఆలోచనల్లో తలమునకలు గావటం, ప్రాపంచిక సుఖాలమీద అనాసక్తతతో నాయకుడు, నిరాశానిస్పృహల్ని ప్రదర్శించడం ఈ పరిణామంలోనే భాగాలు. ఈ లక్షణాలన్నీ చార్లెస్ బోదలేర్ (1821-1867) అనే ఫ్రెంచి కవి రచనల్లో ఆగస్టు స్ట్రిండ్‌బర్గ్ (1849-1912) అనే స్వీడిష్ నాటక రచయిత నవలలూ, నాటకాల్లో కన్పిస్తాయి.

ఈ క్షీణవాద ధోరణుల్లో భాగంగానే పందొమ్మిదవ శతాబ్దంలో సింబలిజమ్ అనే ఉద్యమం వచ్చింది. బూర్జువా పెట్టుబడిదారీ భౌతికవాదాన్నుండి ఎదిగివచ్చిన వాస్తవిక వాదాన్ని నిరాకరిస్తూ సింబలిజమ్ ఒక ఉద్యమంగా ఎదిగింది, కథాకథన పద్ధతిని, వ్యాఖ్యానాన్ని, నైతికతను కవిత్వం నుండి పారద్రోలి ప్రతి కవితను ఒక్కొక్క రూపచిత్రం (image) లేక ఇంద్రియ సంచలనం (sensation) చుట్టూ పేరుస్తూ కొత్తగా మనస్తత్వ శాస్త్రం కనిపెట్టిన మానవ మస్తిష్కపు అంతర్గత చైతన్యపు సాంగత్యాల్ని, పాఠకుణ్ణి ఒక స్పర్శణీయమైన(the concrete)విషయాన్ని ఆధారం జేసుకుని స్పృహకందని (intangible) విషయాల నవగతం చేసుకునే మార్గంలో ఉపయోగించుకునే పద్ధతిని సింబలిష్టులు చేపట్టారు. దేకార్టు వంటి ఫ్రెంచి యాంత్రిక భౌతికవాదులు గుర్తించిన ఖగోళాల మధ్య పరస్పర ఆకర్షణ శక్తి, పదార్థ చైతన్యాల మధ్య అధి భౌతిక వైరుధ్యాలు ఒకవైపు, అజ్ఞేయవాదులు, (agnostics) అంగీకరించిన అలౌకికత ఇంకోవైపు, సంపూర్ణంగా సరుకుల మాయలోపడి గతితార్కిక లక్షణాన్ని కోల్పోయిన అస్తిత్వవాదం మరోవైపుకలిసి కవిత్వాన్ని, కవితా ప్రతీకల్ని, పురాణగాధల్ని (myths) పదాల్ని, భావాల్ని, సందర్భ సూచనల్ని (allusions), స్థలకాలాల్ని అంటే చరిత్రను అన్నిటిని సాను

రూపత (Parallellism) సామాన్య లక్షణంగా కల సరుకుల్ని చేసివేశాయి. ఈ సంపూర్ణ సరుకుల ప్రపంచంలో మనిషి, కల, సంగీతం, కవిత్వం సాను రూపాలు. మనిషికి బాహిర అంతర్గత రూపాలున్నట్లే వాటిని బహిర్గతపరచే కల సంగీతాల మాదిరిగానే కవిత్వమూ చైతన్య రూపంలో ఉన్న ఒక సరుకు అవుతుంది. ఫ్రాన్సులో 1880 ప్రాంతాల్లో రూపు దిద్దుకొనడం మొదలెట్టి 1890 లో ఉన్నత దశకు చేరుకున్న సింబలిస్టు ఉద్యమంలో ముఖ్యులు; స్టెఫాన్ మల్లార్మే (1842-1898), పాల్ వర్లే (1 44-1896). ఇంగ్లీషు కవిత్వంలో ఈ ఉద్యమం, ప్రభావంలో కవిత్వం నవలలు రాసిన వాళ్ళల్లో డబ్ల్యు. బి. యేట్సు (1865-1939), టి. యస్. ఇలియట్ (1888-1965), జేమ్స్ జాయిస్ (1882-1941)లు ముఖ్యులు.

సింబలిస్టు ధోరణిలో ద్యోతకమైన సరుకుల అస్తిత్వవాదం క్రమేణా నవలా కారుల్ని మొదటి ప్రపంచ యుద్ధం తరువాత స్థూలంగా ఇంప్రెషనిజమ్, చైతన్య స్రవంతి, అంతర్గత ఏకపక్ష సంవాదం (internal monologue) ధోరణులవైపు మరల్చింది. యాంత్రికముగాని కనుగుణంగా ఎక్స్‌ప్రెషనిజమ్ అనే ధోరణికూడా ముఖ్యంగా నాటక రంగంలో వచ్చింది.

సింబలిస్టు ధోరణి ఆధునిక విమర్శకు, వచన కవితా రూపానికి ప్రాణం పోసింది. ఆర్చిబాల్డ్ మక్‌లీష్ అభిప్రాయం : "A poem should not mean but be"కవిత్వానికి అప్పటివరకు వచ్చిన సంపూర్ణ సరుకు గౌరవాన్ని సూచిస్తుంది. మార్కెటులో ఒక సరుకు చలించే వేగం దాని ఉనికిని, బూర్జువా సమాజంలో దానికి లభించే ఔన్నత్యాన్ని తెలియజేస్తుంది నిన్న మొన్నటి వరకు బజాజ్ చేతక్ అనే వాహనానికి, 1940 నుండి 1960 వరకు పాశ్చాత్య సాహిత్య విమర్శలో న్యూక్రిటిసిజానికి లభించిన ఆదరం దీనికి తార్కాణం. "రేజర్ బ్లేడ్ అడ్వర్టయిజ్ మెంట్‌లో "మగతనాన్ని" చూసుకుని సంబర" పడే మానసికోద్రేకం కూడా సరుకుల అస్తిత్వ వాదానికి, బూర్జువా సౌందర్య దృష్టికి సంబంధించిందే. మార్కెటులో ఆ సరుకు చలించే వేగం కవిత్వరూపరీత్యా ప్రతిఫలించినప్పుడే అది వచన కవితా రూపమవుతుంది. మార్కెటు సంబంధాలు, అంతగా అభివృద్ధి చెందని నాగరి

కతలో వచన కవిత్వానికి కవిత్వానికి ప్రాణమయిన లయ సహజ సిద్ధంగా కాక కవి వ్యక్తిగత సామర్థ్యంపై ఆధారపడి కృత్రిమంగా తయారయ్యే ప్రమాదం పొంచి ఉంటుంది.

అయితే పశ్చిమాన బూర్జువా కవిత్వం పరిధులు సింబలిస్టు వచన కవిత దగ్గర ఆగిపోలేదు. ప్రాకృతికవాదం, సింబలిస్టు ఉద్యమాలు చూపించిన దారిలో ముందుకే పోయింది. అంతిమంగా (ultimately) సరుకులమాయ, పరాయీకరణలో అభావం చెందిన శ్రమశక్తి విరాట్స్వరూపం నిరంతర చైతన్యశీలమైన గతితార్కిక భౌతిక, సామాజిక సంబంధాల్ని, అది యాదృచ్ఛికాలు (chances)గా మార్చివేస్తుంది. పదిలక్షల భూటాన్ లాటరీ పది రూపాయల లాటరీ టికెట్టు కొన్న రిక్షావాడికి వచ్చే విషయం ఎంత యాదృచ్ఛికమో ఆ పదిలక్షలు, అసలు అన్ని లాటరీ ఫలితాలు సరుకుల మాయలో పడి ఎక్కువ టికెట్లకు డబ్బు మదుపు పెట్టిన డబ్బు సంచీలకో లేక ఆ మాయను తిరుపతి హుండీ నిండా నింపి అసలు వానికి మాయను, స్వంతానికి సరుకుల్ని చేరవేసుకోగల పాలక వర్గ ధారమికులకో చెందటం అంతే యాదృచ్ఛికం. ఉదార భౌతికవాద కార్మిక సత్యాలకు బద్ధ విరోధియైన ఈ పరిణామమే సాహిత్యంలో సర్రియలిజాన్ని (అధివాస్తవికత) ప్రతిపాదింపజేసింది.

మొదటి ప్రపంచయుద్ధం తరువాత ఏర్పడ్డ సంచలనాత్మక పరిస్థితుల్లో కొంతమంది ఫ్రెంచి యువకవులు గ్విల్లామ్ ఎపోలినేర్ అనే ఫ్రెంచి రచయిత 1917 లో మొట్టమొదటిసారిగా వాడిన ఈ పదాన్ని వాళ్ళు కనుగొన్న కొత్త శైలిని, కొత్త భాషను వర్ణించడానికి వాడుకున్నారు. కల, సంగీతం, ఫ్రాయిడ్ యుంగ్ వంటి మనస్తత్వ శాస్త్రవేత్తలు ప్రతిపాదించిన ఈడిపస్, ఎలెక్ట్రా కాంప్లెక్సులు, సామూహిక అచేతన (collective unconscious)లతో సహా సింబలిస్టు కవిత్వంలో వలెనే సరుకుల అస్తిత్వవాదాన్ని వాడుకున్నా అన్ని రకాల తార్కాణాలకు లేక తార్కిక సత్యాలకు వ్యతిరేకంగా పోరాడే శాశ్వత హేత్వాభావకత (eternalisationalism) వల్ల బూర్జువా కవిత్వంలో వచన కవిత్వంలో చోటు చేసుకునే నిశ్చల ప్రత్యయాలన్నిట్నీ సర్రియలిజమ్ నాశనం చేయ పూనుకుంటుంది. ఈ లక్షణం వల్ల అది ఆచారబద్ధమైన వాక్య నిర్మాణాన్ని, వ్యాకరణాన్ని, పదాల్ని, ఛందస్సును, కవిత్వభాషను, ప్రతీకల్ని అంటే ఛాందసం (pedanticism) అంటుసొంటు ఉన్న అన్ని ప్రత్యయాల్ని విచ్ఛేదించడానికి ప్రయత్నిస్తుంది.

మానవుని మనుగడలో గుప్తంగా నిక్షిప్తమై యున్న కార్యకారణక్రమాన్ని (Process) వెలికి తీయడమే ఉద్దేశంగా కల అధి వాస్తవిక కవుల ధోరణి ప్రధానంగా విచ్ఛిన్నకరమైనప్పటికీ దాని అంతిమ ప్రయోజనం మాత్రం మానవ జీవితంలోని సత్యాసత్యాల్ని నిర్ధారించడమే. ఒక ప్రాపంచిక దృష్టిగా దాన్ని చూస్తే అన్ని నిశ్చల సత్యాల్ని బద్దలుకొట్టే అధి వాస్తవికుల కార్యక్రమానికి పరమైక పునాది సరుకుల మాయ. ఈ భావవాద ఏకైక సత్యాన్ని దాని కాళ్ళపై నిలబెడితే అది శ్రమ శక్తి విరాట్స్వరూపం అవుతుంది. ఈ నేపథ్యంలో అధివాస్తవికుల కార్యక్రమం పదార్థ చలన సూత్రం ప్రాతిపదికగా గల గతితార్కిక చారిత్రక భౌతికవాదానికి విలోమ రూపం కావడం యాదృచ్ఛికమేమీకాదు. థియడోర్ అడార్నో అన్నట్లు : "అధి వాస్తవిక వాదపు గతితార్కిక చిత్రాలు వాస్తవికంగా స్వేచ్ఛారహితమైన పరిస్థితిలో ఉన్న ఆత్మాశ్రయ స్వేచ్ఛ అనే తర్కానికి సంబంధించినవే" theodor W. Adorno, "Looking back on Surrealism", Literary Modernism ed. Irwing Howe, Fawcett Publications. Inc, New York 1967. P. 221) ఈ "ఆత్మాశ్రయ స్వేచ్ఛ" (Subjective freedom) అధి వాస్తవికుల విషయంలో ఎప్పటికి యాదృచ్ఛికత (chance)కి సంబంధించిందే. అంటే అదృష్టవశాత్తు, ప్రస్తుత క్షణంలో వైయక్తికంగా ప్రపంచాన్ని అర్థం చేసుకొనే క్రమంలో భాగంగా అంటే కవిత్వం రాసేటప్పుడు అధి వాస్తవిక ప్రతీక లేక భావం కవి మనస్సుకు తట్టి కవితలో వాడేటప్పుడో, ఆ ప్రతీకను పాఠకుడు అర్థం చేసుకున్నప్పుడో వాళ్ళిద్దరికీ వేరువేరుగా స్వేచ్ఛ అనే ఉద్రేకం కలుగుతుంది. అది క్షణికమైన రసానందం (aesthetic pleasure), ఆత్మాశ్రయమైన అనుభవం మాత్రమే. కాని ప్రపంచాన్ని అర్థం చేసుకునే క్రమం గతితార్కికమైతే, అంటే ప్రకృతి సమాజంతో తనకు గల సంబంధాన్ని బతుకు అనే పోరాటంలో భాగంగా అర్థం చేసుకుంటే అప్పుడు కలిగే స్వేచ్ఛ క్షణికానుభవం రూపంలో కాకుండా వాస్తవికమైన జ్ఞానం రూపంలో చైతన్యం రూపంలో కల్గుతుంది. ఈ రకమైన చైతన్యం ప్రధానంగా సామాజికమైంది. శ్రమశక్తికి పర్యాయపదమైన కవిత్వాన్ని సృష్టించే కవిలో అది శ్రామిక వర్గచైతన్యం అవుతుంది. ఈ రకమయిన సామాజిక స్పృహతో అధివాస్తవిక ధోరణి ననుసరించి వచన కవిత్వం రాసినా అది గతితార్కిక భౌతిక వాద కవిత్వమే అంటే నిజమైన కవిత్వమే ఔతుంది.

కవిత్వానికి ప్రాణప్రదమయిన లయను గతితార్కికంగా సాధించడమంటేనే వస్తువులో రూపంలో సామాజిక చైతన్యాన్ని ప్రదర్శించడం నిజమైన సామాజిక

చైతన్యం ఆచరణ శీలంగా ఉంటుంది. ఆచరణ శీలమైన సామాజిక చైతన్యం ఆ పరాయీకరణ ఫలితంగా వ్యక్తిగత అస్తికి అనుబంధంగా ఉద్భవించే అధి భౌతిక, ఆధ్యాత్మిక భావజాలానికి వ్యతిరేకంగా పోరాటం చేస్తుంది. పాలక వర్గాల కుట్రకు వ్యతిరేకంగా శ్రామిక జన వర్గ చైతన్యంతో ఉద్యమిస్తుంది. ఈ శ్రామిక జన వర్గ చైతన్యమే కవిత్వానికి నిజంగా ఊపిరి పోస్తుంది.

ఈ దృష్టితో కవిత్వాన్ని చూసినప్పుడు సులభంగా అర్థమయ్యే విషయం ఏమిటంటే శ్రామిక వర్గ చైతన్యంతో మమైకం కాని వచన కవిత్వ రూపం పాలక వర్గాలకు, ఊడిగం చేసే స్థాయికి దిగజారి పోయే ప్రమాదం ఎప్పుడూ పొంచి ఉంటుంది. బాలగోపాల్ "కవిత్వం - గతితార్కికత" (సృజన ప్రచురణలు, హైద్రాబాద్, 1991)కు రాసిన "ముందు మాటలో అన్నట్లు బూర్జువా కవిత్వ సంప్రదాయకమైన ఆధునిక వచన కవిత్వం భగవంతుడి వంటి పరాయీకృత రూపాల జోలికి పోకున్నా

> ప్రత్యక్షంగానో పరోక్షంగానో అస్తిత్వవాదం దాని తాత్విక పునాది. నిజానికి విప్లవ కవిత్వంగా పిలవబడే దానిలో చాలా భాగం కూడా ఈ కోవకు చెందినదే. అది సందిగ్ధాన్ని వ్యక్తీకరించినంత సహజంగా పరిష్కారాన్ని చెప్పదు. చెప్పజాలదు. ఎందుకంటే వచన కవిత్వాన్ని స్వంతం చేసుకున్న పెటీ బూర్జువా వర్గానికి విప్లవం పరిష్కారం దొరకని అస్తిత్వ సందిగ్ధమే (Existential Predicament) తప్ప సందిగ్ధాలకు పరిష్కారం కాదు. (పేజీ : VII).

ఈ "అస్తిత్వ సందిగ్ధాన్ని" అభావం చేయగలిగేది శ్రామికవర్గ చైతన్యం మాత్రమే. శ్రామికవర్గ చైతన్యాన్ని అలవర్చు కోకుండా ఏ కవైనా ఏ భాషలోనైనా, ఏ కాలంలోనైనా, ఏ దేశంలోనైనా నిజమైన కవిత్వాన్ని రాయలేదు. ఈ విషయం ప్రపంచ సాహిత్యం, ముఖ్యంగా కవిత్వంపై రాసిన ఈ విమర్శనా పూర్వక సమీక్ష వల్ల స్పష్టంగా తెలుస్తుందనే అనుకుంటున్నాను.

* * *

ఈ నేపథ్యంలో 1980లలో వచ్చిన తెలుగు వచన కవిత్వాన్ని, ముఖ్యంగా కవిత్వం ప్రచురణల కింద వచ్చిన కవిత్వాన్ని పరిశీలించాల్సిన అవసరం ఉంది.

(మిగతా వచ్చే సంచికలో)

నాటిక :

విముక్తి

—జనకళామండలి.

(ఓ పెద్ద గ్రామం అది. తెల తెలవారుతుండగా ఊరంతా పనీ పాట్ల సందడిలో వుంటుంది. పేదరైతు కురమయ్య సాలలోని ఎడ్లు విప్పి కుడితిపెడతాడు, సర్దుతాడు. సాలలో పశువుల్ని కట్టడానికి తోల్తాడు. ఆ గ్రామ భూస్వామి ఎల్లం నాయుడూ, అతని కిరాయి మనుషులూ - కురమయ్య ఎడ్లనీ, బండినీ బాకీ కింద తోలుకు పోడానికి వస్తారు. ఎల్లం నాయుడ్ని బతిమాల్తాడు కురమయ్య. అయినా వినిపించుకోడు ఎల్లం నాయుడు బండీ, ఎడ్లు వొదులుకోలేక కురమయ్య - ఎల్లం నాయ్డు మనుషులు తోలుకుపోబోతున్న బండి, ఎడ్లకు అడ్డం వస్తాడు. ఎల్లం నాయ్డు మనుషులు కురమయ్యను కొట్టి - ఆ వీధి మధ్యలో వున్న రచ్చబండకు కట్టేసి: "నిన్నెవడిప్పుతాడో చూస్తాం" అని వెలిపోతారు. ఇదీ నేవథ్యం !

నాటిక యిప్పుడు ప్రారంభమవుతుంది.)

కురమయ్య : ఓర్నాయినో - యేటీగోరం ? ఓలమ్మో యేటీ అన్నేయం ? ఔవ్రా.... ఊరోల్లో ! సూడ్రా, సూడ్రా - యీ దుష్టమార్గం (అని గట్టిగా కేక లేసాడు. యీ కేకలకు గ్రామస్తులు, ప్రేక్షకులు చేరుతారు. వచ్చిన వాళ్ళు అందరూ చూస్తుంటారు. కురమయ్య వార్ని ఆశగా చూస్తాడు - ఎవరైనా వచ్చి, తనకట్లు విప్పుతారని ! ఆశ నిరాశ అయ్యింది. ఎవరూ రారు !)

రాండ్రా....! యీ కట్లిప్పండ్రా అలాగ నాటకం సూత్తనట్టు సూత్తారేటి ? ఒకరూ యిప్పారేటి ? ఆ ఎల్లంనాయుడికి ఐదొందలు బాకీ వున్నాననీ, నా బాడెడ్లు తోలుకుపోనాడు. అవి తోలకుపోకు బాపూ, అవి నా కాలూ, సేతులూ అని అడ్డుకుంటే; తన్ని తోసేసి, యిదిగో సెట్టుకి కట్టేసినాడు. యిది దరమేనా ? మోతుబరోడని, అతగా నేటి సేసినా సెల్లిపోడమేనా ? సెప్పండ్రా ? బాకీ వుంతే....తీరిపించుకోవాల గానీ; యిలా పంటి దురుమారగం సేసీడిసేనా ? సెప్పండ్రా ? కుటమాం బలగం నేదని, కూల్నాలోడ్నని....ఎల్లం నాయుడు మోజూరుతనం సూపినాడు. యిది దరమ్మా ? సెప్పండ్రా ?

(ఒక్కలూ బదులివ్వరు. ఎవ్వరూ కట్లిప్పరు.)

కాదేటీ గోరం ? ఒకలూ పలకరు. ఎవులూ కదల్రు. కాదీ పొద్దు నాక యిత్తంది. పల్లకుంతన్నారు. రేపు మీ కవదా ? మీరలాగ సూడ్డం మీకు దరమ్మా ! రాల్రా.... యీ కట్లిప్పల్రా ! యేటీ గోరం ? ఒకలూ రారు ! యిది ఊరా ? అడివల్రా....? (అక్రోసంగా అరుస్తాడు.)

(అప్పుడు వెనకనించి పాట వస్తుంది. దాంతో బాటూ, కాంగ్రెస్ ప్రతినిధి వస్తాడు.)

పాట : కాంగ్రేసు పార్టీవాడు
బలే కంత్రిగాడు వీడు
రాంపోతు జాతివాడు
రాజీవు తోకగాడు ॥కా॥ (పాట ఆగుతుంది.)

కాంగ్రే : బొనల్రా.... శంకర్రావూ, సోమేశూ.... అందరినీ బయాల్దేర దీస్తున్నారా ? యేరీ యిద్దరూ....ఎక్కడ చచ్చారు? అవతల లారీలొచ్చి అగిపోయాయి. యీ, యిద్దరే సారా కొట్లో తుంగొన్నారో ? సరే, నేనే పిలుస్తాను గ్రామస్తుల్ని. (అని మైకు ముందుకొచ్చి) ఆఁ! అయ్యా! మా ఓటర్లారా!

జనంలోంచి : యేటి ఓట్లు మల్లీ వొచ్చాయేటి ?

కాం : ఆఁ ! ఆఁ ! అదే, మహాజనులారా ! మీ ఊరి జనాలు మీటింగుకి రావాలని - మీ కోసం రెండు లారీలు తెచ్చాను. అ లారీల్లో, ఆయిగా ఎక్కి పట్నం చూసిరావొచ్చు....

కుర : బావ్, బావ్, బావో

కాం : (కురమయ్య వైపు చూడకుండా 'అగవయ్యా' అన్నట్లుగా చేయితో సైగ చేసి) చాలా ముఖ్యమైన మీటింగ్. మీకు తెలుసుగదా ? ఇపుడు మన దేశాన్ని ఎవులు యేల్తన్నారు ?

జనంలోంచి : దొంగలు !

కాంగ్రే : పనికిరాని ప్రతిపక్షం ముఠావాళ్లు - వాళ్ళ పరిపాలనలో ప్రజలు బాధలు పడుతున్నారు. దేశం అధోగతి పాలవుతోంది.

కుర : బావ్, బావ్

కాంగ్రే : దేశ ప్రజల క్షేమం కోసం, పరిపాలన మా కాంగ్రేస్ చేతికి రావాలి.

జనం : ఔను అలగైతే ప్రజల చేతికి చిప్పవస్తుంది.

కుర : బావ్....బావో ! (అరుస్తాడు.)

కాంగ్రే : యేఁవిటయ్యా నీ గోల ? ఆఁ ? (విసుగ్గా)

కుర : కళ్ళెదురగ మనిసిని.... సెట్టుక్కట్టేసుంతే కనబడ్లేదా ?

కాంగ్రే : ఉండదయ్యా. నీ బాధ నీది, నా బాధ నాది. అవతల మీటింగ్‌కి జనాన్ని తోలుకెల్లాలి. ద్రోణంరాజు, సుబ్బిరామిరెడ్డి - జెనార్దనరెడ్డిగోరు వొత్తంద్రు. జనాన్ని తోలుకెల్లాల !

కుర : బావ్....మీటింగ్‌కి నీనూ వొత్తాను బావ్.

కాంగ్రే : అలాగేస్లే. రావయ్యా. అందర్నీ పిలవడంకే గదా వచ్చాను. (మల్లీ మైకు ముందుకొచ్చి) అంచేత యేఁవిటంటే, మన నాయకులంతా వొస్తన్రు. అలంతా మీకు అన్ని విషయాలు బోదపరుస్తారు.

జనం : మీటింగ్ కొత్తే మాకేటిత్తారు?

కాంగ్రే : లారీల మీద ఫ్రీగా తీసికెల్తాం, తిరగ తీసుకొస్తాం. మనిసికి పదేసి రూపాయిలిస్తాం.

జనం : సారా పేకెట్లో....?

కాంగ్రే : అది లేకుండా మీటింగేటబ్రా! మీకా అనుమానమక్కర్లే....బయల్దేరండి, బయల్దేరండి.

కుర : బావో, బావో....

కాంగ్రే : అబ్బా - యేటయ్యా అలగరుస్తావ్?

కుర : నీనూ వొత్తాను బావ్ మీటింగ్‌కి.

కాంగ్రే : రమ్మన్నాను గదా!

కుర : యీ కట్లిప్పే బావ్....నీనూ వొత్తాను

కాంగ్రే : కట్లా? యేం కట్లయ్యా? యెందుకలక్కట్టుకున్నావ్?

కుర : నీను కట్టుకున్నాను? మా ఊరి ఎల్లంనాయుడు కట్టేసినాడు బావ్?

కాంగ్రే : ఎల్లంనాయుడా? యే పార్టీ వాడు?

కుర : యే పార్టీ వోడా? యెవులు సెప్పగల్రు. మొన్నటి మండల మెలక్సనుకి తెలుగుదేశం, ఆ తరాత ఎమ్మెల్యే ఎలక్సన్‌కి కాంగ్రేసు. రేపు ఎందలుం తాదో ఎవులు సెప్పగల్రు.

కాంగ్రే : పార్టీలు మార్చే ఊసరవెల్లి అన్నమాట.

కుర : పేర్చుకున్నోలుంతే....మార్చడం కతగానికేటడ్డు బావ్?

కాంగ్రే : ఆఁ. అయితే ఎందుకొట్టాడయ్యా నీకు?

కుర : మెడవోత్ర మెక్కు-ంయిపోయి కట్టాడు. అడిగినోడెవుడ్లేడని....!

కాంగ్రే : ఉత్తిపున్నేనికే కరతాడయ్యా ఎవడేం?

కుర : లేదు బావ్. పుత్తి పున్నేనిగ్గాదు. నీసతగాని కాడ....అయిదొందలు అప్పు దీసుకొని పాపం జేసాను అయిదు పంటల కిందట.

కాంగ్రే : ఆఁహాఁ!

కుర : యేటా పాయిదాలు కొలుసుకోనొత్తన్నాను. విరుడు వొర్నాల్లేక కరువెట్టే సింది కొదా. పాయిదా కొశ్నేపోన్ను. యీ యేడు పంటలకి తీర్సెత్తాన్నే బావ్ అన్నాను.

కాంగ్రే : అంతేనా; రుణాల మాఫీ గట్రా అడిగావా?

కుర : నేదు బావ్. ఈ పంట కొగమన్నాను. అఁ అఁ! అగను గాక అగనవి-నా బండెడ్లు తోలుకుపోనాడు. నన్నిక్కడ కట్టేసినాడు. మా ఊరోలందరి కతగాని కొడ బయ్యం. ఎవ్వులివ్వలేదు. మా యాతమనిసి ఆసపత్రి లున్నాది, దానికి బాగునేదు. ఈ కట్లుకాడ నాను సత్తన్ను. బాబ్బాబూ.... నువ్వేనా కట్లిప్పిలి పున్నెం గట్టుకోవా?

కాంగ్రే : (కట్లను తడిమిచూసి, మైకు దగ్గరకొచ్చి) ఈ కట్లిప్పడం ఒక లెక్కా? భరతమాత కట్లే యిప్పిన కాంగ్రేస్ పార్టీ మాది. జవహర్‌లాల్ నెహ్రూ తెల్సా?

కుర : తెల్దుబావ్....

కాంగ్రే : అలాంటి నాయకులెందకు తెలుస్తారు. సిన్మా యీరోలయితే గళాల్ని గుద్దెత్తారు ఓట్లు. ఇంతకీ మొన్న ఎలక్సన్ల ఎవులికోటేసినావురా?

కుర : మీ పార్టీకేని బావ్....!

కాంగ్రే : మా పార్టీకే? నిజం చెప్పారే!

కుర : నిజమేని బావ్....? ఎమ్మెల్యేగోరు ఆ పొద్దు మా పోలింగుకాడే వున్నారు

కాంగ్రే : మరి ఎంపీ ఎందుగ్గెల్లేదు? తెలుగుదేశపో డెలగ్గెలిస్పాడు? నీలాటోలుండ బట్టే; కేంద్రంల మా గవర్నమెంటు రాలేదు. అందుకనే, మీకీ కట్లూ, కష్టాలూ! మీరు చేసుకున్నదే అనుభవించండి.

కుర : ఔను బాప్, యిప్పుడంతే యీ ఆరేడేళ్ళు కాంచి తెలుగుదేసెం, సైకిలు గురుతు కోచేత్తన్నాం గానీ; తొలేత ఓటులొచ్చినపుడుకాంచి, అదేబడీ జోడెద్దులన్నారు, దానిగ్గుద్దేం. అ తరాత ఆవూదూడన్నారు, దానిగ్గుద్దేం. కాదు, కాదూ హస్తం అన్నారు. దానిగ్గుద్దేం. ముప్పయ్యో నలబయి యేల కాంచి మీరు సెప్పిన గురుతుకే గుద్దుతున్నాం. యేటి బావు పడిపోనాం బావ్? యిడిగీ సిరిగిన బాడీ. అయిదుమూల గోసి తోటి మిగిల్నాం!

కాంగ్రే : అఁహా! అయితలగా కట్లుకాడ మిగిలిపోరా! (అనివెళ్ళబోతాడు)

కుర : అదేటి బావ్ అలగంతారు?

కాంగ్రే : మరేటి? మాకు ఓట్లేసి సెడిపోనామంతన్నావు గదా?

కుర : అదికాదు బావ్. మీకు ఓటెయ్యనందుకే సెడిపోనామంతే: కాదు బావో అంతకుముందే సెడిపోనామూ అంతన్ను.

కాంగ్రే : పోనిపుడు ఓటేసి, గెలిపించిన....నాయికుడికిప్పమన్రా?

కుర : మీ పార్టీకే యేసాను గవా, మీరిప్పివొచ్చు గాదా?

కాంగ్రే : మాకే వోటేస్తే-కేంద్రం లెందుకధికారం పోద్దిమాకు. కేంద్రంలో అధి కారం రానీ.... చూద్దాం! (అనిపోతాడు)

కుర : బావో, బావో, (అని పిలుస్తాడు. కాంగ్రెస్ నాయకుడు గసిరేసి, వెలిపోతాడు. వాడి మీద కసితో) ఈడెమ్మా....! కాంగ్రెస్ నాకొడుకు ఈ నప్పి కొడుక్కి- కేంద్రంల అధికారం కావాలట! రాంరారా! యీపాలి ఓట్లుకి రావా ? ఈ నప్పి కొడుక్కి నచ్చినా ఓటెయ్యను. (జనంలోకి చూసి) ఔన్రా దద్దా నర్సింలో రారా. నువ్వేనా రారా! ఇరుగూ, పొరుగోలం. ఆ మాత్రం కనికరం లేదా. ఓరే, ఓరే పాపయ్యా.... రారా, నువ్వేనా యిప్పురా! యిలాగ కట్లుకాడ సచ్చిపోవడమేనా ? మా యాడదాయి ఆ ఆసుపత్రిల సత్తంది. రాంరా....యిప్పరా!

పాట : వొచ్చేరా బాబొవొచ్చేరా
తెలుగూదేశం వొచ్చేరా
దేశానికి తెగులూ తెచ్చేరా॥ వొచ్చేరా॥

తెలుగు : (వస్తూనే కురుమయ్యను చూసి) (ఎన్టీఆర్ ఫోజులో) అహో! తెలుగు

రైతన్నకు బంధనాలా ? యేమీ యీ దౌర్భాగ్య, దీన, హీన దృశ్యమూ! (అని కౌగిలించుకుంటూ) యిది కాంగ్రెస్ కుట్ర

కుర : (అర్థంగాక, అయోమయంగా) యేటిబావ్....దోరబంధాలా ?

తెలుగు : దుక్కిదున్ని, మొక్కనాటి, చెమటచల్లి చేలు పండించి- ఆరుకోట్లు కాదు, కాదు డెబ్బయికోట్ల ప్రజలకు తిండిపెట్టే....రైతన్న....దేశం యిలా గౌరవిస్తోంది. అహో రైతన్నా! నీ ఋణం తీర్చలేదు యీ దేశం!

కుర : ఔను బావ్. నీను ఋణం తీర్చలేదనే....యిలక్కట్టేసినాదతగాను.

తెలుగు : నువ్వుగాదు రైతన్నా ఋణపడింది దేశం నీకు ఋణపడింది.

కుర : అదేటంతన్నావో బోదపడనేదు బావ్. ఈ కట్లిప్పు బావ్.

తెలుగు : చూసావా! అన్నగారి పాలన పోడంతో - రైతన్నకు కట్లు వొచ్చాయి. కష్టాలొచ్చాయి. మీలాంటి వాళ్ళంతా ఓటెయ్యక పోవటంవల్ల - చూశావా మీకు ఎలాంటి కష్టాలొచ్చేయో ?

కుర : మీ పార్టీకే వోటేసినాను బావ్.

తెలుగు : మా పార్టీకే వేస్తే - మరి మా అధికారం ఎలా పోయిందోయ్ ?

కుర : అయితే - నా ఒక్కడి వోటువల్లే - పోనాదే మీ గవర్మెంట్ ?

తెలుగు : నీలాగే అందరూ మానేశారు.

కుర : నిబ్బగా మీకే ఓటేసాను బావ్ ?

తెలుగు : నిజంగా మాకే వేస్తే రాష్ట్రంలో అన్నగారి అధికారం వుండాలిగదా ?

కుర : నమ్మకపోతే నేనేటి జేసేది. మీకే యేసానుబావో అంతే - ఆ కాంగ్రెసోలా నమ్మరు. కేంద్రంల ఎందుకు పోనాదం డుగుతారు. కాదూ, మీకేసినానుబావో అంతే - మీ తెలుగుదేశపోలు నమ్మరు - రాష్ట్రంల అధికారం ఎందుకు పోనాదంతారు ? ఎలగ సచ్చేది.

తెలుగు : రాష్ట్రంలో అన్నగారి పాలన రాకపోతే - నిజంగా మీరు చచ్చిపోతారు.

కుర : ఎవులికి అధికారమొచ్చినా- మానాటోలిమేటి బతికి బావుపడిపోలేదు బావ్.

తెలుగు : అడిగో, ఆ తెలివితక్కువతనమే - మీకీ దరిద్రం తెచ్చింది. అన్నగారు.... కిలో బియ్యం రెండు రూపాయిల కిప్పించారు.

కుర : మా ఊరి డీలరు అట్నే - గొడాంను కాడే అమ్మీసోడు. ఎప్పుడో ఒకపాలి కారుడు కయిదుకేజీలిచ్చీవోడు.

తెలుగు : సగం ధరకే జనతా వస్త్రాలిప్పించేరు అన్నగారు.

కుర : అవి రేవుకేస్తే - సగం గుడ్డలే మిగిలివి బావ్....

తెలుగు : ఊరూరికీ....పక్కాయిళ్ళ కోలనీలు కట్టించారు....

కుర : మా ఊరి కోలని తమరు సూడ్నేదుగావాల! ఓపినింగునాడే - కూలిపోనాది.

తెలుగు : ఎన్ని చేసినా....మీరు బాగుపడరూ, చేసిన వాళ్ళని గౌరవించరు.

కుర : నిజిమేని బావ్. అన్నగారు పేసినారు. గానవన్నీ పచ్చసొక్కావోలు పంచుకున్నారు. మాకేటందలేదు బావ్.

తెలుగు : ఎప్పుడూ, ఎవులిమీదో యేడుపే మీ పేదలకలవాటు. చూడండి, పది నెలలకి యిద్దరు ముఖ్యమంత్రులు మారారిపుడు రాష్ట్రింల!

జనం : మరి ప్రధాన మంత్రులు మారలేదా ?

తెలుగు : అదే! యీ కాంగ్రేసువల్లే; కేంద్రంలో గూడా అస్థిరత్వమొచ్చింది. ఇప్పటికేనా మీరంతా కళ్ళు తెరవాలి. కుళ్ళు రాజకీయాల్ని, రాజకీయ వ్యాపారుల్ని నిలదీసి, వొచ్చే ఎన్నికల్లో ఓడించాలి.

కుర : అలగేని బావ్. ఈ కట్లిప్పీ బావ్.

తెలుగు : అసలీ కట్లేమిటయ్యా ? ఎవరు కట్టారు ? ఎందుకట్టారు ? ఈ దారుణం వెనక కారకులెవరూ ? దాని కతయేమీ ? చెప్పూ ?

కుర : కట్లిప్పీబావ్.... సెప్తాను. రొండు పూటలెకాంచి కట్లుకాడ సత్తన్నాను.

తెలుగు : ముందు విషయం చెప్పవయ్యా, వింటాను తరవాత విప్పొచ్చు.

కుర : అలకించడం కిదేటి కతా బావ్ ? మా ఊరి ఎల్లంనాయుడు బావ్ లేడూ ?

తెలుగు : ఎవరూ ఆ రైసుమిల్లు ఓనరు ఎల్లంనాయుడా ?

కుర : అవునతగానే....అతగానికాడ అయిదొందలు అప్పోడికున్నాను.

తెలుగు : ఎల్లనాయుడు మంచి మనిషి!

కుర : (ఆగిపోతాడు) మంచోడు, మంచోడే. కొసవాకాలకించండి తెలుత్తాది. అయిదు వంటల కిందట - మాయావిడి పురిటికి అనుపత్రికద్సుల కోడు కున్నాను. యేటా పాయిదాలు కొల్సుకొత్తన్నాను. నిరుడు కరువొచ్చింది కొల్నే పోన్సు.

తెలుగు : కరువొచ్చిందని పాయిదా కొలిదం మానేసావన్నమాట!

కుర : గొంజికేన గింజల్నేకపోతే- పాయిదాకెక్కడున్నండి తెత్తాను?

తెలుగు : అలాగంటే ఎలాగయ్యా? తప్పుగాదూ? ఎలాగో తెచ్చి, పాయిదా కొలాల గానీ!

కుర : పాతదాన్నెం పాతర్లేసున్నాయి, తెచ్చి కొల్పేడంకి?

తెలుగు : సర్లే, ఆ తర్వాత యేమయిందయ్యా?

కుర : యేటయ్యింది? నా బండీ, బక్కా నాక్కున్నాదు అడ్డినానని నన్ని సెట్టుకి కట్టేసినాడు. బాకీ వుంటే, బతికున్నన్నాళ్ళూ తీర్సేత్తాను గానీ కాదంతానా? యిలకట్టేడం దరమ్మేనా? సెప్పండి బావ్.

తెలుగు : అన్నగారి అధికారం పోయినపుడు నుంచీ; రైతన్నకు కష్టాలొచ్చాయి! బక్కచిక్కిన బడుగు రైతన్నా.... లే! లేచిరా! తెలుగుదేశం పిలుస్తోంది.

కుర : ఈ కట్లిప్పి బావ్. నువ్వెక్కడికి రమ్మంటే అక్కడికొత్తాను.

తెలుగు : రావటం కాదు రైతన్నా! చైతన్యవంతం కావాలి. డబ్బుసంచులకీ, సారా పేకెట్లకీ ఓట్లు అమ్ముకోగూడదు.

కుర : నాకసలు సారా అలవాటే నేదు బావ్. సంచులు మా పెద్దలే సర్దుకుంతారు.

తెలుగు : ఇకనించీ, పెద్దల ఆటలు సాగినివ్వొద్దు. ఈసారి ఎన్నికల్లో తెలుగుదేశంకి ఓటేసి అన్నగార్ని గెలిపించండి.

కుర : అలగేని బావ్. యీ కట్లిప్పి బావ్.

తెలుగు : ఉండనీ, యీ కట్లు వుండనీ! కాంగ్రేస్ పాలనలో కష్టజీవి రైతన్నకు ఎలాంటి బాధలొచ్చేయో- తెలియజేయాలంటే నువ్విలా వుండాలి.

కుర : యేటి బావ్....?

తెలుగు : ఔను. నిన్ని కట్లతో ఫోటోదీసి, పేపర్లలో వేసి, ప్రచారం చేస్తాం. కాంగ్రేస్ వల్ల జరిగిన నష్టాన్ని చూపి, మాకు ఓటెయ్యమంటాం.

కుర : యేటి బావ్? మీ పెచారంకి, నాకు కట్లుండాల! నాలుగు మంచి పన్లు చేసి, పేరు తెచ్చుకోండి, అంతేగానీ, పేదోడి బతుకుతోటి ఓట్లు జూదం ఆడకండి బావ్.

తెలుగు : నీకు భయమక్కర్లేదయ్యా! నీ కట్లు మేమే విప్పుతాం. ఈ కట్లు వెనుక కాంగ్రెస్ కుట్ర వుంది!

కుర : ఎవులి కుట్రా నేదు బావ్.... ఎల్లం నాయుడి మెడపొత్రమే తప్పు.

తెలుగు : నీకు తెలీదయ్యా. దీని విషయం మీద మిత్రపక్షాల వారితో సమావేశం యేర్పాటుజేసి చర్చిస్తాం.

కుర : అప్పుడిదాక, నీనిక్క పక్షిలాగ సవ్వాలా....?

తెలుగు : తక్షణమే వీపీ సింగ్‌నీ, జ్యోతిబస్‌నీ తెప్పిస్తాం గదా!

కుర : ఆలెవులు బావ్? మా ఎల్లం నాయుడి సుట్టాలా?

తెలుగు : కాదయ్యా నేషనల్ ఫ్రంట్ నాయకులు.

కుర : ఆలంతా ఎందుకు బావ్? మీపేత్తోటి యిలాగ యిప్పుత్తే యీడిపోయీ కట్లివి! యిప్పియండి బావ్.

తెలుగు : అదే నీ తెలివితక్కువ. రాజకీయ నాయకులం యే పనీ పార్టీ తీర్మానం లేకుండా సెయ్యకూడదు తెల్సా? నువ్వేం కంగారుపడకు.... అవసరమైతే భారత్ బంద్‌కు తీర్మానం చేయించైనా, నీ కట్లు యిప్పిస్తాను.

కుర : కడుపుకి రెండు పూటల కాంచి తిండిలేదు. అస్పత్రిల పెళ్ళం సత్తంది. కట్లు కాడ నాను సత్తున్నాను. కంగారొద్దా? నీయంత నింపాది మాకెలా గుంతాది బావ్?

తెలుగు : మరా తెలివున్నోడివి- కాంగ్రేసునెందుకు గెలిపించావ్? అందుకే అనుభవించు, తెలుస్తాది.

కుర : కట్లు గట్టినోడు కాంగిరేసోడేటి బావ్?

తెలుగు : లేపోతే, తెలుగుదేశం వాడా?

కుర : మొన్నటి ఎలక్సన్ల మీ పార్టీలే వున్నాడు, రేపే పార్టీలుంతాడో మరి.

తెలుగు : అంటే, మా తెలుగుదేశం వాళ్ళు....రైతులికి కట్లు గట్టి హింసిస్తున్నారంటావ్? అంతేనా? తెలుస్తోంది నువ్వు.... పక్కా కాంగ్రేస్ తొత్తువి.

కుర : ఎల్లం నాయుడు కట్టాడు బావూ, ఆడెనక పార్టీ కాదు బావూ అంతన్నాను.

తెలుగు : పోనిపుడు.... ఆడెనక పార్టీ దన్నొచ్చిందిరా! యేటి జేస్తావ్? కాదూ, యేటి జేస్తావ్? మీకక్కళ్ళు నెత్తికెక్కిపోయే, కాంగ్రెస్‌ని గెలిపించారు. మళ్ళీ మా అన్నగారు అధికారంలో కొచ్చిందాకా- మీకివి తప్పవు.

కుర : యిలగైతే అధికారం కాదు అంత్యకాలము తప్పదు తమకి, తమ అన్నగారికీ!

తెలుగు : హమ్మ! నా కొడకా! చావురా! (అని కొట్టి, కట్లు విగించి- వెలిపోతాడు.)

కుర : ఈ నా కొడుకు.... కాంగ్రేసోడికంటా కంత్రీగోడయిపోనాడు. అన్న గోరూ, అధికారమే అంతండు గానీ- యిచ్చిన అధికారం నిలుపుకుండా? ఇలగ రాలిపోయే.... కూలిపోన్ను. ఈ నష్టి కొడుకుల్ని నమ్మగూడదు.

ఔర్నా.... నాయినా నర్శింలో! రారా! నువ్వేనా రారా! అంతో, యింతో యీడిల తగుపెద్దవి. నువ్వూ అలగ సూసుకోనెలిపోతావా! రారా!

పాట : నేషనల్ల్ ఫ్రెంటూ
మన పీకకు
ఉరిసెంటూ ॥నేష॥

నే. ఫ్ర : హల్లో! ప్రజలారా! చూసారుగా.... దేశం పరిస్థితి ఎక్కడికక్కడ మాడి పోతోంది. దేశం అన్ని విధాలా వెనక్కుపోతోంది. పార్లమెంటులో కుట్రలు జరుగుతున్నాయి. అనేక కుంభకోణాలు పెరిగిపోతున్నాయి.

కుర : బావ్....బావ్....

నేష : ఓటరు జనులారా! ఢిల్లీ నుండి- మీ పల్లెదాకా కాంగ్రేస్ విషసర్పం కోరలు చాస్తోంది. మా ఫ్రంటులో చీలిక తెచ్చింది. తమ నౌకర్ని ప్రధానిని చేసింది. అతడ్ని దెబ్బగొట్టిందిపుడు.

కుర : బావ్....బావో!

నేష : అబ్బా! యేఁవిటయ్యా నీ కాకిగోల? కాస్సేపాగు. మా ప్రజలతో మమ్మల్ని మాట్లాడనీ!

కుర : నీనూ తమ మాట్లింతాను కానా?

నేష : వినవోయ్. ఎవరొద్దన్నారూ?

కుర : ఈ కట్లిప్పి బావ్. యింతాను.

నేష : కట్లేమిటీ? ఎందుకు వేసుకున్నావిలాగ ముడులు. దేవీలాల్ వేసిన ముడులు విప్పటం చాతకాక యిద్దరు ప్రధానులు దిగిపోయారు తెల్సా?

కుర : తెల్దు బావ్!

నేష : తెలీదు. అందుకనే, యావద్భారత దేశమూ తిరగాలని మేం నిర్ణయించు కున్నాం. సభలు పెట్టి ప్రజలకు విషయాలన్నీ విప్పి చెపుతాం. ఏ పార్టీ వారు.... దేశానికి ప్రజలకూ అపచారం చేస్తున్నారో తెలియజెప్తాం.

కుర : తమరే పార్టీవారు బావ్....?

నేష : మేము నేషనల్ ఫ్రంట్.

కుర : యేటి బావ్? నాళిదాల పెంటా?

నేష : నేషనల్ ఫ్రంటయ్యా? అంటే కాంగ్రెస్‌కి వ్యతిరేకంగా కొన్ని పార్టీల వాళ్ళం కలసి ఫ్రంటు కట్టినాం.

జనం : అందులోంచి పెంటు చింపేసి వొచ్చేసారు గదేటి? ఇంకేం ఫ్రంటు?

నేష : ఫ్రంట్ చీలలేదు. కాంగ్రెస్ వారి డబ్బుసంచులకు కొందరు అమ్ముడు పోయారు. అదిగాక, మాకు మద్దతిచ్చిన బిజెపీ వాళ్ళు- మతోన్మాదం రెచ్చగొట్టారు. తప్పు అన్నాం. మద్దతు లేదన్నారు. వెల్లిపోయారు.

కుర : ఎప్పుడికేనా, ఎవులికేనా పెజల మద్దతుండాల బావ్!

నేష : అందుకనే, మల్లీ ఎలక్షన్ పెట్టమంటున్నాం. ఎవరికి ప్రజల మద్దతుం టుందో తేలిపోతుంది. యేమంటావ్?

కుర : మాట, మాటకి ఎలక్సనేనా? ఏడాదేన కానేదు ఓట్లేసి. ఎలక్సనంతేటి పండుగేటి బావ్.... మీ నాయికులికి?

నేష : పండుగేంవిటయ్యా దండుగ? ఎలక్షనంటే.... ఎంత ఖర్చవుతుందను కున్నవ్.... లక్షలు, లక్షలు....!

కుర : అన్ని లచ్చలేసి కర్చు యేలసేస్తారు బావ్? దేశసేవకే....!

నేష : పెట్టుబడి లేకుండా.... యేమీ చేయలేమయ్యా.

కుర : యాపారంకి పెట్టుబడిగాని- దేశసేవకేల బావ్?

నేష : నీకవన్నీ తెలీవుగానీ. మళ్ళీ ఎలక్షనొస్తోంది. కిందటిసారి ఎవరికేసావో అనవసరంగానీ, యీసారి మాత్రం మా నేషనల్ ఫ్రంటు అభ్యర్థికే వేయాలి సుమా.

కుర : అలగేని బావ్. తప్పకుండా వేస్తాను. ఈ కట్లిప్పిద్దూ.

నేష : అసలింతకీ యీ కట్లు కధేమిటయ్యా?

కుర : కతా? ఆకరికి నా బాధ మీకు కతలాగుందన్న మాట.

నేష : యింతకీ ఎవరు కట్టారయ్యా?

కుర : భూములూ, మేడల్తోటి పులిసిపోయి, ఊరికి యముడ్నాటి ఎల్లం నాయ్డు కట్టినాడు.

నేష : ఎందుక్కొట్టేదు....?

కుర : అడిగినోడెవుడ్లేడనీ!

నేష : అదికాదయ్యా. నువ్వేమన్నా చేసావా?

కుర : అప్పు నేసాను బావ్!

నేష : అయితే, ఆ చేసిన అప్పు ఎగమెడ్డేసావన్నమాట.

కుర : ఎగమెడ్డిత్తే కట్టీవొచ్చన్ని మాట!

నేష : మరేం జేస్తారయ్యా?

కుర : కట్టిడంకీ, కొట్టిడంకి అతగాను గవినేరేటి? నోటు కోరుట్లేసుకోమనండి. కోరుటు తీరుమానం మీద సెల్లిత్తాను.

నేష : మోతుబరి నాయుడు గదా. అతనే కోర్టు అనుకున్నాడన్నమాట.

కుర : మరత్తప్పుకాదా?

నేష : ఇలాంటి మోతుబర్ల అక్రమాలు పోవాలంటే- మా పార్టీ అధికారంలోకి రావాలి.

కుర : ఈపాలి తప్పకుండా మీ పార్టీకే వోటేత్తాను బావ్.

నేష : నిజెంగా మా పార్టీ ముద్రకే గుద్దుతావా?

కుర : ఔను బావ్. యీ కట్లిప్పి బావ్.

నేష : మరి మా పార్టీ ముద్రమీదే గుద్దుతావు గదా.

కుర : గుద్దుతాను బావ్.

నేష : నిజంగా....?

కుర : నిజంగేని బావ్....

నేష : ఒట్టూ....!

కుర : ఈ కట్టు యిప్పుదూ, ఎలగుద్దుతానో సూపిత్తాను.

నేష : ఆఁ అంత పొగరా నీకు? అయితలగే చావు కట్లతో (అని వెళ్ళబోతాడు తెలుగుదేశం అభ్యర్థి ఎదురొస్తాడు.)

తెలుగు : హల్లో! మిత్రమా! బాగున్నారా.

నేష : ఆఁ ఆఁ! అన్నగారు క్షేమమా? ఔనూ, యితనేమిటి? యే పార్టీ?

తెలుగు : తెలివితక్కువోడా? తెలివెక్కువైనోడా? అర్థం కావటం లేదు. కాంగ్రేసునీ మనల్నీ కలిపి మోసం చేస్తున్నట్లుంది వీడు. (ఇద్దరి మాటలు వింటూ రైతు)

కుర : అదేటి బావో అలగంతారు? ఎద్దుతోక పట్టుకున్న నాలాటి రైతోడు మీకేటి మోసం సెయ్యగల్డు బావ్. మీకాళ్లా, మీకాళ్లా పట్టుకు మొక్కుతన్నాము- యీ కట్లిప్పేమని.

తెలుగు : మొక్కటం గాదయ్యా- ఓట్లు వెయ్యాల! అప్పుడుండాల జ్ఞానం!

(ఇంతలో కాంగ్రేస్ అభ్యర్థి వస్తాడు. ప్రతిపక్షనాయకుల్ని చూసి-)

కాంగి : కొత్త బిచ్చగాడు పొద్దెరగడట! ఎన్నికలింకా చాన్నాళ్లున్నాయయ్యా అపుడే వొచ్చేసారేటి ప్రచారంకి ప్రజల దగ్గరకు.

తెలుగు : మేమెపుడూ ప్రజలతోనే వుంటాము. మీలాగ అధిష్టానవర్గం యిళ్ళల్లో ఛాకిరీ చేయం.

కాంగి : ఔను మేము చాకిరి చేస్తాం. మీరు పాదపూజలు చేస్తారు.

నేష : దేశద్రోహులతోటి వాదనేమిటి మిత్రమా?

కాంగి : ఎవరు దేశద్రోహులు? మీరూ? యీ కంట్రీని మళ్లీ యీస్టిండియా కంపెనీకి అమ్మడానికి ఫ్రంటు కట్టిన ముఠావాళ్ల మీరు.

తెలుగు : పచ్చి ఖూనీకోర్లు మీరు. ఎందరో నాయకుల్ని చంపించారు.

కాంగి : మీరేం తక్కువా? పత్రికా విలేకర్లనీ చంపించేరు.

నేష : బోఫోర్సు కుంభకోణాల్లో మునిగి తేలిన నీచులు మీరు.

కుర : బావ్, బావ్ ...బావో!

కాంగి : మీరే ద్రోహులు

కుర : బావో, బావో

నేష : మీరు దొంగలు

కాంగి : మీరు దోపిడీదార్ల తొత్తులు

తెలుగు : మీరు నీచులు

(తెరలో కుక్కల అరుపుల్లా-ఒకర్నొకరు భౌ....భౌ అనే అరుపులు)

కుర : ఓరేయ్....నంజికొడకల్లారా!

(ముగ్గురు నాయకులూ....ఆఁ! అని నిశ్శబ్దమౌతారు)

కుర : మీరు ముగ్గురూ దొంగనాకొడుకులే. ఒకలికి అందకండా మరొకలు వొల్లిద్దుమని సూసే మాయగాలు!

నేష : ఆఁ! చూసేరా? వీడు మామూలు వాడు కాడు.

తెలుగు : మావోయిస్టు లాగున్నాడు.

కాంగీ : నక్సలైట్ నా కొడుకయ్యా! వీడికిలగ్గాదు. రండి, పోలీసులకు అప్పజెపుదాం.

నేష+తె.దే : ఔనౌను. నక్సలిజాన్ని మనం ఐక్యంగా అరికట్టాలి. పదండి, పదండి.
(ముగ్గురూ కల్సి వెలిపోతారు.)

కుర : అమ్మ! నా కొడుకులు! యిప్పుడదాక బేపుల్నాగ ఒకల్నొకలు కరుసుకున్నారు. ఎంతబేగి కల్సిపోనారు, నిజమాడీసరికి! ఈ నాకొడుకులందరూ ఒకటే నర్రా.... సూడండి.

మన పేద, సాదలమే ఒకటి కాకన్నాం. యీపొద్దు నాక్కొట్టేసినాడు, రేపు వుంకోడిక్కొట్టేత్తాడు. ఒకొక్కలిమీ అయిరిపోతామర్రా. అందికే రార్రా.... యీ కట్లిప్పర్రా! మనం మనం ఒకలకొకలం సాయింజేసుకోవాల.... రార్రా!

పాట : బిజెపి మీద

బిజెపి : జై శ్రీరాం! జేయ్ శ్రీరాం! రక్తం చిందించైనా-రామాలయం నిర్మిద్దాం. జై శ్రీరాం! దేవుడికే గుడిలేని దేశంకి పుట్టగతులుండవు. హిందూ దేశంలో హిందూ దేవుడి గుడిలో తురకోడున్నాడు. ఘోరం కాదా?

కుర : బావో.... బావో....

బిజెపి : హిందువులంతా కళ్లు తెరవాల! యీ దేశం హిందువులది. హిందూమతం ప్రపంచానికి జ్ఞానభిక్ష పెట్టింది. హిందూమతాన్ని రక్షించాలి!

కుర : బావో....! (గట్టిగా)

బిజెపి : అబ్బా! యేఁవిటా కేకలూ? నాకేం చెవుడనుకున్నావా?

కుర : కంటికెదురుగున్నోడ్ని కట్లుతోటి సత్తన్నాను. నన్ను రచ్చించరాదా? కనిపించని దాన్ని రచ్చించమని అడుగుతన్నావు.

బిజెపి : కనిపించడమేటయ్యా? దేవుడు నిరాకారుడు తెల్వా?

కుర : జీవుడుకి కడుపుంది, దేవుడికి లేదు. అంతేని బావ్? అయినా బావో.... కడుపు లేనోడికి గుడులేల? మడులేల? భోగాలేల?

బిజెపి : నువ్వేకాల.... ముస్లిం వాడివా? యేఁవిటి?

కుర : కాదుబావ్. రైతోడ్ని.

బిజెపి : మరా వాగుడేమిటి? దేవుడికిచ్చే ఫలపుష్పాలు, భోగభాగ్యాలా? మూర్ఖుడా! దేవుణ్ని ఎంత భక్తితో మొక్కితే- అంత బాగా వుంటుంది బతుకు తెల్సా!

కుర : మరి, మా బతుకెందుకు బావిలగ దినదిన గండమవుతుంది. పొద్దూరేపరికి- సూర్నారాయణమూర్తికి దండమెట్టి గాని; కడుపుల గెంజి పోసుకోను. మరీ బతుకేటిబావ్?

బిజెపి : అది నీ పూర్వజన్మ ఖర్మయ్యా. అనుభవించక తప్పదు.

కుర : అంతే, గత జలమల మా ఎల్లం నాయుణ్ని నేను కట్టేసానేటి? యిప్పుడత గాను నన్ను కట్టేసాడు?

బిజెపి : యింతకీ యేమిటయ్యా నీకట్లు?

కుర : సెప్తాను. యీ కట్లిప్పిబావ్.

బిజెపి : విప్పేవాడూ, వేసేవాడు దేవుడే! ఆ రాముడే! ఆయన సంకల్పముంటే యేవయినా విడిపోతాయి.

కుర : రాములోరొచ్చి యిప్పాలతప్ప-తమరిప్పరన్నిమాట!

బిజెపి : యింతకీ ఎవరు కట్టేరయ్యా?

కుర : సెప్తే యిప్పేత్తారా పోనీ?

బిజెపి : విప్పనంటే చెప్పవా? అయితలా వుండు. జై శ్రీరాం (అని వెళ్లిపోబోతాడు.)

కుర : అతికాదు బావో, బావో? సెప్తాను. యిప్పుడిదాక, నోరు పీకిపోయింది అడిగినోలికల్లా సెప్పి! ఒకలూ యిప్పలేదు.

బిజెపి : ఎవరికి చెప్పావయ్యా?

కుర : ఒకలికేటి ఎందరొచ్చేరో అందరికీ సెప్పాను. కాంగ్రేసు, తెలుగుదేశం- అదేటాపార్టీ నాశిడాలపెంట.... ఆఁ! నేసనల్ ఫ్రెంటుట అలకీ అందరికీ సెప్పాను. ఎవులూ యిప్పనేదుబావ్.

బిజెపి : వాళ్ళంతా ఒకటేనయ్యా. తోడు దొంగలు. హిందూదేశాన్ని రక్షించాలంటే మా బిజెపీ ఒక్కటే వుందయ్యా.

కుర : నన్ను కట్లిప్పి రచ్చించు బావ్, ఆ తరాత దేసాన్ని రచ్చిద్దువు.

బిజెపి : నీ కంటే ముందు రాముడు ఆపదలోనున్నాడయ్యా? రాముడికి భూమి కావాలి. రక్తం చిందించైనా సాధించాలి.

కుర : దున్నుకునోడికి భూమి యిప్పించితే; పండిత్తాడు, అందరికీ తిండెడతాడు. దేముడికి భూమేల బావ్?

బిజెపి : నీలాంటి మూర్ఖులు హిందువుల్లో ఎక్కువైపోబట్టే; ముస్లింలు రాముని గుడిలో రహీంని పెట్టేసి, మన రాముడికి గుడి లేకుండా చేస్నారు.

కుర : రాముడో, రయీమో....అందరూ దేవుళ్ళే గద బావ్. పేర్లుకేటి దేవ దొక్కడే గదా!

బిజెపి : అలా అనుకోబట్టే, మన హిందువులకి అన్యాయం జరుగుతోంది. ఇతర మతాలవాళ్ల....మనలాంటి సహనపరులుకాదు తెల్సా?

కుర : వోనవన్నీ నాకేల? యా కట్టిప్పే బావ్. నువ్ సెప్పిన దేవుడికి మొక్కుతాను నువ్వేయ్యిమన్న గుర్తుకి ఓటు ముద్ర గుద్దుతాను.

బిజెపి : మొక్కడం కాదయ్యా. హిందువులంతా అయోధ్య రావాలి. ఎవరడ్డొచ్చినా రామాలయాన్ని నిర్మించాలి. రక్తం చిందించాలి!

కుర : ఒట్టికొట్టిని- ఒళ్లు పులిసిన తగువులుగానీ- గుడి గట్టాలంటే-అయోధ్యలే కట్టాలా? మరెక్కడకడితే రాముడొప్పుకోడేటి? దానికి రత్తం సిందించీయాలా? ఎవుల్ని సంపీసి, ఏ దేముడ్ని నిలబెడతారు బావ్? కట్లుకాడ సత్తన్నాను....యిప్పుబావీ కట్లంతే-యిప్పుడితగాను. దేముడికి రచ్చిచ్చేత్తారట!

బిజెపి : ఆఁహాఁ! యిలాంటి గీరగాడివి గనకే- నిన్ను కట్టేసుంటాడతను. తప్పు లేదు. నీలాంటోల్ని తన్నినా తప్పులేదు.

కుర : నీలాటోలికే-గుండం గట్టే రోజులు ముందు ముందున్నాయిలే. ఎల్లకాలం ఎలిపోదు మీ దురుమార్గం.

బిజెపి : రాముడ్ని నమ్ముకున్నోడికేమీ గాదు. జై శ్రీరాం! రా! కదలిరా! (పోతాడు)

కుర : రాములోర్ని....నీలాగ ఓటు కోసం ఎవులూ అమ్ముకోర్రా....ఒరే! మనిసికి జానెడు నేల నడగడు- రాముడి కోవిలని సెప్పి, తగువెత్తండు. ఈ నాకొడుక్కి గెలిపిత్తే- రావనరాజ్జెం జేసీడా?

పాట : జవానూ జగ్గారావూ
అది బుగ్గని కిళ్ళీ
బుర్రని టోపీ సూడరబాబూ ॥జవా॥

జవాను : (వచ్చి అటూ యిటూ పచార్లు చేస్తాడు)

కుర : బావో.... జవాను బావో.... యిటుకాసి సూడుబావు.

జవా : (చూసి) అఁ! చూస్నేన్రా!

కుర : యిటుకాసి సూడు బావంతే- సూసి, యీకట్లిప్పుతావనుకుంతే; సూస్నేన్రా అని సెప్తాదేటి బావ్! సూడ్డంకి నాక్కల్లులేవా?

జవా : యేట్రా? యేటేటేటి?

కుర : యీ కట్లిప్పుతారాని....?

జవా : ఓరి అమాయికపోడా! యెక్కడేనే పోలీసులు కట్లు కడతారుగానీ- కట్లిప్పుతార్రా!

కుర : దేముడ్నాగొచ్చేరు యీకట్లిప్పి రచ్చిత్తారు అనుకున్న....రచ్చకబట్లు కదా!

జవా : ఔన్రా! రక్షకభటులమే! మేము రక్షించాలంటే- నీకు మేడుండాల! కారుండాల! భూములుండాల! పేక్టరీలుండాల! పేరుండాల! అలాంటోలికి రచ్చించుతాంగానీ, నీలాటి గోసిగుడ్డోల్నిగాదురా!

కుర : ఆన్నీ వునోన్నెలుకి మీరేల రచ్చించాల? ఆల సొమ్మూ, బలగమే ఆలకి సాల్లు!

జవా : సాల్దురా! మీ ఊర్లె మేడ్లునోన్నెలూ, సొమ్మునోన్నెలూ ఎంతమందిరా?

కుర : ఎంతోమందేరి? ముగ్గురు నలుగురు కంటెక్కువుండరు.

జవా : మీ కూల్నాకొడుకులెంతమందిరా?

కుర : ఊరందరిమీ కూలోలిమేని బావ్.

జవా : మరి మీరందరూ ఆలమీదపడిపోకుండా....రచ్చించాలంతే ఆలసొమ్మేటి సరిపోద్దిరా సాల్దు! మా సపోటుండాల ఆలకి తెల్సా?

కుర : అయితా ఊరికొక లిద్దరునోన్నెలు - ఊరందరి మీదా పడి తినీవొచ్చన్ని మాట? మమ్మల్ని ఎవులు రచ్చించరన్న మాట!

జవా : మీ మీద బడి తినీడంకి - మీ దగ్గరేటున్నాయిరా? మేడలా మిద్దెలా? సొమ్మా? సోకమా? మీ ఊసెపుడికొక్కవాలిరా?

కుర : మా నాటోలి రచ్చిత్తే....మీ పేరు సెప్పుకోమా? బాబ్బావూ, కనికరించి యీ కట్లిప్పిద్దూ.

జవా : కనికారంపూ! ఆదెలాటిదిరా? అయినా, నీలాటోడివి రచ్చుత్తే నా ఉజ్జోగ మూడి పోద్దిరా.

కుర : బాబ్బావూ! మూడు పూట్ల కొంచి తిండీ, తిప్పల్లేవు. యీ కల్లు కొడస్త న్నాను.

జవా : నీకు మూడు పూటలా - నాకు ఆరు పూట్లు కొంచి తిండి లేదురా తెల్సా?

కుర : మీకేటి బావ్. ఎపులేనా, పిల్సి కూకోబెట్టి కూడెతారు.

జవా : అవి పూర్వం రోజుల్రా! యిప్పుడు మమ్మల్నెవుడు పలకరించడు. ఔన్రా? నీకూ విజయకాంతి తెల్సురా?

కుర : తెల్దు బావ్!

జవా : అదిగో, దాని సిన్మా సూటింగట! దానికి బందోబస్తు కెల్లాను. ఆ రోజు తిండి లేదు. మొన్న- రిజర్వేసను మద్దతోలు బందు సేసారు. దానికి బందోబస్తు కెల్నాను. మన తిండి బంద్. నిన్న.... ఏంటీ రిజర్వేసనోల్లు బందన్నారు. ఎల్నాను. మళ్ళీ తిండి బంద్. ఈ పొద్దో....? మా రంకు మొగుడెలిపో వొచ్చినాడు! ఎవులో తెల్సా?

కుర : ఎవులు బావ్?

జవా : మా ఎస్పీ దొరగార్రా! ఆతగాని రొండో పెళ్ళాం తోటి తిగిపోనాడు గెస్టు అవుసుకి - కేరేజీలు, బేరేజిలు నప్పేసరికి నడుం జారిపోనాది. (అని కూర్చుండిపోతాడు నిస్సత్తువుగా! కూర్చొనే) ఆతగా నెలిపోయాడుగదా - ఇలాగ మామూలుగా మన పద్దుల్లేవా....అని సూద్దు మనొచ్చేసరికి నువ్వు తగులుకున్నావు. (లేచి) ఔన్రా? ఊరిల కోడి పందేలవుతన్నాయట?

కుర : నాకు తెల్దు బావ్!

జవా : పేకాట ఆడతంద్రట....!

కుర : అలాటిదేటి నాకు రాదు బావ్!

జవా : ఓరి జడ్డోడా? నువ్వేగాదురా- యీ ఊరిల అడతంద్రాట !

జనంలోంచి : అల్లా, నాయుడోరి వీధిల ఆడతన్నారండీ....నాయుడోరి బాబులు!

జవా : అల్లా! అవి ఎస్సయిగారి నెలమామూళ్ళ పద్దులు!

జనం : అల్లా తోటల సూటాట అడతన్నారండీ!

జవా : అలు ఆటయింతరాత....తెచ్చిచ్చేస్తారు.

కుర : బాబ్బాబూ! యీ కట్లిప్పిచా....నీకు పున్నెముంటాది

జవా : కాదురా, యింతకీ యీ కట్లెపులు కట్టారు? యేటి తప్పు చేసావు. సెప్పి మిరా అది సెప్పిమిరా ముందు

కుర : కట్లిప్పి బాపూ, సెప్తాను. నోరు పీకిపోనాది, యిప్పుడివాక ఎందరికో సెప్పి, సెప్పి!

జవా : యేట్రా? యేటేటీ? యెందరికో సెప్పావా? నోరు పీకిపోయిందా? అందికని నాకు సెప్పకుండా; కట్లిప్పమంటావా? సెద్దూలొలిసీగల్ను! నీకెవుడు ఊరోలి కందరికీ పిర్యాదు సెయ్యమన్నాడు? పిర్యాదు అన్నది పోలీసోలికి సెయ్యాల్రా! అప్పుడు మాం యిన్వెస్టిగేసన్‌ల దిగి; దాన్సంగ తేల్తాం! తెల్సిందా? చెప్పు ముందు నీ కత!

కుర : మా ఊరి ఎల్లంనాయుడు నేడా....?

జవా : ఆఁ! ఎల్లంనాయుడుగారా? ధర్మప్రభువు! ఊఁ! తర్వాత....చెప్పురా!

కుర : (పోలీసు జవాబుతో నిరాశపడి) మరేల సెప్పాల?

జవా : యేఁడిరా?

కుల : పేరు సెప్పేసరికి దరమ పెబుపంత్రను- మరి సెప్పి నాబమేటి?

జవా : ఎల్లంనాయుడు ధర్మప్రభువు గాకపోతే- నువ్వు ప్రభువ్విరా?

కుర : కొనదాక యింతే-ఆ పెబువు దరమ్మేటో తెలుత్తాది

జవా : చెప్పురా మరీ-

కుర : ఆ బాబుకాడ అయిదు పంటల కిందట అయిదొందలు అప్పోడుకున్నాను

జవా : మా కంట నువ్వే నయంరా! అయిదుపైసలు అప్పివ్వడు మాకెవుడు

కుర : తిరగ తీర్సరు అనెపులివ్వరు

జవా : పోలీసోడ్ని జూస్తే-నీకూ నీరసేన్రా? తొక్కల్దిసీగల్ను! తెల్సిందా?

కుర : లేదు బావ్. పోలీసోల్ని సూత్తే యమలోర్ని సూసినట్టుగ బెదిరిపోతాన్నీను!

జవా : అదరా మళ్ళా! ఎముడితోటి పోలుత్తావురా? (అని లాఠీ ఎత్తి కొట్టబోయి అగుతాడు)

కుర : యేటన్నే....తప్పులాగుంది తమతోటి!

జవా : సర్నే! ఆఁ....యింతకీ అసల్సంగతి సెప్పు.

కుర : అయిదు పంటన కిందట తీసుకున్ని అప్పుకి-యేటా పాయిదాలు కొలుసుకోనొత్తన్నాను బావ్!

జవా : ఎవుడి కోసం కొల్సుకోనొత్తన్నావు బావ్? ఉట్టిపున్నేనికి కొలుత్తన్నావ్!

కుర : నీనేటన్నాను? కొలుత్తన్నా నన్నానుగానీ! మరి విరుడు కరువొచ్చింది గాదు-

జవా: యెగమెడ్డీసినావా?

కుర : తాగడంకి గెంజికయినా గింజ పండనేదు కద బావ్!

జవా : యెగమెడ్డీసావా? లేదా చెప్పురా?

కుర : కొల్నేదు బావ్!

జవా : అదే-నీ మొకం జూస్తే తెల్సిపోతందిగదా? ఎగమెడ్డిత్తే ఎవుడూరుకుంతాడ్రా? ఎల్లం నాయ్డు గాబట్టి వొగ్గీసినాడుగానీ!

కుర : యేటొగ్గిసినాడు బావ్ ? నా బండీ బక్కలు నాక్కున్నాడు. యీ సెట్టు గట్టేసినాడు!

జవా : అతగాను గాబట్టి అంతటితోడాగినాడ్రా! నాలాటోడ్నయితే గుమ్మితీసి పాతిద్దును.

కుర : దరమపెబువుగదా వొగానినాడు.

పోలీ : అయితింతకీ - యీకట్లు యిప్పేస్తాను గానీ ఎంతిస్తావురా ?

కుర : నా దగ్గరేటున్నాది బావ్.... యివ్వడానికి ?

పోలీ : యేల్లేపోతేల పిల్సినావు బావ్ నన్నూ ?

కుర : రచ్చకబట్లుగడా అని పిల్సినాను. తమ పేరు సెప్పుకుంతాను, కట్లిప్పి బావ్.

పోలీ : నా పేరు నువ్వు సెప్పుకుంతే - నా ఉజ్జోగం పోద్దిరా! ఎల్లం నాయ్డు తిన్న గెల్లి ఎస్పీదొరకి నా మీద రిపోర్టిచ్చేస్తాడు. అందుకని, పేరూ, గీరూ కాదూ- చెప్పురా ఎంతిస్తావో ?

కుర : నిజింగ నాకాడేఁవ్నేవు బావ్. కావాలంతే, మా యింటిల దూరిపోయి దేవుకో బావ్. యేటిదొరికితే అవొట్టుకుపో!

కుర : నువ్వొర్డదేస్తే గానీ, నీ యింటిల దూర్లేమేటి ? పోలీసోడికీ, పోలేరమ్మకీ అడ్డేటిరా ?

కుర : తమకెవులు బావ్ అడ్డు ? అందికనే, యీ కట్లిప్పిమంతన్ను.

పోలీ : మరి బేగి తెల్సిరా ? యిప్పుడికే బోల్డు ఆలిసమయిపోయింది. పోలీస్ జెమాన్ని, డూటీ మీదునోడ్ని పిల్సి, నిలబెట్టేసినావంతే - నీ మీద IPC.... నూటా...., పదహార్లు కేసెట్టీవొచ్చు.

కుర : నాదగ్గిట పైసాలేదు బాప్. తమకి దయుంతే కట్లిప్పండి, లేపోతే పల్లకెలి పోండి, తమకి దండమెడతాను....తిరిగి కేసెట్టకండి.

జమాను : నువ్వు రమ్మంటే రాడానికీ, పొమ్మంటే పోడానికి - నీ పెంపుడు కుక్కనా ? పోలీసోడ్నిరా ? నడ్మికే! (జేబులోంచి కాయితం తీసి) నీ పేరు సెప్పురా ?

కుర : ఎందుకు బాప్.... ?

జమా : ఎల్లంనాయ్డు లాంటి పెద్ద మనిసిని తిట్టినందుకూ కేసురా!

కుర : నీను తిట్టేనా ? యింత అబద్దమాడతారా ? నా బాధకి నీనేత్సినాను. వొచ్చి నోలినల్లా బతిమాల్నాను; కట్లిప్పిమని!

జమా : పేరు సెప్తావా ? సెప్పవ్‌లా ?

కుర : ఓ పేటీ ? కాదేటితగాని తీరవా ? యింత అన్నేయంకి దిగ్గూడదు బాప్.

జమా : యేటీ ? యేట్రా ? అన్యాయమా ? అక్రమమా ? యిలాంటి పదాలు నీ నోటంట వొస్తన్నాయంటే - వొరే నువ్వు నక్సలైటోడి వేట్రా ?

కుర : నీనేం నక్సలయిటుని....ఎద్దెనకాల ఎద్దునాగ కష్టపడీ రైతుని.

జమా : అయితే నక్సలైట్ల మీటింగులికెల్తున్నావు.

కుర : నీనెపులి మీటింగుకీ ఎల్నేదు బాప్.

జమా : అలగంతే - నమ్మేస్తాన్రా ? చెప్పారే మర్యాదగా నీ పేరు! ఈ దెబ్బతో నాకు ప్రమోషన్ రావాల! నక్సలైట్ నాకొడకా! చెప్పరా నీ పేరు!

కుర : బాపూ ! తమరు నాకట్లిప్పొద్దు. తమకి దండమెడతాను. ఎలిపోండి. నన్నొగ్గియండి బాపూ!

జమా : కల్లు, అప్పూ సంగతొదిలీ, అది పాతకేసు. నీ పేరు సెప్రా....నక్సలైటోడా?

కుర : నాపేరేల బాప్? నాన్నక్సలయిటు వంతాదేటీ బాపు?

జమా : మరి నీన్నక్సలైటున్రే? నువ్విలగ చెప్పవు. (అని లాఠీతో కొడతాడు. "రైతు అమ్మో, నాయినా" అని దెబ్బ, దెబ్బకీ యేడుస్తూ అరుస్తాడు. ఇంతలో నాయకులు (కాంగీ, టిడిపి, బిజెపి, ఫ్రంట్ వాళ్ళ) వస్తారు.

వాళ్ళు, జమానుకి వత్తాసుగా రైతుని "నక్సలైటు వెధవని—తన్నండి" అనే అంటారు. పోలీస్ యింకా కొడుతుంటాడు.

దూరంగా డప్పు వాయిద్యంతో పాట పాడుతూ సాంస్కృతిక దళం వస్తుంది. "అగారే....పోలీసోడా" కేకతో దళం పోలీసేనీ, నాయకుల్నీ చుట్టుముడుతుంది. దళం చేతిలో సాంప్రదాయ ఆయుధాలుంటవి. పోలీసునీ, నాయకుల్నీ ఆ చెట్టుకే కట్టివేస్తారు. కురమయ్యను విడిపిస్తారు. కురమయ్య ఆనందంగా)

కుర : బావుల్లారా! మీరెవులో దేవుళ్లు! మీర్రాకపోతే సీనీకట్లుకాడ, యీ పోలీనోడి దెబ్బలకి సచ్చిపోదును. నన్ను రచ్చించిన దేవుళ్ల మీరు!

దళం : మేము మీలాంటి మనుషులమే. 'రైతాంగ పేదల సమితి' కార్యకర్తలం. గ్రామ, గ్రామాల్లో పేదల్ని కూడదీసి, సంఘాలు పెట్టించటానికి తిరుగుతున్నాం. పేదలంతా ఒక్కటయి, పెత్తందార్లపై పోరాటం చేయాలి!

కుర : ఔను బావ్. మా ఊరి ఎల్లం నాయ్డు కెదురులేదు. పేదలం ఎవులిదారాళ్ళదే. నా బండీ బక్కని నాక్కుండు. నన్ను కట్టీసినాడు. ఎవులడగనేకపోనారు బావ్ మా ఊరిల!

దళం : ఇకనించీ మీ ఊరిల ఎల్లంనాయుడు ఆటలు సాగవు. పదండి, మీ పేదలంతా సంగం గట్టండి. ఒక్కటిగా నిలబడి పోరాడాలి!

కుర : అలగేని బావ్. నేనూ సంగంల సేరతాను. మీలాంటోలు నిలబడితే మాకు తోడు—యీ దొంగనా కొడుకుల సంగతి (కట్టేయబడ్డవార్ని చూపి) సిటంలోన తేల్సిమా! రండి బావ్. సంగం మీటింగెడుదురు.

దళం : ఔను. రా!

పాట : రండిరో కూలన్నా....
సంగం పెడదామూ—ఈల సంగతేదో చూద్దాము"
— అందరూ నినాదాల్తో వెల్తుంటారు—

(ముగిసింది నాటిక)

[శ్రీకాకుళం, విజయనగరం, జిల్లాల్లో ఈ నాటికకు 30కి పైగా ప్రదర్శనలు జరిగాయి. బొబ్బిలిలో ఈ నాటిక ప్రదర్శన 144 సెక్షన్‌ను ధిక్కరించి జరిగిందని కేసు కూడ నడుస్తోంది. శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల ప్రత్యేక పరిస్థితివల్ల బహుశా ఈ నాటికలో సిపిఐ, సిపిఐ(ఎం) నాయకుల పాత్రలు లేవు, తెలుగుదేశం ఉండగా మళ్ళీ నేషనల్ ఫ్రంట్ పాత్ర కూడా ఉంది. ఐనా ఎన్నో ప్రదర్శనలు జరిగిన ఈ నాటికను యథాతథంగా ప్రచురిస్తున్నాం. స్థానిక అవసరాలను బట్టి పాత్రల మార్పులు చేసుకుని ప్రదర్శించుకోవచ్చు. —'సాహితీమిత్రులు']

సినిమా సమీక్ష :

'పీపుల్స్ ఎన్‌కౌంటర్'

— జి. ప్రసాదరావు

ఉషాకిరణ్ మూవీస్‌వారి "పీపుల్స్ ఎన్‌కౌంటర్" చిత్రంపై ఈ మధ్య పెద్ద దుమారమే చెలరేగింది. ఈ చిత్రం నక్సలైట్లను అభాసుపాలు చేసేదిగా ఉందన్న వారున్నారు; పోలీసులకు మనస్తాపం కలిగించేదిగా ఉందన్నవారూ ఉన్నారు. ఈ చిత్రం నక్సలైట్ ఉద్యమాన్ని సమర్థించకపోయినా "అన్న"లను ఆశాజ్యోతులుగా చూపించారని వాదించినవారు మరి కొందరున్నారు.

మరి ఈ చిత్రం నిజంగానే వీటన్నిటినీ చేసిందా? చిత్రం వెనుకగల చిత్ర నిర్మాతల రాజకీయ, సాంస్కృతిక భావజాలం ఏమిటి? పరిశీలిద్దాం :

ఈ ప్రయత్నాన్ని పరిశీలించే ముందు అది కేంద్ర బిందువుగా తీసుకున్న నక్సలైట్ ఉద్యమం గురించి స్థూలంగానైనా తెలుసుకోవాలి. ఇరవై యేళ్ళుగా ఆ ఉద్యమం చేసినదాన్ని పరిగణనలోకి తీసుకోవాలి.

నక్సలైట్ ఉద్యమం వచ్చాక పేదప్రజల సమస్యలెన్నో వెలుగులోకి వచ్చాయి. భూమి సమస్య, కూలిరేట్ల సమస్య, భూస్వాముల సామాజిక పెత్తనం, కాంట్రాక్టర్ల దోపిడి, దళిత స్త్రీలపై దాడులు, గిరిజనుల దయనీయ జీవనస్థితి యిలా యెన్నో సమస్యలు. ఆ ఉద్యమమే రాకపోతే యివేవీ ఎజెండాలోకి వచ్చేవే కావు.

మరి మన ప్రభుత్వం వీటిల్లో దేనికైనా సమాధానం చెప్పిందా?

ప్రభుత్వం మిగులు భూముల్ని పంచలేదు. పంచదు. కనీస వేతనాన్ని అమలుచెయ్యలేదు. అమలు చెయ్యదు. భూస్వాముల దాడులను ఆపలేదు. ఆపదు. గిరిజనుల జీవితానికి భద్రత కల్పించలేదు. కల్పించదు. స్త్రీలపైన జరిగే అత్యాచారాల్ని అరికట్టలేదు. అరికట్టదు. కాని సంఘటితమై యీ సమస్యల్ని పరిష్కరించుకుంటున్న ప్రజల్ని, వారికి వెన్నుదన్నై వారి పోరాటోద్యమ చైతన్యాన్ని ముందుకు తీసుకుపోతున్న "అన్న"ల్ని అణిచేయాలని చూస్తుంది. అందుకు కావాల్సిన విధంగా వాస్తవాల్ని వక్రీకరిస్తోంది. శాంతి భద్రతల ముసుగులో పోలీసుల్ని వేటకి వుసిగొలుపుతుంది. పార్లమెంటరీ ప్రభుత్వంలో పాలుపంచుకుంటున్న పార్టీలు కూడా

యీ సమస్యలున్నాయనే అంటాయి కాని ఓట్లని కొల్లగొట్టే సాధనాలుగా ఆ సమస్యల్ని వాడుకుని వదిలేస్తూంటాయి.

ఇది యీనాటి మన సమాజ వాస్తవ పరిస్థితికి సూక్ష్మరూపం.

ఈ పరిస్థితిలో నిజమైన ప్రజాస్వామ్యవాది యేం చెయ్యాలి? ఈనాటి రాజకీయ వ్యవస్థ అనుసరిస్తున్న దుష్ట-ద్వంద్వ విధానాన్ని ఖండించాలి. దాని పరిపాలనలో వున్న కాపట్యాన్ని ప్రశ్నించాలి. జీవిత వాస్తవాల్ని ప్రజల ముందుంచి సంఘటితం కమ్మని ప్రజలకు పిలుపివ్వాలి.

ప్రజాస్వామ్యవాదినంటున్న రామోజీరావు ఆ పని చేశాడా?

అంటే ఈ సినిమా ఆ పని చేసిందా?....చూద్దాం.

ప్రభుత్వ సాయుధ బలాల, నక్సలైట్ సాయుధ దళాల ప్రమాణాలతో మొదలైందీ సినిమా. సాయుధ బలాలు "ప్రజల కోసం చట్టాలికి లోబడి పనిచేస్తాం" అని ప్రమాణం చేస్తాయి. నక్సలైట్ దళాలు "చట్టాల్ని అతిక్రమించయినా ప్రజల్ని సంఘటితం చేస్తాం, నూతన రాజకీయ వ్యవస్థా నిర్మాణానికి పనిచేస్తాం" అని ప్రమాణం చేస్తాయి. వారూ వీరూ వొకే ఫ్రేములో కొచ్చేసరికి యెవరు యే ప్రమాణం చేస్తున్నారన్న అయోమయం కలుగుతుంది.

కమర్షియల్ సినిమాకి అలిఖిత నిబంధన ఒకటుంది. స్థల కాలాలకు కమిట్ కానక్కర్లేదన్నదే ఆ రూలు. ఈ వెసులుబాటు చాలు వాస్తవాలకు మసిపూసి అయోమయాన్ని పెంచడానికి. అంచేత ఆరంభంలో తలెత్తిన అయోమయాన్ని అలా వుంచుదాం. కథా కథనంలోని అయోమయాల్ని చూద్దాం.

అది గిరిజన ప్రాంతం. కమిట్ కాలేదు గనక తెలంగాణాజిల్లాల్లో యెక్కడిదనైనా మనం అనుకోవచ్చు. అక్కడి గిరిజనులకు వైద్యం చేస్తూ డాక్టర్ జ్యోతి అనే ఆవిడ వాళ్ళతల్లో నాలికలావుంది. ప్రజా పోరాటాలు అనేవి చట్టాలకు లోబడి నడవాలన్నది ఆమె పాలిటిక్స్. అంచేత ఆవిణ్ణి మనం అక్షరాలా అమెరికన్ - ప్రజాస్వామ్య దేవతనుకోవచ్చును.

ఆ ప్రాంతంలో కర్కోటకుడైన భూస్వామి వున్నాడు. వాడి చేతిలో చెంచాలా మరో దళారి వున్నాడు. ఫారెస్టు సిబ్బందేగాక ప్రభుత్వోద్యోగులంతా భూస్వామి దగ్గర పెంపుడు కుక్కల్లా పడుంటారు. ఈ దుష్ట కూటమి ఆ ప్రాంతం మీద తిరుగులేని పెత్తనాన్ని చెలాయిస్తోంది. అక్కడి గిరిజనుల్ని అగచాట్ల పాలు కావిస్తోంది.

అది చూసిన దేవతలాంటి జ్యోతమ్మ గిరిజనుల పక్షాన నిలుస్తుంది రూల్సు ప్రకారం మహాజర్ల మహాయుద్ధాన్ని మొదలెడుతుంది. అన్నలు ఆయుధాలతో ఆపద్బాంధవుల్లా వచ్చి ఆదుకుని 'అది లాభంలేదు, మా మార్గానికి రమ్మం'టారు. యువకులు అటువైపు మొగ్గుతారు. అటుపోవద్దని ఆవిడగారు ఆపుతుంది. పిటిషన్ల పోరాటం జరుగుతూండగానే అన్నల్ని వేటాడే విద్యుక్త ధర్మంతో ఓసారి ఎస్.పి. వస్తాడు.

ఎస్.పి.ని చూసిన జ్యోతమ్మ ఆలోచనలు గబుక్కున గతానికెళ్ళాయి. ఆ 'ఫ్లాష్ బేక్' వాళ్ళు భార్యాభర్తలని చెప్పింది; సరిపడక విడాకులిచ్చుకున్నారని చెప్పింది. ఆశయం కోసం, విద్యుక్త ధర్మం కోసం వివాహాన్ని విచ్ఛిన్నం చేసుకున్న ఈ ఇద్దరూ కథ పొడుగునా ఘర్షణ పడుతూనే వుంటారు. దీన్ని బట్టి వారిద్దరి పాత్రల "ఉదాత్తత"ని తెలుసుకోవచ్చును.

కథిలా నడుస్తుండగా నాటకాల్లో నారదుడులా డూప్ గద్దర్ అవసరాన్నిబట్టి ఆడుతూ పాడుతూ వస్తూ సినిమా ఉత్తేజాన్నిస్తాడు; అడవిలో అన్నలకోసం తిరుగుతున్న పోలీసులు సెటైర్లతో వినోదాన్నిస్తారు; దళారీ వుమ్మడి భార్యతో దుష్టకూటమి తాగితూలి ఆడిపాడి ఆనందాన్నిస్తారు. గిరిజన యువకులు నక్సలైట్లవుతారు.

మూడు ముఖాల నడుస్తున్న పోరాటం ముమ్మరమైంది. భూస్వామి అటవీ శాఖా మంత్రిణికి "అమ్యామ్యా" అందించి గిరిజనుల గూడాన్ని పీకించాలంటాడు. గవర్నమెంటు ఆర్డర్స్‌తో వచ్చిన పోలీసులు గిరిజనుల్ని ఖాళీ చెయ్యమంటారు. చెయ్యమని జ్యోతమ్మతో సహా గిరిజనులు బైఠాయిస్తారు. పోలీసులు లాఠీ ఛార్జిచేస్తారు. ఆయుధాలతో అన్నలొచ్చి ఆ స్థలాన్ని యుద్ధభూమిగా చేసేస్తారు. పోలీసులు తోక ముడుస్తారు.

డాక్టర్ జ్యోతికి, అన్నలకూ అక్కడ మళ్ళీ సిద్ధాంత చర్చలాంటి వాగ్వాదం జరుగుతుంది. అప్పుడే జ్యోతమ్మ తమ్ముడు నక్సలైట్లలో వున్నాడని తెలుస్తుంది. ఆ తరువాత గిరిజన వృద్ధురాలి కూతుర్ని దుష్టకూటమి చెరుస్తుంది. గూడెం పెద్ద సహదేవుడి కొడుకుని పోలీసులు కాల్చేస్తారు. అన్నలు ఆ శవాన్ని పోలీసుల కన్నుగప్పి తీసుకెళ్ళిపోతారు. డూప్ గద్దర్ పాడుతుంటే కోరస్ యిస్తూ అమరుల్ని తల్చుకుని పోరాటం కొనసాగిస్తామని లాల్ సలాములు చేస్తారన్నలు.

డూప్ గద్దర్ "పిలుస్తోంది ఇంద్రవెల్లి .... ఈ అరణ్య భారతాన వెలిసిన

ఢిల్లీ" అంటూ గిరిజనుల్ని ఇంద్రవెల్లి సభకి మళ్ళేసుకొస్తాడు. అదేరోజు దుష్ట కూటమితో సభ పెట్టించి పర్మిషన్ లేదు పొమ్మంటారు పోలీసులు. ఆ విషయంలో ఘర్షణ జరుగుతుండగా అత్యాచారానికి గురైన గిరిజన యువతి ఎస్.ఐ ని చంపు తుంది. ఎస్.పి. కాల్పులకు ఆర్డరిస్తాడు. ఏకపక్షంగా గిరిజనుల మీద జరిగే పోలీసు కాల్పులు అన్నలు కలగచేసుకోడంతో అవి యుద్ధ బీభత్సాన్ని సృష్టించింది.

అన్నలంటే మానవ రక్త పిపాసులన్న భావన కల్గించిన యీ సన్నివేశం నుంచి యీ సినిమా "నక్సలిజం టెర్రరిజమవుతోందని, ప్రభుత్వం హిట్లరిజమవు తోందని" నేపథ్యం నుంచి చెపుతూ తనకొచ్చిన మలుపుకి తిరిగింది. వరుసగా నక్సలైట్ల దారుణాలను దండగుచ్చి చూపించింది. ప్రజాకోర్టులో దొరని చెట్టుకి ఉరే స్తారు. దళారీ వ్యాపారిని చంపుతారు. ఇన్ఫార్మర్ ముక్కలుగా తరిమి తరిమి చంపు తారు. ఫారెస్టు సిబ్బందిని మాత్రం క్షమించి వదులుతారు. సారాదుకాణాల్ని కాలు స్తారు. హింసని 'ప్రతి హింస'తో అణచేందుకు వస్తున్న పోలీసుల్ని మందు పాతర్లు పెట్టి చంపుతారు. ఆ పాతర్లలో అమాయకులైన ప్రజలు చనిపోతారు. ఈ హింస చూసి కొందరు నక్సలైట్లు ఉద్యమం నుంచి ప్రభుత్వానికి లొంగి దాని జనజీవన స్రవంతిలో కొచ్చేస్తారు.

ఈ హింసా ప్రతిహింసల విలయాన్ని భరించలేకపోయింది డాక్టర్ జ్యోతి. విధానసభ ముందు ఆమరణ నిరాహారదీక్షకి కూచుంది. ఆమె ఆరోగ్యం క్షీణించే కొద్దీ అసెంబ్లీ హీటెక్కింది. ఆఖరికి అరెస్టయిన నక్సలైట్ లీడర్‌తో ప్రభుత్వ యంత్రాంగం దిగొచ్చింది. వారి ముందు జ్యోతి తన మొర వినిపించింది. అయినా వారి దారుల్ని వారు ససేమిరా వదులుకోమంటారు.

అంతవరకూ నక్సలైట్లతో కలిసి తిరిగిన గిరిజన ప్రజలు- గూడెం పెద్ద సహ దేవుడు మరో వృద్ధ స్త్రీ- నక్సలైట్ లీడర్ మీద ఎదురుదాడి చేస్తారు. వృద్ధ స్త్రీ 'మీ వల్లే మా బతుకులిలా అయ్యాయ'ంటుంది. గూడెం పెద్ద సహదేవుడు 'మీరే నా కొడుకుని పొట్టన పెట్టుకున్నార'ని ఆడిపోస్తాడు- ఇంకా 'వాడే సైన్యంలో చేరుంటే ప్రభుత్వం వాడికి వీరచక్రం బహుమాన మిచ్చే'దని కూడా వాపోతాడు!

వాద ప్రతివాదాలిలా జరుగుతుండగానే మెలోడ్రమిటిగ్గా నక్సలైటైన గిరిజన యువకుడు అసెంబ్లీ పైకెళ్ళి బాంబు విసురుతాడు. దాన్ని క్రికెట్ బాల్‌లా కేచ్ చేస్తుంది డా॥ జ్యోతి. బాంబు ఆమె చేతిలో పేలి కుప్పకూలిపోతుంది. అవసాన

దశలో కూడా మరో ఉపన్యాసమిచ్చి హింసా ప్రతిహింసల నాపేస్తామని ప్రమాణం చెయ్యమంటుంది. అందరూ విస్సహాయులుగా నిలబడతారు. గిరిజన యువతికి పుట్టిన పిల్లాడొచ్చి ప్రమాణం చేస్తాడు. డా॥ జ్యోతి తన ఆశయం కొనసాగుతుందన్న తృప్తితో కన్నుమూసింది.

ప్రజా సంక్షేమం పట్టని ప్రస్తుత పార్లమెంటరీ చట్టాల కోసం ప్రాణాలిచ్చిన 'ప్రజాస్వామ్య దేవత' డా॥ జ్యోతి. ఇంత చెప్పినా ఆవిడ తన ఆశయం ప్రజలకు అందలేదనిపించింది కాబోలు. ఇంతవరకూ సినిమాలో జరిగిన ఉపన్యాసాల సిద్ధాంత చర్చల సారాన్నే మళ్ళీ వ్యాఖ్యానంగా వినిపించారు.

"ప్రజలారా! నక్సలైట్లది హింస. ప్రభుత్వానిది ప్రతిహింస. ప్రభుత్వంలో కొందరు వ్యక్తులు చట్టాల్ని అతిక్రమించి వుండవచ్చును. దారుణాలు చేసుండవచ్చును. అంతమాత్రాన నేటి పార్లమెంటరీ ప్రజాస్వామ్యానికి ప్రాణమైన ప్రభుత్వాన్నే కూల్చుకోకూడదు. ఆ వ్యక్తుల్ని తొలగించాలి. ప్రభుత్వాల్ని సరిదిద్దుకోవాలి. ఏనాటికైనా మనకి ఈ ప్రజాస్వామ్యమే శిరోధార్యం. ఆలోచించండి". ఇదే ఆ వ్యాఖ్యాన సారాంశం.

ఇక్కడ కీలకాంశాలు హింసా ప్రతిహింసలు. కనుక ఎవరిది హింస? ఎవరిది ప్రతిహింస? అనేది తేలాలి.

వర్గ సమాజపు అసమానతల్లోనే హింస వుంది. సామాజిక పెత్తందార్లు ఆ హింసని- దోపిడీ పీడనని- ఆశ్రయించి అభివృద్ధి చెందాలి. కనుక రాజ్యాంగ చట్టాలు ఆ హింసకి సామాజిక ఆమోదాన్ని కల్పిస్తాయి. ఇదే పాలకవర్గ రాజకీయం.

ఈ విశ్లేషణ ప్రకారం రాజ్యాంగ యంత్రంలోనే హింస భాగమై వుంది.

మధ్యయుగాల్లో స్పార్టకస్ తిరుగుబాటు ఉద్యమం వచ్చింది. దాన్ని రాజ్యం హింసతో అణిచేసింది. నలభై అరులో తెలంగాణాలో పెత్తందార్లు దొడ్డి కొమరయ్యని హత్య చేశాకే రైతాంగ ఉద్యమం సాయుధమైంది. నైజాం రాజ్యహింస దాన్ని అణచలేకపోయింది. కొత్తగా వచ్చిన కాంగ్రెస్-యూనియన్-రాజ్యం హింసతోనే దాన్ని అణిచేసింది.

నిన్నగాక మొన్న అరవై యెనిమిదిలో పెత్తందార్లు కోరన్నా, మంగన్నలను కాల్చి చంపాకే శ్రీకాకుళ రైతాంగ ఉద్యమం సాయుధమైంది. దాన్ని కాంగ్రెస్ రాజ్యం హింసతో అణిచేసింది. డెబ్బయ్ యెనిమిదిలో పెత్తందార్లు లక్ష్మీరాజ్యం, పోసెట్టిల్ని హత్యచేశాక మళ్ళీ తెలంగాణాలో రైతాంగ ఉద్యమం సాయుధమైంది.

అక్కడి పెత్తందార్లకి అలవిగాక పోయేసరికి షరామామూలుగా వాస్తవాల్ని వక్రీకరిస్తూ శాంతిభద్రతల ముసుగులో రాజ్యం తన హింసని కొనసాగిస్తోంది. ప్రజలను, కార్యకర్తలను హింసిస్తూ హత్యలు చేసి ఎన్‌కౌంటర్లంటోంది. బూటకపు ఎన్‌కౌంటర్ల పరంపరలో సమూలంగా ఉద్యమాన్ని విచ్ఛిన్నం చేయాలని చూస్తోంది. చారిత్రకమైన యిలాంటి వాస్తవాల్ని పరిగణనలోకి తీసుకునే "భూమ్మీద వర్గాలున్నంత వరకూ 'రాజ్యహింస' వుంటుంద"ని మార్క్సిజం చెప్పింది. ఇప్పుడు చారిత్రక ప్రమాణాలతో "ఎవరిది హింస?" అన్నది నిర్ధారణ అయింది కదా.

ఈ అవగాహనతో సినిమా తీస్తే స్థల సమయాల్ని స్పష్టంగా సూచించాలి. సామాజిక వాస్తవికత గీటురాయి కావాలి. నక్సలైట్ ఉద్యమం వెలుగులోకి తెచ్చిన సమస్యల్ని కథకి వొదిగిన మేరకి తీసుకోవాలి. వాటి చుట్టూ వున్న సామాజిక జీవితాన్ని తీసుకుని సృజనాత్మకంగా సన్నివేశాల్ని కల్పించాలి. పరస్పర విరుద్ధ స్వభావాలు గల పాత్రలను ప్రవేశపెట్టాలి. అవి స్వయం చలనంతో సంఘర్షించాలి. ఆ సంఘర్షణ నుంచి వ్యక్తీకరించదల్చుకున్న విషయం వ్యక్తం కావాలి.

ఇలా చేస్తే వ్యక్తులు ఉత్తములైనా వాళ్ళని సాధనాలుగా చేసుకుని విభిన్న వ్యవస్థల విలువలు యెలా సంఘర్షించాయో రుజువవుతుంది. ఘటనల వత్తిడిని బట్టి తాము నమ్మిన విలువల్ని రక్షించి నిలబెట్టడానికి వ్యక్తులు-రక్షోనామరాక్షసః అన్నట్టు-రాక్షసులై దుర్మార్గంగా ప్రవర్తిస్తే వారి మానసిక తత్వాల్లో వచ్చిన మార్పులు తెలుస్తాయి. మార్పులికి మూలమైన సామాజిక వాస్తవికత కళ్ళకి కడుతుంది. అప్పుడు యే విలువల్ని సమర్థించి యే విలువల్ని తిరస్కరించాలో ప్రేక్షకులకు తేలిగ్గా తెలిసి పోతుంది.

ఈ లక్షణం పాత 'పాప్యులర్' సినిమాల్లో కొంతైనా వుంది. సాంఘిక జీవితాన్ని జానపద చట్రంలో కుక్కుతున్న నేటి కమర్షియల్ సినిమాల్లో ఈ లక్షణం లేదు. పీపుల్స్ ఎన్‌కౌంటర్ యీ లక్షణంతో వచ్చుంటే దీని రూపు రేఖా విలాసాలు మరోలావుండేవి.

నక్సలైట్ ఉద్యమ చైతన్యంతో గిరిజనులు పెత్తందారుల్ని ప్రతిఘటించి ప్రశ్నించేవారు. పెత్తందార్లు అనేక రకాల హింసలతో అణిచేసేవారు. అయినా ప్రజల పోరాటం ఆగకపోతే రాజ్యహింస పోలీసుల రూపంలో రంగప్రవేశం చేసేది. శాంతిభద్రతల పేరు మీద గిరిజనుల్ని వారికి వెన్నుదన్నుగా వున్న అన్నల్ని

హింసించి బూటకపు ఎన్‌కౌంటర్లతో అణిచేవేడి. అయినా తట్టుకుని పోరాటోద్యమం నిలవగల్గితే అది పెత్తందార్ల హింసని రాజ్యహింసని ప్రతిహింసతో ప్రతిఘటిస్తూ వుండేది. సమస్యల్ని సంఘటితంగా పరిష్కరించుకునే చైతన్యాన్ని ప్రజల్లో పెంచుతూ ముందుకు పోయేది. ఘటనా ప్రతిఘటనల క్రమం యిలా గతితార్కిక హేతువులతో పతాక స్థాయికొచ్చేది.

అప్పుడు రాజ్యాంగ చట్టాలికి లోబడి ప్రజల్ని రక్షిస్తామని ప్రమాణాలు చేసిన వారు అతిక్రమించి యెలా బీభత్సాన్ని సృష్టిస్తున్నారో తేలిగ్గా తెలుస్తుంది. చట్టాల పాక్షికతత్వం బయటపడుతుంది. అవి పెత్తందార్ల ప్రయోజనాల్ని యెలా కాపాడుతున్నాయో కళ్ళకి కడుతుంది. ఈ చట్టాల్ని అతిక్రమించైనా పీడితప్రజల సంఘటిత చైతన్యాన్ని పెంచుతామని ప్రమాణం చేసిన వారు యెలా ప్రాణత్యాగాలతో స్టేట్ బీభత్సాన్ని ప్రతిఘటిస్తున్నారో బొమ్మకడుతుంది. సినిమా చూసిన వారికి యెవరిది హింసో యెవరిది ప్రతిహింసో అర్థమైపోతుంది.

ఇలా వచ్చే సినిమాని ప్రభుత్వం విడుదల కానివ్వదు. అయినా యిలా తీసే ఉద్దేశం ఉషాకిరణ్ నిర్మాతకి లేదు. ఆయనగారి దృష్టిలో ఉద్యమానిది హింస: ప్రభుత్వానిది ప్రతిహింస. అయితే ఈ దృష్టితోనే తీయవచ్చును. ఎవరూ కాదనరు.

ఈ దృష్టితో తీస్తే అసమానతలున్నా సమాజంలో హింస యెలా లేదో చూపాలి. రాజ్యాంగ యంత్రం- పెత్తందార్లతో యే సంబంధమూ లేకుండా- స్వతంత్రంగా యెలా సాగుతోందో చిత్రించాలి. నక్సలైట్ ఉద్యమం హింసలేని చోట ప్రజలను యెలా రెచ్చగొడుతోందో చూపించాలి. ఆ హింసని ప్రతిఘటించడానికే పెత్తందార్లు ప్రతిహింస చేస్తున్నారని చెప్పాలి. రాజ్యం తన చట్టాలికి లోబడే ప్రతిహింస చేస్తోందని వివరించాలి. ఇలా వచ్చిన సినిమా యెంత అబద్ధమో ఆలోచించకుండానే ప్రేక్షకులకు అర్థమైపోతుంది!

అందుచేత సమాజంలోని అసమానతలే హింస. ఆ హింసని అలంబనం చేసుకున్న పెత్తందార్ల వల్లే సమస్యలు పుడుతున్నాయి. ఈ వాస్తవాన్ని రామోజీరావు కూడా అంగీకరించక తప్పదు. అప్పుడు ప్రభుత్వం ఆ సమస్యలను పరిష్కరించి ఉద్యమ హింసకి అవకాశం లేకుండా చెయ్యాలి. అందుకే చట్టాలున్నాయంటే ఉద్యమం వచ్చేదాకా వాటినెందుకు అమలు చెయ్యలేదు? ఆ తర్వాత, సమస్యలకు మూల

మైన పెత్తందార్ల కొమ్ముకాస్తున్న ప్రభుత్వానిది హింసా లేక ప్రతిహింసా? అంగీక రిస్తే యిలాంటి సవాలక్ష ప్రశ్నలకి సమాధానం చెప్పాలి. చెప్పడం మొదలుపెడితే చిక్కుల్లో పడకతప్పదు.

చిక్కేమిటంటే భూమి కేంద్ర సిద్ధాంతాన్ని సమర్థిస్తానని గురువుకు మాటిచ్చిన కెప్లర్ ప్రయోగాలు చేసి చేసి చివరికి సూర్యకేంద్ర సిద్ధాంతాన్ని సమర్థించాడు. అలాగే ప్రభుత్వానిది ప్రతిహింస, ప్రజా ఉద్యమానిది హింస అని ప్రజలముందు ప్రకటించిన రామోజీరావు చివరికి ప్రజా ఉద్యమానిది ప్రతిహింస, ప్రభుత్వానిదే హింస అని ప్రకటించాల్సిన దురవస్థలో పడిపోతాడు.

శాస్త్రీయమైన సత్యాన్వేషణకున్న శక్తి ఇది. అందుకే సత్యాన్ని తలకిందులు చేసి, చెప్పదల్చుకున్న విషయానికి అనువైన, జానపద చట్రంలో పీపుల్స్ ఎన్‌కౌంటర్ తీశాడు.

పాత్రలు జానపద కథల్లోలా కొన్ని- ఎస్.పి, డా॥ జ్యోతి- పూర్తిగా మంచివి. మరికొన్ని- భూస్వామి, దళారి- పూర్తిగా చెడ్డవి. మరమనుష్యుల్లాంటి నక్సలైట్లు- కేతిగాళ్ళు వంటి పోలీసులు. ఇన్‌ఫార్మర్ చుక్కాడు, డూప్ గద్దరు, ఫారెస్ట్ సిబ్బంది, గిరిజనులు, వీళ్ళెవ్వరూ రాగద్వేషాలున్న మనుష్యుల్లా మసల్లేదు. జానపద రీతిలో మంచి చెడ్డల తత్వాలుగా విడగొట్టబడ్డాయి. జానపద పాత్రల్లాగే కృత్రిమంగా సన్నివేశాలకి కావల్సిన పాత్ర పోషణా, రస పోషణా చేశాయి.

నిజానికి నక్సలైట్ ఉద్యమానికి ఊపిరిలు వూదుతున్న పార్టీలెన్నో వున్నాయి. వాటికి ప్రజల్లో పనిచేస్తున్న ప్రజాసంఘాలున్నాయి. వాటి పాత్రనిగాని, పాటల్నిగాని యీ సినిమా ముట్టుకోలేదు. దీన్నిబట్టి ఉషాకిరణ్ 'ఎన్‌కౌంటర్' వాటి మీద కాదని తెలుస్తుంది.

కృత్రిమ పాత్రల సన్నివేశాల కల్పనతో నమ్మించడం కష్టం. కనుక పెత్తం దార్లు, ప్రభుత్వోద్యోగులు ప్రజల్ని పీడిస్తున్నారన్న అంశం వుంది నారదుళ్ళా అది పాడిన డూప్ గద్దర్ వున్నాడు. వేటూరి చేత మార్చించి మాప్లేయించిన జననాట్య మండలి పాటలున్నాయి. అవీ అసత్యాలును, అర్థ సత్యాలను కలిపి ముద్దచేసిన రీతిలో వున్నాయి. ఘటనలు గతితార్కికమైన హేతువులతో పరస్పర చర్యల సమాహారంగా సాగవు. ఏకపక్షంగా ఫార్ములా దృశ్యాల అక్రమ సమాహారంగా సాగుతాయి. పాటలకి ఘటనలకి ప్రాణమైన రాజకీయోద్యమం, దానిలో భాగమైన పార్టీ సాధించిన పోజిటివ్ అంశాలు వుద్దేశపూర్వకంగానే విర్మించారు. కనుక ఉషాకిరణ్ వారి "పీపుల్ చేసిన ఎన్‌కౌంటర్" పీపుల్స్‌వార్ మీద మాత్రమే.

స్వతంత్రంగా ఆలోచించగల్గిన వారికి యీ సినిమా చేసిన కుట్ర స్పష్టమవుతుంది. పీపుల్స్‌వార్ పనిని ముక్కలు చేసింది. పీపుల్‌ని చైతన్యవంతం చేసే పనంతా డా॥ జ్యోతి కిచ్చింది. వార్‌ని మాత్రం అన్నల కిచ్చింది. వారు ప్రజలకు దూరంగా అడవుల్లో వుంటారన్న భ్రమ కల్గించింది. పార్టీ ప్రజాసంఘాల ప్రసక్తి వదిలేసింది. ఏ రాజకీయ నిర్మాణానికీ చెందని జ్యోతి వ్యక్తిగతంగా ప్రజలచేత చట్టబద్ధమైన పోరాటాలు చేయిస్తోందంది ప్రజలప్రమేయం లేకుండా అన్నలు ఆయుధాలతో 'హింస' చేస్తున్నారంది. ఆ హింసను అరికట్టేందుకు పోలీసులు - ప్రభుత్వం - ప్రతిహింస జరుగుతోందంది. ఈ హింసా ప్రతిహింసల మధ్య ప్రజలు చస్తున్నారంది. వాటిని మాన్పించే ప్రయత్నంలో నేటి ప్రజాస్వామ్య దేవత జ్యోతి ప్రాణాలర్పించిందంది. వీటిలో అసత్యాలెన్నో, అర్థసత్యాలేన్నో ప్రజలకు బాగా తెలుసు.

తాను కనపడకుండా కుట్రచేసి ఈ సినిమాను ప్రేక్షకుల ముందుంచిన రామోజీరావు ప్రజలు వేరు!

సత్యం, కైలాసాన్ని ప్రభుత్వం హత్య చేసినపుడు వాస్తవాన్ని వక్రీకరించి "నరకాసురవధ" అని పత్రికలు ప్రచారం చేశాయి. విప్లవోద్యమం పురోగమించే క్రమంలో చచ్చుబడిపోయే మధ్యతరగతి ప్రజల సంఖ్య తగ్గుతుంది ప్రభుత్వానికి, పెత్తందార్లకీ మౌత్‌పీసులైన పత్రికలు ఆ సంఖ్య నిలుపుకుందుకి లేదా పెంచుకుందుకి శాయశక్తులా ప్రయత్నిస్తాయి.

ఈ ప్రయత్నంలో భాగంగా యీ మధ్యన అవి కొత్త యెత్తేసెత్తేయి. నక్సలైట్లు, ప్రభుత్వం ప్రజల కోసమేనంటూ ప్రజలను చంపుతున్నారన్న నినాదమే ఆ యెత్తు. గుత్త పత్రికల్లో ఒకటైన "ఈనాడు" చేసే ఆ వినాదానికి సినిమా రూపమే పీపుల్స్ ఎన్‌కౌంటర్. ఈ ప్రజలనే ఆలోచించమని సినిమా చివర్లో వ్యాఖ్యానం కూడా చెప్పించారు.

సినిమా విడుదలయ్యాక జననాట్యమండలి పాటలు వాడుకోడాన్ని సమర్థిస్తూ చిత్రమైన వాదం తలెత్తింది. జానపద సంస్కృతి జనానిది. అంచేత ఆ బాణీల్ని అందరూ వాడుకున్నట్టే ఉషాకిరణ్ వారు వాడుకున్నా తప్పులేదని దాని సారాంశం. ఈ వాదం ఎంతవరకూ సమంజసమో చూద్దాం.

జననాట్యమండలి పాటలు కేవలం జానపద పాటలు కావు. ప్రజల్లో వున్న జానపద బాణీలను తీసుకుని ప్రజల్లో పోరాటోద్యమ చైతన్యాన్ని పెంచే భావాలతో మల్చిన పాటలవి. ప్రజల బాణీలను మారుతున్న కాలానికి అనుగుణంగా వినియోగించుకొనే హక్కు ప్రజలకే వుంటుంది. లేదా ప్రజల పక్షం వహించిన వాళ్ళకి వుంటుంది. ఆ పోరాట పాటల్ని తీసుకుని, కావల్సిన విధంగా మార్చుకుని, ఆ ఉద్యమం వేళ్ళతోనే ఉద్యమం కళ్ళు పొడిచే వాళ్ళకి ఆ హక్కు వుండదు.

ప్రజల శ్రమను శ్రమ ఫలితాలను హక్కుభుక్తం చేసుకునే పాలకవర్గాలు యీ వాదాన్ని ఆమోదించవు. అందులో భాగంగానే యిటువంటి సినిమా నిర్మాతలు ప్రజల పోరాట పాటల్ని వాడుకోరాదనే అభ్యంతరాన్ని ఆమోదించరు. కాని జన నాట్యమండలి పాటలు విప్లవీకరించబడినవి. కనుక అవి విప్లవకర వర్గాలికే చెందు తాయి. వాటిని యథాతథంగా వాడుకునే హక్కుకూడా ఉషాకిరణ్ వంటి నిర్మాణ సంస్థలకుండదు. ఇక నక్సలైట్ల హింసను ప్రభోదించే పాత్రలుగా పాటలుగా వక్రీక రించి చిత్రించడం ప్రజల బహిరంగ విచారణకు గురయ్యే నేరమే.

ఏతావాతా చివరికి తేల్తున్నదిది. ఉషాకిరణ్ వారి పీపుల్ 'ఎన్‌కౌంటర్' చేసింది ప్రభుత్వ యంత్రాంగం మీదకాదు. నక్సలైట్ ఉద్యమం మీద.

ఇప్పటికే నక్సలైట్ ఉద్యమ ప్రభావంతో చాలా సినిమాలొచ్చాయి. ఋత్విక్ ఘటక్ బెంగాలీ సినిమా "జుక్త గప్పో అవర్ తప్పో" ఉద్యమం త్యాగశీలతని మెచ్చుకుంది. బలహీనతల్ని బైటపెట్టింది. మృణాళ్‌సేన్ "కలకటా" సామాజిక నేపథ్యాన్ని విశ్లేషించింది. ఉద్యమం పుట్టుకకు మూలాన్ని చూపింది. నెగటివ్‌గా వచ్చిన సినిమాలున్నాయి. నక్సలైట్ ఉద్యమం అరాచకం అంది అబ్బాస్ "నక్సలైట్". అవునని వంత పాడింది పటాభి "ఛండమారుత".

ఇక తెలుగులో వచ్చినవి జానపద ధోరణిలోనే వచ్చినా దీనికన్న మెరుగే. ఉదాహరణకి నారాయణమూర్తి సినిమాలు - ప్రజంటేషన్ 'క్రూడ్'గా వుండచ్చు. హీరోయిజం పెనువిషకోరకాటు నుంచి తేరుకోకపోయుండచ్చు. ఉద్యమం మీద సినిమా సాధనం మీదా అవగాహన లేకపోవచ్చు. కాని ఆలోచనల్లోనైనా అతనికి ఉద్యమం మీద సానుభూతి విశ్వాసం వున్నాయని అతని సినిమాలు చూస్తే తెలుస్తుంది. వాటన్నింటికీ భిన్నంగా ఉద్యమం వేళ్ళతో ఉద్యమం కళ్ళు పొడవాలని చేసిన ప్రయత్నమే ఉషాకిరణ్ "పీపుల్స్ ఎన్‌కౌంటర్". పైకిది ప్రస్తుత పరిస్థితిని ఎక్స్‌ప్లాయిట్ చేసి లాభాలార్జించే ప్రయత్నంలా కనిపిస్తుంది కాని కాదు.

ఈనాడు అంతర్జాతీయంగానూ జాతీయంగాను కమ్యూనిష్ట్ వ్యాపారులు కమ్యూనిజం వేళ్ళతోనే దాని కళ్ళు పొడుస్తున్నారు. అంకుల్ శ్యాముల ప్రజా స్వామ్యాన్ని ఆకాశానికెత్తుతున్నారు. తల్లి పుట్టిల్లెరిగిన కమ్యూనిష్ట్ వ్యాపారి యెంత ప్రమాదకారో లెనిన్ చెప్పాడు. అలాంటి ప్రమాదకారుల ప్రయత్నాల్లో ఓ ప్రయత్నం యీ సినిమా.

ఉషాకిరణ్ సినిమాల్లో సూపర్‌స్టార్ హీరో దర్శకులుండకపోయినా అది అనుసరిస్తున్నది వారి కమర్షియల్ నిర్మాణ ధోరణినే. ఈ సినిమాలో నిర్మాత తాను చెప్పదల్చుకున్న విషయం చెప్పి ప్రజల్ని ఆలోచించమన్నారు. చరిత్ర నిర్మాతలైన ప్రజలు తప్పకుండా ఆలోచిస్తారు. ఎవరిది హింసో ఎవరిది ప్రతిహింసో తొందర్లోనే తీర్పు చెబుతారు.

SRJANA Telugu Monthly May 1991
Regd. No. with the Registrar of Newspapers for India 10953/67

సృజనకు ఆర్థిక, హార్దిక సహకారాన్ని అందించండి !

1990 జనవరిలో మళ్ళీ ప్రారంభమైన 'సృ జ న' తీవ్రమైన ఆర్థిక సమస్యలను, రచనల కొరతను ఎదుర్కొంటున్నది. సృజన పట్ల పాఠకులలో, విప్లవోద్యమ సానుభూతిపరులలో కనబడుతున్న వి స్తృత ఆదరణ ఆర్థిక రూపం లోకి పరిణమించడం లేదు. సృజన చందాదారుల సంఖ్య, ఏజెంట్ల సంఖ్య గణ నీయంగా పెరగడం లేదు. సృజన మీ పత్రిక. సృజన ప్రజల పత్రిక. సృజనను గతంలో కూడ ప్రజలే తమ కంటికి రెప్పలా కాపాడుకున్నారు. మళ్ళీ ఒకసారి హెచ్చు సంఖ్యలో చందాలు చేర్పించడం ద్వారా, విరాళాలు సేకరించడం ద్వారా, కొత్త ప్రాంతాలలో ఏజెంట్లను కుదిర్చిపెట్టడం ద్వారా, ఏజెంట్లు సక్రమంగా బకాయిలు చెల్లిస్తున్నారో లేదో కనుక్కోవడం ద్వారా ప్రజలే సృజన జీవనానికి బాసటగా నిలవవలసి ఉన్నది. సృజనను రక్షించుకునే బాధ్యతను విప్లవ సాహిత్యోద్యమ సానుభూతిపరులు స్వచ్ఛందంగా స్వీకరించవలసి ఉన్నదని మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాం.

సృజన సంవత్సర చందా రు. 40. విడి ప్రతి రు. 4.

* సృజనకు విరివిగా చందాలు సేకరించండి !
* సృజనను పదికాలాల పాటు నిలిపి ఉంచేందుకు మీ వంతు కర్తవ్యం నిర్వహించండి !

SRJANA Rs. 4/-
Flat 11, Block 2,
MIG II, Baghlingampalli,
Hyderabad-500 044.